ఓం భూర్భువః స్వః తత్సవితుర్వరేణ్యం భర్గోదేవస్య ధీమహి ధియోయోనః ప్రచోదయాత్



# యుగశక్తి  గాయత్రి



ఓం వందే భగవతీం దేవీం శ్రీరామంచ జగద్గురుం
పాదపద్మే తయోః శ్రిత్వా ప్రణమామి ముహుర్ముహుః

ప్రఖర ప్రజ్ఞ — సజల శ్రద్ధ


సంకల్పం - సంరక్షణ
వేదమూర్తి, తపోనిష్ఠ, పండిత
**శ్రీరామ శర్మ ఆచార్య**
శక్తి స్వరూపిణి
**మాతా భగవతీ దేవి శర్మ**

ప్రధాన సంపాదకులు
**డాక్టర్ ప్రణవ్ పండ్యా**
సంపాదక మండలి
కందర్ప రామచంద్రరావు
డాక్టర్ మారెళ్ళ శ్రీరామకృష్ణ
పొన్నూరు హైమవతీశాస్త్రి
ముక్కామల రత్నాకర్
డి.వి.ఆర్.మూర్తి

సంపుటి 15 - సంచిక 7
**నవంబర్ 2010**
**విడిప్రతి రూ॥ 10.00**
**సం॥ చందా రూ॥ 120**
**3 సం॥ చందా రూ॥ 350**
**10 సం॥ చందా రూ॥ 1116**

Please send Drafts & Money Orders in favour of
**SRI VEDAMATA GAYATRI TRUST, BUSINESS DIVISION, HYDERABAD**


## ఆధ్యాత్మికత ఆనందమయం

ఆత్మ స్వరూపం ఆనందమయం. ఆత్మజ్ఞానాన్ని పొందిన వ్యక్తి నిరంతరం ఆనందంగా ఉంటాడు. ఆధ్యాత్మికతకు మరో పేరు ప్రసన్నత, ఆనందం. ఆనందంగా ఉండడం చేతకాని వ్యక్తి ఆత్మనూ తెలుసుకోలేడు, పరమాత్మనూ తెలుసుకోలేడు. దుఃఖంతో విలవిలలాడే వ్యక్తి, ఉద్విగ్నతలో మునిగే వ్యక్తి, క్షోభతో కుమిలిపోయే వ్యక్తి అనాత్మ తత్వాలకు వాహకుడు మాత్రమే. కోపంతో ఊగిపోయే వ్యక్తి, ఆవేశంలో చిందులు త్రొక్కే వ్యక్తి ఆస్తికతకు ఆమడ దూరంలో ఉంటాడు.

ఈ ప్రపంచంలో ఉన్నదంతా నవ్వడానికే సృష్టించబడింది. చెడ్డవీ, అశుభకరమైనవీ మన ధైర్యానికి, మన కార్యశూరతకూ సవాళ్ళు. పరీక్షలో ప్రశ్న పత్రాలను చూచి ఏడ్చే విద్యార్థులను ఎవ్వరూ అధ్యయనశీలురుగా పరిగణించరు. చిన్న చిన్న కష్టాలనూ, వైఫల్యాలనూ, ప్రతికూలతలనూ చూచి ఏడవడం మొదలు పెట్టిన వ్యక్తికి ఆధ్యాత్మికత ఉన్నదని ఎవరు నమ్ముతారు? మన శౌర్య సాహసాలను పెంచడానికీ, మన ధైర్య స్థైర్యాలను గట్టిపరచడానికీ, మన శక్తి సామర్థ్యాలను వికసింపచేయడానికే ప్రతికూల పరిస్థితులు వస్తాయి. జీవితం సాఫీగా సాగిపోతూ ఉంటే అది అందవిహీనంగా, వికారంగా, కళాకాంతులు లేనిదిగా తయారవుతుంది. ఎందుకంటే సాఫీగా, సరళంగా రోజులు గడిపేవారిలో ఎలాంటి విశిష్టతా కనిపించదు. ఎలాంటి ప్రతిభా ఉండదు. అసలు సవాళ్ళు లేకుండా ఈ ప్రపంచంలో ఎక్కడయినా ఎవరయినా ఎపుడయినా జీవించగలరా?

కొత్త కొత్త విజయాలకు మనం నవ్వుకోవాలి. ఇంతవరకు ఇన్ని లభించినందుకు సంతోషాన్ని వ్యక్తపరచాలి. భవిష్యత్తులో శుభాలు కలుగుతాయని విశ్వసించి హర్షోల్లాసాలతో జీవించాలి.

★★★


పత్రిక అందనివారు ఈ క్రింది నంబరును సంప్రదించగలరు. **9949111175**


పత్రికకు సూచనలు, సలహాలు ఇవ్వదలచినవారు క్రింది నంబర్‌ను సంప్రదించగలరు. **9989659905**


చిరునవ్వులో స్వర్గం ఉన్నది.

# విషయ సూచిక


1. **సంపాదకీయం :** ఆధ్యాత్మికత ఆనందమయం 1
2. **విషయసూచిక-సద్గురు వచనామృతం :** మానవ జీవన తత్వజ్ఞానం 2
3. **వేదమంత్రం :** ఉన్నతి 3
4. **గాయత్రీ విద్య-2 :** గాయత్రీ సాధనలోని అభిన్న అంగం స్వర విజ్ఞానం 4
5. **బాలల భవితకు బంగారు బాట-14 :** వ్యక్తిని కాదు - వ్యక్తిత్వాన్ని గౌరవించు 6
6. **ధారావాహిక ప్రజ్ఞోపనిషద్ : ప్రథమ మండలం - చతుర్ధోధ్యాయం :** మనోయోగ మార్గము 7
7. **యుగ గీత-4 : మొదటి అధ్యాయం-ఉత్తరార్థం :** సద్గురు రూపంలో భగవంతుని స్వీకరించడం 9
8. **సూర్య విజ్ఞానం - 3 :** సమస్త బ్రహ్మాండం ఒక చైతన్య శరీరం 12
9. **శబ్ద బ్రహ్మ :** శబ్ద శక్తితో రిద్ధి సిద్ధులు 14
10. **రంగుల విజ్ఞానం :** రంగులలో అందమే కాదు శక్తి కూడా ఉన్నది 16
11. **గాయత్రీ 24 శక్తి ధారలు :** భవాని 18
12. **మనం-మన ఆరోగ్యం :** చందనస్య మహత్పుణ్యం పవిత్రం పాప-రోగ నాశనం 19
13. **సాధనా విజ్ఞానం :** ఉపాసన మనిషిని దేవమానవుడిగా మారుస్తుంది 21
14. **తత్వ దర్శనం :** దేవపూజలో దాగిన రహస్యాలు 23
15. **ఆదిశక్తి లీలా కథలు-6 :** సాధనలోని ఆటంకాలను తొలగిస్తుంది అర్గలా స్తోత్రం 25
16. **పూజ్య గురుదేవుల అమృత వాణి :** మనిషి దేవతగా మారాలి, పృథ్వి స్వర్గం అవ్వాలి 27
17. **నా వారితో నా మాట : 2011-2012 జన్మ శతాబ్ది సంవత్సరం :** ఇంకా 70 రోజులు మాత్రమే ఉన్నాయి 30
18. **దేవ సంస్కృతి విశ్వ విద్యాలయం : వ్యక్తిత్వ పరిష్కారము** నేటి యువతరానికి కావాలి దిశానిర్దేశం 33
19. **శతాబ్ది గాయత్రీ మంత్ర లేఖన సాధనా మహా అభియానము** 35
20. **గురుదక్షిణ చెల్లించుటకు ఇదే తగిన సమయం** 37
21. **ఆరోగ్యమే మహాభాగం-2 :** హోమియో వైద్య సేవ 39
22. **వేమన వేదం-నవజీవన నాదం - 2** 41
23. **పూజ్య గురుదేవుల జన్మశతాబ్దికై చేయవల్సిన కార్యములు** 43
24. **వార్తలు :** ఆధ్యాత్మిక జ్ఞాన వికాస శిబిరము 44
25. **అక్షరాల ఆట :** పదగాయత్రి-2 48


## సద్గురు వచనామృతం



### మానవ జీవన తత్వజ్ఞానం

ప్రభాత కాలం లావా పక్షికి ఇష్టం. సాయంకాలపు ధూళి గుడ్లగూబలకు ఇష్టం. మకరందము తేనెటీగకు ఇష్టం. శవం రాబందుకు ఇష్టం. అలాగే జీవితం మనిషికి ఇష్టం. మానవ జీవితం ఎంత ఉజ్వలమైనా అది కళ్ళకు మిరుమిట్లుగొలుపలేదు. అది ఎంత మధురమైనా మోహం మొత్తదు. కుళ్ళిపోయి కృశించినా దాన్ని వదులుకోలేము. అయినా దాని అసలు విలువ ఎవరికి తెలుసు?

మూర్ఖులవలె జీవితం కంటే మరో వస్తువు విలువైనదని భావించకు. జీవితం నిస్సారమనీ భావించకు. కేవలం నీ స్వార్థం కోసం జీవించక ఇతరుల ప్రయోజనాన్ని పట్టించుకోవాలి.

బంగారంతో అయినా జీవితాన్ని కొనలేవు. వజ్రాల రాశులు ఖర్చు చేసినా గడచిన సమయం తిరిగి రాదు. కనుక ప్రతి క్షణాన్నీ సద్గుణాల సంపాదనలో వినియోగించడం బుద్ధిమంతుల లక్షణం. జీవితంలో నిరుపయోగమైన సమయాన్ని తొలగిస్తే ఇక మిగిలేదేమిటి? బాల్యం ముసలితనం, నిద్రించే సమయం వృధాగా కూర్చునే సమయం, జబ్బుపడ్డ రోజులు వీటిని జీవితంలోని మొత్తం రోజుల నుంచి తీసివేస్తే ఎన్ని రోజులు మిగులుతాయి?

*అఖండజ్యోతి, సెప్టెంబరు, 1953*

*– అనువాదం : శ్రీ సత్యనారాయణ గుప్త*

## పండుగలు

**డిసెంబరు 2010**

| | |
|---|---|
| 17-12-2010 | గీతా జయంతి |
| 21-12-2010 | శ్రీ దత్త జయంతి |
| 25-12-2010 | క్రిస్మస్ |

**జనవరి 2011**

| | |
|---|---|
| 15-01-2011 | సంక్రాంతి |
| 26-01-2011 | రిపబ్లిక్ డే |

[redacted]

ప్రేమించే హృదయమే స్వర్గం.

## వేద మంత్రం

# ఉన్నతి

**సత్యం బృహదతమగ్రే దీక్షా తపో బ్రహ్మ యజ్ఞః పృథివీం దారియన్తి ।**
**సానోభూతస్య భవ్యస్య పల్యురుం లోకం పృథివీ నః కృణోతు ॥**

**– (అధర్వణ వేదం 21/1/1)**

**భావార్థం :** ఎవరు పరమాత్మను, విద్వాంసులను ప్రేమిస్తారో, సత్యకర్ములు, జ్ఞానులు, జితేంద్రియులో వారు ఈ ప్రపంచంలో ఉన్నతి పొందుతారు. ఇంతవరకు ఇలాగే జరిగింది. ఇక ముందు కూడా  ఇలాగే జరుగుతుంది.

**సందేశం :** ఉన్నతి అని దేనిని అంటారు? చాలా మంది డబ్బు సంపత్తి ప్రోగుచేసుకోవటం, ఇల్లు వాకిళ్ళు, వాహనాలు, సౌకర్య సాధనాలను కూడబెట్టటాన్నే ఉన్నతి అని భావిస్తున్నారు. అందువల్ల అవినీతి పూర్వకంగా సంపాదించాలనే ఆశ పెరుగుతుంది.

వ్యక్తి, దేశమూ రెండూ కీర్తి పొందితే దానిని ఉన్నతి అంటారు. దేశ ఉన్నతికి, శక్తి సంపన్నతకు, గౌరవం పొందుట కొరకు ఆ దేశస్థులు తపస్వులు కావాలి. ఏదైనా ఉత్కృష్ట లక్ష్య సాధనకొరకు మధ్యలో వచ్చే అన్ని బాధలను ధైర్యంగా సహిస్తూ పురోగమించుట పేరే తపస్సు. యక్షుడు యుధిష్ఠరుని తపస్సు యొక్క లక్షణాలను అడిగినప్పుడు అతడిలా చెప్పాడు. కర్తవ్యాన్ని నిష్ఠతో ఆచరించుటే తపస్సు. తపస్సు యొక్క సారము ఇంద్రియాలను జయించుట. ఇంద్రియ నిగ్రహం లేకపోతే ఉన్నతిని ఊహించనే లేము. ఎంతవరకైతే మాయ, మోహము, లోభము స్వార్థము మీద విజయం సాధించి దేశహిత భావన పుష్టికాదో, నాలుగువైపులా దోపిడీ మోసపూరిత వాతావరణం ఉంటుందో, అంత వరకు మనుష్యుడు సుఖశాంతులకు ఎంతో దూరంగా మృగమరీచికలో తిరుగుతూ ఉంటాడు.

ఉన్నతికి అన్నింటికంటే ముఖ్యము మహోన్నత సత్యాన్ని తెలుసుకొని సత్యాచరణ యొక్క దీక్ష గైకొనుట. నిర్వివాద సత్యమేమంటే సమస్త బ్రహ్మాండము పరమేశ్వరుని నుండి ప్రకటితమైనది. ఆయన దీని కణకణములో నిండి ఉన్నాడు. లక్షల, కోట్ల సంవత్సరాల నుండి దీనికి గతిని ప్రదానం చేస్తున్నాడు. మనం కూడా ఆ పరమేశ్వరుని అంశలమే. మన కర్మల ఫలాలే మనకు వస్తాయి. ఆయన న్యాయ నిర్ణయశక్తి కర్మఫల విధానమును నిర్ణయిస్తుంది. ఈ జ్ఞానము మనకు సంయమమునకు ప్రేరణనిస్తున్నది, ఉత్కృష్టతను జోడిస్తున్నది.

ఇంద్రియ నిగ్రహము, సత్యాచరణ లాభం కలిగి మనుష్యుడు తన క్షుద్ర స్వార్థభావం వదలివేస్తాడు. దేశవాసులలో దేశభక్తి జాగృతమవుతుంది. పౌరులందరు ఇతరుల కష్టము తమ కష్టముగా భావించి దానిని తొలగించుటకు సహకరిస్తారు. పరస్పరం ఇంకొకరి ఉన్నతి కొకరు సహకరిస్తారు. దేశమంతట ఆత్మీయభావన బలపడుతుంది. **దేశం బలమ్ ఓజశ్చతామ్** దేశం, దేశంలోని ప్రజలందరు ఓజస్వి, తేజస్వి, వర్చస్వులవుతారు. ఈ ఉన్నతి ముందు ప్రపంచంలోని గొప్ప గొప్ప దేశాలు కూడా వంగి నమస్కరిస్తాయి.

విత్తనం గొప్పతనమేమిటి? విలువలేకుండా ఒక గోతంలో కట్టబడి, ఇంటిలో ఒక మూల పడి ఉంటుంది. దీనినే పొలంలో నాటితే కొద్ది సమయంలోనే ఒక విశాలవృక్షం రూపంలో వికసిస్తుంది. ఇందుకోసం అది స్వయంగా నశించాలి. ఎరువు నీళ్ళ రూపంలో సమాజం యొక్క సహకారం తీసుకోవాలి. స్వార్థభావ త్యాగం, సమాజం యొక్క సహకారం, రెండూ కలిసి ఉన్నతికి బంగారు సోపానాలు నిర్మిస్తాయి. తాము ఒక్కరే అంతా చేయగలము అని ఎవరైనా అనుకుంటే అదివారి భ్రమ మాత్రమే. ఇతరుల సహకారముతో పాటు తమ తపస్సాధనతో కష్టమును సహిస్తూ, మనుష్యుడు పురోగమిస్తాడు.

పరమపిత పరమేశ్వరుడు తన ప్రియపుత్రులకు ఇచ్చిన నిర్దేశం ఇదే. అందుకొరకు సర్వగుణ సంపన్నమైన శరీర నిర్మాణం చేశాడు. దానిని తన సమస్త శక్తులతో నింపేశాడు. సహాయం చేయుటకు అందుబాటులో ఉన్నాడు. షరతు ఏమిటంటే మనుష్యుడు నిస్వార్థభావముతో పురుషార్థంలో నిమగ్నం కావాలి. ఉన్నతి కొరకు ఈశ్వరుని శక్తిలో పూర్తి విశ్వాసముంచుతూ తన పూర్తి సామర్థ్యము, ప్రతిభను ఉపయోగించి లోకహిత కార్యాలు చేయుచుండుటయే జీవిత ముఖ్య లక్ష్యం.

సమాజోన్నతికి ఈ సత్యమార్గంలో పురోగమించుటకు ప్రేరేపించుట విద్వాంసుల కర్తవ్యము.

★★★

[redacted] వచ్చు. ఏది చదవాలో, ఎందుకు చదవాలో కొద్దిమందికే తెలుసు.

గాయత్రీ విద్య-2

# గాయత్రీ సాధనలోని అభిన్న అంగం స్వర విజ్ఞానం

గాయత్రి అంటే ప్రాణవిద్య. ప్రాణశక్తి యొక్క సంతులన అభివృద్ధి గాయత్రీ సాధనలోని అభిన్న అంగములు. ఆనందం యొక్క అనుభూతి ప్రాణశక్తి ఉంటేనే సాధ్యపడుతుంది. ప్రాణశక్తి ఎంత ఎక్కువగా ఉంటే అనుభూతి కూడా అంత బాగుంటుంది.

శరీరంలోని 72,000 నాడుల ద్వారా ప్రాణశక్తి నిరంతరం ప్రవహిస్తూ ఉంటుంది. జ్ఞానేంద్రియములు, కర్మేంద్రియములు వలె ప్రాణమును కూడా అనుభూతి ఇంద్రియమని చెప్తారు. ఈ అనుభూతి ఐదు రకాలుగా ఉంటుంది. శరీరం బయట నుంచి శ్వాస ద్వారా, ఆహారం ద్వారా వచ్చే అనుభూతులు శరీరంలో బలమును వ్యాపింపచేసే అనుభూతి శక్తిని ప్రాణం అంటారు. మలమును బయటకు నెట్టివేసే అనుభూతి శక్తి అపానం. మల మూత్రములు, చెమట, కఫం, వీర్యం, రజస్సు మొదలైన విసర్జనలు, తల్లి గర్భం నుండి శిశువును బయటకు నెట్టివేసే సమస్త క్రియలు అపాన శక్తితో మాత్రమే సంభవమవుతాయి. జీర్ణ రసముల ఉత్పాదన వితరణ (పంపకం) "సమానం" యొక్క పని. రక్త సంచారం, నాడీ మండలం మొదలైనవి "వ్యానం" పరిధిలోకి వస్తాయి. శరీరంలోని ధాతువులను ధారణ చేసి శరీరానికి బలమునిచ్చి ఉన్నతి స్థితిలో ఉంచే పని ఉదానం చేస్తుంది. ఈ విధంగా ప్రాణం, అపానం, సమానం, వ్యానం, ఉదానం ముఖ్యమైన ఐదు ప్రాణేంద్రియములుగా చెప్పబడ్డాయి. వీటితో పాటు ఐదు ఉపప్రాణములున్నాయి. ఈ పది ప్రాణేంద్రియములను ఒకే ప్రాణ శక్తి క్రియాశీలంగా ఉంచుతుంది. ఈ ప్రాణశక్తికి మూడు ముఖ్యమైన మార్గములు ఉన్నాయి. ఇడా, పింగళ, సుషుమ్నా. ప్రాణశక్తి ఈ మూడు నాడుల నుండి 72,000 నాడులలో ప్రవహిస్తుంది. ఈ మూడే మనిషికి స్వరములు అవుతాయి. ఈ విధంగా స్వరం వస్తుతః ప్రాణశక్తి ప్రవాహమే. స్వరవిద్యా విజ్ఞానం ప్రాణ విద్య యొక్క అభిన్న అంగము.

ఇడ, పింగళ, సుషుమ్న నడకలపై ధ్యాస ఉంచడం వల్ల ప్రాణ తత్వములపై అధికారం లభిస్తుంది. ప్రాణ ప్రవాహం ద్వారా ఎన్నో మహత్వపూర్ణమైన విషయములు తెలుసుకోవచ్చు. సాలీడు వర్షం కురవబోతుందని చాలా ముందుగానే తెలుసుకోగలుగుతుంది. దానికి తగిన ఏర్పాట్లు ముందుగానే చేసుకుంటుంది. ఎందుకంటే వాయువుతో పాటు వర్షం సూక్ష్మంగా కలిసి ఉంటుంది. సాలీడు తన చేతనత్వం ద్వారా ఇంత సమయంలో ఇంత వేగంగా వర్షం పడుతుందని తెలుసుకోగలదు. కాని మనుష్యులు దీనిని అర్థం చేసుకోలేరు. సాలీడుకున్నటువంటి సూక్ష్మ వాయువును పరీక్షించే చేతనత్వం కన్నా అతి గొప్ప చేతనత్వం స్వరయోగికి లభిస్తుంది. అతను వర్షం గురించే కాదు, అంతకంటే సూక్ష్మమైన విషయములు, భవిష్యత్తులో జరగబోయే సంఘటనలు, మార్పులు మొదలైనవి తన దివ్యదృష్టితో తెలుసుకోగలడు. స్వరయోగికి ఈ శక్తి ప్రాణసాధనతోనే లభిస్తుంది. ప్రాణతత్వంపై పట్టు సాధించాలంటే ప్రాణప్రవాహముల గురించి తెలుసుకోవాలి. దీనివల్ల ప్రాణశక్తి సంరక్షణ అభివృద్ధి జరిగే తీరుతాయి. అనేక ఇతర లాభాలు కూడా లభిస్తాయి.

ప్రతి జీవికి పూర్ణ ఆయుష్షు పొందడం, ఎక్కువ కాలం జీవించడం శ్వాసక్రియ మీద ఆధారపడి ఉంటుంది. పూర్వకర్మల ఆధారంగా జీవించడానికి ఒక నియమిత సంఖ్యలో శ్వాసలను ఈశ్వరుడు ప్రసాదిస్తాడు. మామూలుగా ఈ శ్వాస సంఖ్య అయిపోగానే ప్రాణం నిలువదు. కాని ఈశ్వరుని ద్వారా పొందిన ఈ ఖజానాను ఎవరు ఎంత జాగ్రత్తగా ఖర్చు చేస్తారో వారు అంత ఎక్కువ కాలం జీవించి ఉంటారు. ఈ శ్వాసలను ఎంత వ్యర్థం చేసుకుంటే అంత త్వరగా మరణం సంభవిస్తుంది. సామాన్యంగా మనిషి రాత్రి పగలు కలిపి 21,600 సార్లు శ్వాస తీసుకుంటాడు. ఇంత కంటే తక్కువ శ్వాసలు తీసుకునే వారు ఎక్కువ కాలం జీవిస్తారు. ధనాన్ని ఎంత తక్కువగా ఖర్చుపెడితే అది అంతా తరిగిపోకుండా ఉంటుంది. మన శ్వాస యొక్క లెక్క కూడా ఈ విధంగానే ఉంటుంది. విశ్వంలోని సమస్త ప్రాణులలో **ఏ ప్రాణి ఎంత తక్కువ శ్వాసలు తీసుకుంటుందో, అది అంత ఎక్కువ కాలం జీవించి ఉంటుంది.** కుందేలు ఒక నిమిషంలో 38 సార్లు శ్వాస తీసుకుంటుంది. అది ఎనిమిది సంవత్సరాల ఆయువు ప్రాప్తించుకుంటుంది. నిమిషానికి 19 సార్లు శ్వాసతీసుకునే గుర్రం 35 సంవత్సరాల ఆయువు ప్రాప్తించుకుంటుంది. పాము నిమిషానికి 8సార్లు, తాబేలు నిమిషానికి 5 సార్లు తీసుకుంటాయి. వీటి ఆయుఃప్రమాణం ఇతర ప్రాణుల కన్నా చాలా ఎక్కువ. **నిమిషానికి తీసుకునే శ్వాస సంఖ్య తగ్గుతూ ఉంటే ఆయుఃప్రమాణం పెరుగుతూ ఉంటుంది.**

**[redacted]న ఆలోచనల తోడు ఉన్న వ్యక్తి ఎన్నడు ఏకాకికాడు**

మనిషి మామూలు పనులు చేసుకుంటున్నప్పుడు నిమిషానికి 12 సార్లు, పరిగెత్తడం, హడావిడిగా పనులు చేసుకుంటుంటే 18 సార్లు. రతి కర్మలో 26 సార్లు శ్వాస తీసుకోవడం జరుగుతుంది. అందువల్ల విషయలోలుల ఆయుష్షు తొందరగా తగ్గిపోతుంది. ప్రాణయామం చేసే యోగాభ్యాసి ఎక్కువ కాలం జీవించి ఉండగలుగుతాడు. ఊరికే కూర్చుంటే శ్వాస తక్కువ సంఖ్యలో ఉంటుంది. కనుక ఏ పని చెయ్యకుండా కూర్చుని ఉంటే ఆయుఃప్రమాణం పెరుగుతుందని అర్థం చేసుకోకూడదు. అలా చేసినట్లయితే శరీర అంగములు బలహీనమవుతాయి. శ్వాస వేగం కూడా పెరుగుతుంది. అందువల్ల అవసరమైన పనులు ఒక పద్ధతిగా చేయడం అత్యంత ఆవశ్యకం. ఇది ప్రాణసాధనలో ఒక ముఖ్యమైన అంగం.

శ్వాస ఎల్లప్పుడు పూర్తిగా లోతుగా తీసుకోవాలి. ఎప్పుడూ వంగి కూర్చోకూడదు. నాభి వరకు శ్వాస తీసుకోవడం వల్ల ఒక రకమైన కుంభకం జరుగుతుంది. శ్వాస సంఖ్య తగ్గిపోతుంది. మేరుదండం పై ఒక పల్చని జీవన తత్వం ప్రవహిస్తూ ఉంటుంది. ఇది సుషుమ్నను బలంగా చేసేందుకు సహాయపడుతుంది. ఈ విధంగా మస్తిష్కానికి పుష్టి లభిస్తునే ఉంటుంది. కాని మేరుదండం వంగి ఉంటే ఆ పల్చని పదార్థపు ప్రవాహం ఆగిపోతుంది. నిర్బలమైన సుషుమ్న మస్తిష్కానికి పోషణ ఇవ్వలేదు.

శీతలత్వం వల్ల అగ్ని మందగిస్తుంది. వేడివల్ల అగ్ని తీవ్రమవుతుంది. దీని ప్రభావం జీర్ణకోశంపైన కూడా పడుతుంది. సూర్యశక్తితో జీర్ణశక్తి వృద్ధి చెందుతుంది. అందువల్ల సూర్య స్వరంలో భోజనం చెయ్యడం ఉత్తమం. భోజనం చేసిన తర్వాత ఎడమ ప్రక్కకు తిరిగి పడుకోవాలి. ఎడమ ప్రక్కకు తిరిగి పడుకోవడం వల్ల దక్షిణ (సూర్య) స్వరం నడుస్తుంది. దీనివల్ల జీర్ణశక్తి అభివృద్ధి చెందుతుంది. వెల్లకిలా పడుకోవడం వల్ల సుషుమ్న స్వరం నడుస్తుంది. అందువల్ల నిద్రాభంగం అవుతుంది.

స్వర విజ్ఞానుల అనుభవం సర్వజనులకు చాల ఉపయోగకరం. బయటకు వెళ్లేటప్పుడు ఏ వైపు స్వరం నడుస్తుందో, ఆ శరీర భాగాన్ని చేతితో స్పృశించి, ఆ స్వరం యొక్క కాలును ముందుకు వేసి బయలు దేరాలి. కోపంగా ఉన్నవారి దగ్గరకు వెళ్ళవలసి వచ్చినప్పుడు నడవని స్వరం గల కాలుతో ముందు అడుగువేసి బయలుదేరాలి. అంతేగాక నడవని స్వరం వైపు ఆ వ్యక్తిని ఉంచుకొని మాట్లాడాలి. ఈ విధంగా చెయ్యడం వలన అతనిలో ఉన్న కోపాన్ని నడవని స్వరంలోని శాంత భాగం తన ఆకర్షణ ద్వారా లాగి శాంతింప చేస్తుంది. మనోరథాన్ని సిద్ధింప చేస్తుంది. గురువు, మిత్రుడు, అధికారి మొదలైన వారి దగ్గరకు మాట్లాడేటప్పుడు వామ స్వరం (ఎడమ శ్వాస) ఉపయోగకరం.

ఇడ స్వరాన్ని చంద్ర స్వరమని, పింగళను సూర్య స్వరమని చెప్పబడ్డాయి. వీటిని గంగ, యమున అని కూడా చెప్పబడ్డాయి. మధ్యలో ఉన్న సుషుమ్నను సరస్వతిగా పేర్కొన్నారు. ఇది ఒక సంధి స్థితి. కొంచం సేపు మాత్రమే ఉంటుంది. ముఖ్యంగా ఇడా, పింగళ స్వరాల పనులు వ్యవహారాలు మాత్రమే నడుస్తుంటాయి. వీటి మధ్య సంతులన చాల అవసరం. ఈ సంతులనాన్ని స్వర విజ్ఞానం ద్వారా సాధించుకోవాలి. ప్రాణ విద్యా సాధకులు ఈ రెండింటిలో సంయమం సాధించి ప్రగతిపథంలో నడుస్తారు. అందువల్ల గాయత్రీ సాధనలో స్వర విజ్ఞానమునకు ప్రత్యేక స్థానమున్నది.

*– అఖండజ్యోతి, డిశంబరు 2005*

*అనువాదం : శ్రీమతి టి. జ్ఞాన ప్రసూన*

## కమలా నెహ్రూ హితవు

*ఒకప్పటి భారతదేశ ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ భార్య కమలా నెహ్రూకు క్షయ వ్యాధి సంభవించింది. ఆ రోజుల్లో స్వాతంత్ర్య సమరం తీవ్ర స్థాయిలో ఉన్నది. నెహ్రూగారు బెనారస్ జైల్లో ఉన్నారు. బ్రిటిష్ ప్రభుత్వం ఆయనకు ఉత్తరం వ్రాసింది. దానిలో నెహ్రూగారు రాజకీయాలను వదిలినట్లయితే ఆయన భార్య సంరక్షణ కొరకు శాశ్వతంగా జైలు నుంచి విడిచివేస్తామని ఉన్నది. నెహ్రూగారి ముందుకు సమస్య వచ్చిపడింది. ఒక ప్రక్క ధర్మపత్ని పట్ల కర్తవ్యం, రెండవది దేశభక్తి. చివరకు ఆయన కమలా నెహ్రూను ఒక రోజు జైలుకు వచ్చి కలవమని కబురంపారు. కమలాజి జైలుకు వచ్చారు. అక్కడ ఉన్నవారిని ఆమె "పండిట్ జీకి జైలులో ఏమి పని ఇవ్వబడింది?" అని అడిగారు "వారు తాడు పేనుతారు" అని సమాధానం వచ్చింది. అది ఊహించుకోగానే ఆమె కన్నులలో నీళ్ళు నిండాయి. ఆమె హృదయంలో పతి పట్ల అవ్యాజ్యమైన ప్రేమ ఉన్నది.*

*కొద్ది సేపటికి జైలు తలుపులు తెరచుకున్నాయి. ఆమె భర్తను కలవటానికి లోపలకు వెళ్ళింది. జవహర్‌లాల్ నెహ్రూగారు ఆమెతో బ్రిటీష్ వారు వ్రాసిన లేఖ గురించి చెప్పారు. ఆమె ఇలా సమాధానం ఇచ్చింది. "మీరు దేశ భక్తితో, దేశహితం కొరకు సంతోషంగా కొనసాగండి. నా కొరకు దేశహితాన్ని త్యాగం చేయ్యవద్దు.*

*క్షయ వల్లే ఆమె చనిపోయారు. నెహ్రూగారు దేశహితమే సర్వోపరిగా భావించారు*

*– ప్రజ్ఞాపురాణం నుండి.*

**[redacted] ఒక పంట పొలం. దానిలో ఏదైనా పండించుకోవచ్చు.**



## బాలల భవితకు బంగారు బాట-14

# వ్యక్తిని కాదు-వ్యక్తిత్వాన్ని గౌరవించు

కన్యాకుమారి అనే పుణ్యక్షేత్రంలో విశ్వకర్మ అనే శిల్పి ఉన్నాడు. అతడు నిరుపేద. పొట్టకు, బట్టకు లోటు లేకుండా జీవిస్తున్నాడు. గొప్ప శివభక్తుడు. శివలింగాలను అందంగా చెక్కేవాడు. శివలింగాలకు అందం ఏమిటి? అనుకుంటున్నారా? "శివునికి ఏ అభరణాలు అవసరం లేదు. చూసేవారికి శివలింగం చెక్కడం చాలా సులభం" అనిపిస్తుంది కదూ! కాని ఆ విశ్వకర్మ చెక్కిన శివలింగాలలో జీవకళ ఉట్టిపడేది. మహా తేజస్సుతో వెలిగిపోయేవి. ఒక్క నిమిషం కన్నార్పకుండా చూశారంటే నాస్తికులకు కూడా భక్తి పుట్టుకవచ్చేది. అదంతా ఆ విశ్వకర్మ చూపించే భక్తి శ్రద్ధల ప్రభావం. పైగా అతను చెక్కిన లింగాలను పూజించిన వారికి అనుకున్న పనులు నెరవేరుతున్నాయి అన్న మాట ప్రచారంలోకి వచ్చింది. దానికి తోడు ధర కూడా అధికంగా తీసుకునేవాడు కాదు. తన శ్రమకు తగిన ఫలితాన్ని మాత్రమే తీసుకునేవాడు.

ఈ విషయం ఆనోటా ఈనోటా పడి నగరంలోనే కోటీశ్వరుడైన కుబేర గుప్తుని చెవిదాకా వచ్చింది. ఆయనకు తన సంపదలమీద ఎనలేని గౌరవం. ఆ గౌరవం పెరిగి అహంకారంగా మారిపోయింది. అందరు తనను గౌరవించాలని కోరుకునేవాడు. ఎవరైనా తనను నిర్లక్ష్యంగా చూస్తే వారిపై కక్షకట్టేవాడు. అదను చూసి కాటువేయాలని చూసేవాడు. కొంతలో కొంత పిసినారి తనం కూడా అతన్ని పీడిస్తోంది. తన తల్లి దండ్రుల పేరు మీద ఒక దేవాలయం కట్టించాలనీ, అందులో శివలింగాన్ని ప్రతిష్ఠించాలని ఎప్పటి నుండో అనుకుంటున్నాడు. విశ్వకర్మ గురించి విన్నాడు. ఇంటికి రమ్మని కబురు పంపాడు. తక్కువ ధరకే చేస్తాడు కదా అని ఆశపడ్డాడు.

విశ్వకర్మ తన పనినే పరమాత్మగా భావించేవాడు. ఎవరి ఇంటికీ వెళ్లేవాడు కాదు. పనికోసం దేబిరించేవాడు కాదు. చేస్తూ ఉన్న పనిని వదలి వెళ్లడం ఇష్టం లేక కుబేరగుప్తుణ్ణే రమ్మన్నాడు. కుబేర గుప్తుని అహం దెబ్బతింది. ప్రక్క ఊరినుండి మరో శిల్పిని పిలిపించి పనిని అప్పగించాడు. అతడు చెక్కుతూ చెక్కుతూ అర్థాంతరంగా పాము కాటుతో మరణించాడు. దానిని పూర్తి చేయించాలని ఎందరెందరో శిల్పులను పిలిపించాడు. తమకు కూడా అకాల మరణం సంభవిస్తుందన్న భయంతో ఎవ్వరూ ముందుకురాలేదు. కుబేరగుప్తుడు లోలోపలే ఉడికిపోతున్నాడు. ఎంత ధనాశ చూపినా లాభం లేకపోయింది.

అదే సమయంలో నీలకంఠబాబా అనే స్వామి నగరానికి వచ్చాడు. ఊరి బయటి ఉద్యానవనంలో దిగాడు. శిష్యబృందంతో అక్కడ విడిదిచేశాడు. జనం తండోపతండాలుగా అతనిని దర్శించుకోవడానికి పోతూ ఉన్నారు. కుబేర గుప్తుడు కూడా వెళ్ళి దర్శించుకోవాలనీ, తన పని ఎలా సిద్ధిస్తుందో అడగాలని అనుకున్నాడు. విలువైన దుస్తులు ఆభరణాలు ధరించాడు. హుందాగా బయలుదేరి వెళ్ళాడు. నేరుగా బాబా వైపు సాగిపోతున్నాడు. అతన్ని చూడగానే సామాన్య జనం త్రోవ ఇస్తున్నారు. కాని బాబా శిష్యులు వచ్చి అడ్డగించారు. అందరిలాగానే వరుసలో నేలమీద కూర్చోపెట్టారు. కుబేరగుప్తుడు అవమానంతో కృంగిపోయాడు. అయినా తన అవసరాన్ని దృష్టిలో పెట్టుకుని అసహనంగా కూర్చున్నాడు. ఇంతలో విశ్వకర్మ కూడా వచ్చాడు. దూరం నుండే బాబాకు నమస్కరించి కుబేరగుప్తుని వెనుక కూర్చున్నాడు. కుబేర గుప్తుని మనస్సు అసహ్యంతో కుతకుత ఉడికిపోతుంది.

బాబా విశ్వ కర్మను చూడగానే తన శిష్యులను పంపించాడు. అతనిని పిలిపించి తన ప్రక్కనే కూర్చుండబెట్టుకున్నాడు. "భక్తులారా! నేను ఇతనిని దర్శించడానికే ఈ నగరానికి వచ్చాను. ఇతని నిస్వార్థసేవలను గూర్చి విన్నాను. ఈ మహాభక్తుని దర్శనంతో నా జన్మ సఫలం అయింది. ఇతని భక్తి తత్వమే శివలింగాలకు జీవకళను ప్రసాదిస్తోంది. ఆధ్యాత్మదృష్టితో చూస్తే ఇతడు కోటీశ్వరులకన్నా మిన్న అని చెప్పవచ్చు. అందువల్ల అఖండ గౌరవానికి అర్హుడు. మనం వ్యక్తిని కాదు గౌరవించాల్సింది. వ్యక్తిత్వాన్ని గౌరవించాలి'' అంటూ సభాముఖంగా ప్రశంసించాడు.

కుబేర గుప్తుని అహం విచ్చిపోయింది. స్వయంగా లేచి వెళ్ళి విశ్వకర్మకు నమస్కరించాడు. అనేక విధాలుగా ప్రార్థించి తనకు కావలసిన శివలింగాన్ని చెక్కించుకున్నాడు. ఆనాటి నుండి కళాకారుల కళను గౌరవించడం నేర్చుకున్నాడు. తన సంపదలో కొంత భాగం దీన జన సేవకు వినియోగించడం మొదలు పెట్టాడు. సమాజంలో నిజమైన గౌరవాన్ని పొందాడు.

**కం॥ వ్యక్తికి గౌరవముండదు**
**వ్యక్తిత్వ విభవమునొందివరలగ వలయున్**
**శక్తిని గమనించుకొనుచు**
**రక్తిని కలిగించవచ్చు రయమున బాలా!**

– మధుర కవయిత్రి, పొన్నూరు హైమావతీ శాస్త్రి

కష్టాలు మనిషిని రాటుతేలుస్తాయి.

ధారావాహిక ప్రజ్ఞోపనిషద్ : ప్రథమ మండలం-చతుర్థోధ్యాయం

# మనోయోగ మార్గము

**సంయమే సమయస్యాపి శైథిల్యే మానవస్తతః ।**
**అలసశ్చ ప్రమాదీచ భవత్యేదవహితు ॥ 35**

ఏ సమయానికి, ఏ పని చేయవలెనో నిర్ణయించుకోకపోవడం, ఒక వేళ నిర్ణయించుకున్నప్పటికీ, దానిని పాటించకపోవడం, తర్వాత చేయవచ్చునన్న (వాయిదా వేసే) ఆలోచనలు కల్గిన మానవుణ్ణి బద్ధకస్తుడు అనవచ్చు. శారీరికంగా, ఆరోగ్యంగా ఉన్నప్పటికీ, మనస్సు "అలసత్వం" (బద్ధకం) అనే వికారంతో కప్పబడి ఉండటం వల్ల ఏ పని చేయకపోవడం, ఇతరులకే కాకుండా తనవారికి కూడా లేశమంత ఉపకారం చేయని 'జడ' స్వభావం కల్గి ఉండటం అత్యంత ప్రమాదకరమైన విషయం. అలాంటి రుగ్మతలవల్ల మనిషిగా జన్మపొందినప్పటికీ, ఆ జన్మకు ఎలాంటి సార్థకత ఉండదు.

**క్రియతేऽ నియమితం యత్తదపూర్ణం శిష్యతే ధ్రువమ్।**
**సమయస్య పయోగస్తు యోజితేన శ్రమేణహి ॥ 36**

నియమ సంయమనంతో పనులు చేయకపోతే, అవి అసంపూర్తిగా, అనుపయోగంగా ఉండిపోతాయి. సమయపాలన ప్రతివ్యక్తి విజయానికి తొలిసోపానమౌతుంది. ఒక్కక్షణం వృధా అయితే దానిని తిరిగి తీసుకోవడం, ఎవరికీ సాధ్యం కాదు. గతజలసేతు బంధనం (వెళ్ళిపోయిన నీరుకు ఆనకట్టకట్టడం) ఎలా సాధ్యంకాదో గడచిపోయిన కాలాన్ని తిరిగి తీసుకు రాలేమన్నది సత్యం. అలాగే జరిగిపోయిన దానిని గురించి, దానివల్ల కల్గిన నష్టాన్ని పదే పదే తలచుకుని విచారించడం కూడా కాలయాపనే. జరిగిపోయిన దానిని గురించి కాకుండా, జరగవలసిన దానిని, జరుగుతున్న అంశాల విషయంలో శ్రద్ధపెట్టకల్గితే తప్పకుండా, కొంత సమయాన్ని సద్వినియోగం చేసినట్లే.

**అలసోవ్యస్త వ్యక్తిత్వో దీర్ఘ జీవి భవన్నపి ।**
**ఆత్మజీవి సమానైవ భవన్త్యస్యోపలబ్ధయః ॥ 37**

అలసత్త్వం, (బద్ధకం, వాయిదావేసే నిర్లిప్తత) ఎలాంటి ఆశయం లేకుండా తిండి కొరకు మాత్రమే జీవించే అల్పజీవులు ఎంత కాలం జీవించినా ఎవరికీ ఏ ఉపయోగం ఉండదు. కాలదేవతను (సమయాన్ని) తగిన రీతిలో అనుసరించేవారి వల్ల అందరూ సుఖపడతారు. సూర్యుడు, చంద్రుడు, వృక్షాలు ప్రకృతి కాలానుగుణంగా సమయపాలనతో విశ్వచోదకులుగా (జగత్తును నడిపించేవారు) అందరికీ ఆదర్శప్రాయమవ్వడానికి కారణం సమయ సంయమనమే. ప్రణాళికాబద్ధంగా ఆచరణలో చూపుతూ, తాను చేయవలసిన లక్ష్యాన్ని నిత్యం స్మరించేవాడే కాలారాధకుడు. సంయమనాన్ని పాటించే సమయపాలకుడు.

**యోజనాబద్ధరూపేణ కార్యనిర్ధారణం యది ।**
**తత్కాలేన చ నిర్వాహాత్ విజ్ఞాః సాఫల్యమాయయుః ॥ 38**

సమయోచితంగా, లక్ష్యాన్ని, దానిని చేరుకునే విధానాన్ని తయారుచేసుకుని, అనునిత్యం అనుశీలనం (సమీక్షించుకోవడం) చేసుకుంటూ, చిన్న చిన్న దోషాలు దొర్లితే, అవి పునరావృతం (మళ్ళీ మళ్ళీ జరుగకుండా) కాకుండా చూసుకునే విజ్ఞులు తప్పక సాఫల్యం పొందుతారు. వాయువు తన పయనంలో ఎన్నో పుష్పాలకు సంబంధించిన సుగంధాన్ని అందరికీ పంచుతూ ముందుకు సాగుతుంది. అలాగే విజ్ఞులు తమ ప్రణాళికాబద్ధమైన జీవనయానంలో అందరినీ చైతన్యపరుస్తూ, పరిసరాలను పరిమళభరితంగా చేస్తూ, తమ కార్యాలవల్ల అందరూ సుఖపడాలని కాంక్షిస్తారు. వారి విజయానికి మూలం కాలసంయమనమే.

**సమయ్యా సంయమా యే తు తే భవన్త్యల్ప జీవినః ।**
**వరమాయుః కిమప్యస్తాం తేషాంన్నృణాం విచార్యతామ్॥ 39**

సమయాన్ని సక్రమంగా వినియోగించుకోకపోవడం, సమయం సరిపోవడం లేదు అని విచారిస్తూ ఉండడం అల్పజీవులు చేసే పని. సమయం, ఆయువు దైవదత్తాలు, ఎవరికోసం, ఈ కాలతరంగాలు ఆగవు. కదిలే వాహనాలు ముందుకు సాగుతూ వాటి వాటి గమ్యాలను చేరుకునే ప్రయత్నం చేస్తున్నాయి. కానీ రహదారులకు ఇరుప్రక్కల ఉండే చెట్లు, స్తంభాలు అక్కడే ఉంటాయి. కాని ఎలాంటి పురోగమనాన్ని కోరుకోవు. పొందజాలవు. అలాగే అల్పజీవులు కూడా కాలంతో బాటు వేగంగా పరుగెత్తలేక, జడచిత్తులై అనవసర యోచనలతో, కాలయాపనం చేస్తారు.

**ఈశ్వరేణప్రదత్యోయం, సమయస్యతు సంపదా ।**
**యోజయేత్తాం శ్రమేణాథ మనోయోగేన భూయసా ॥ 40**

దైవదత్తమైన సంపద సమయం. మనోయోగం చేత ఎవరు సమయాన్ని సద్వినియోగం చేసుకుని శ్రమిస్తారో, వారు కాలజ్ఞానులుగా భాసిస్తారు. 'సమయం చాలడంలేదు' (తీరిక దొరకడం లేదు) అనే నెపంతో పనులను వాయిదా వేస్తూంటారు. అంటే సమయాన్ని సరిపెట్టుకుంటూ, క్రమబద్ధమైన ప్రణాళికను వారు అనుసరించడలేదన్న మాట. అందువల్ల ముఖ్యంగా మనం చేయవలసిన పనులను ప్రాధాన్యత ప్రకారం వ్రాసుకుని, అవి

[redacted] శత్రువు కన్నా అవివేకి అయిన మిత్రుడు ప్రమాదకరం.

పూర్తి అవుతున్నాయా? లేదా? అని సరిచూసుకోవలసిన బాధ్యత మనదే. అటువంటి బాధ్యతాయుతమైన సమయపాలన చేయగలిగినవారే విజ్ఞులు.

**విభిన్నాః సంపదశ్చాపి విభూతిరార్జితుం క్షమాః ।**
**సమయో జీవనం తచ్చ నాశయన్నశ్యతి స్వయమ్ ॥ 41**

ఈశ్వరదత్తమైన విభిన్న సంపదలు, విభూతులు (శుభాలు) పొందడానికి ఓర్పు, సహనం, పట్టుదల అవసరం. సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ, ఎవరైతే కార్యాచరణ చేస్తారో, వారికి లౌకికపరమైన ఆటంకాలు, బద్ధకం, నిరాశ, నిస్పృహవంటి దుర్గుణాలు వాటంతట అవే దూరమౌతాయి. (నాశనమైపోతాయి)

**సూక్ష్మస్తరస్య కర్మాస్తి విచారః కార్యరూపకః ।**
**యుజ్యాత్ సత్సు విచారాణాం ప్రవాహం సమయంయథా 42**

మనం చేయవలసిన కర్మలు రెండు రకాలు 1 సూక్ష్మమైనవి 2. విస్తారమైనవి. కార్యాచరణకు మూలము మంచి ఆలోచన. చక్కటి ఆలోచనలతో ప్రణాళిక బద్ధంగా చేయగల్గితే సాఫల్యం చెందినట్లే. ప్రవాహము, సమయము, ఈ రెండు నిత్య చైతన్యంతో, నిరంతరం కొనసాగుతూ ఎవరికోనము ఆగకుండా పురోగమించేవే. కాబట్టి వాటి విలువను ప్రతి ఒక్కరూ గ్రహించాలి.

**ఉపయోగినాం విచారాణాముత్కృష్టానాంచ సీమ్నిచేత్**
**చింతనం సీమితం యాతి హృద్దేశ్యే సృజనాత్మకే 43**

సత్కర్మను ఆచరించి, ఆ ప్రయోజనాన్ని గురించి ఆలోచించి, ఉత్కృష్టమైన రీతిలో ఉపయోగాన్ని పొందేవారి ఆలోచనలను బట్టి ఫలితం ఆధారపడి ఉంటుంది. అంటే కర్తయొక్క హృదయంలో సృజనాత్మకత, ఉన్నత ఆలోచనలు ఉంటే ఆ కర్మ కూడా అదే విధంగా రూపుదిద్దుకుంటుంది, ఉన్నతంగా, ఉత్కృష్టంగా శోభిల్లుతుంది. 'యద్భావం తద్భవతి' అన్న ఆర్యోక్తి ఇక్కడ సార్థకమౌతుంది. ఆలోచనలు, ఆచరణ ఉన్నతంగా ఉంటే, కార్యఫలితం కూడా అలాగే ఉంటుంది.

**మహత్త్వ పూర్ణాన్యేతాని భూయః ప్రతిఫలానిచ**
**ఉత్పాదయంతి గృహ్ణంతి దేశాయాజిత మానసాః 44**

ఇటువంటి మహత్తు కల్గిన కర్మలు, వాటి ప్రతిఫలములు, ఇంద్రియ నిగ్రహము కల్గిన వారిలో క్రొత్త ఉత్సాహాన్ని, ఉత్తేజాన్ని కల్గించి మరెన్నో క్రొత్త కర్మలు చేయడానికి తోడ్పడతాయి.

**సఫలాస్తత్ర జాయంతే విచారాణామమూలతా**
**అస్తివ్యవస్తతా చాపి విక్షిప్తత్వం హిమన్యతామ్ 45**

మనోనిగ్రహం కలవారు ఏ విధముగా ఆలోచిస్తారో, వారి ఆచరణ కూడా అదే తీరులో కొనసాగి కార్యము ఫలవంతమౌతుంది. ఎందువలననగా వారి ఆలోచనలో పరిణతి, ఆమూలాగ్ర పరిశీలన వంటివి ప్రధానంగా వారిని నడిపిస్తాయి. ఇటువంటి ఆలోచనా ధోరణి లేనివారి కార్యాలు అస్తవ్యస్తమై అసంపూర్ణంగా ఉండిపోతాయి.

**క్షివానివ శునోనైన విచారాన్మనుజః క్వచిత్**
**అచింత్య చింతనేవ్యర్థం దిశాహీనాన్ని యోజయేత్ 46**

ఆలోచనా విధానంలో మనస్సుకు, బుద్ధికి అంతర్యుద్ధం ఏర్పడే అవకాశం ఉంది. యుక్తాయుక్త విచక్షణా జ్ఞానం బుద్ధికి ఉంటే, ఇంద్రియచాపల్యం మనస్సుకు ఉండడం వల్ల ప్రతివ్యక్తిలోనూ అంతర్యుద్ధం మొదలవుతుంది. ఉన్నతమైన ఉద్దేశ్యాలతోబాటు, అంతర్లీనంగా వాటిని బలహీనపరచే ఆలోచనలు కూడా ఆధిపత్యం చలాయించడానికి ప్రయత్నిస్తాయి. దానివల్ల దిశానిర్దేశం చేసే శక్తి మనస్సుకు, బుద్ధికి క్రమక్రమంగా తగ్గిపోతుంది.

**తాన్ సదైవోపయోగిన్యా దిశయా ధారయాపిచ**
**నియోజయేత్ విచారైశ్చామూలై ర్యోద్ధుమనైతికైః 47**

అనైతిక ఆలోచనలకు, ఉత్కృష్ట ఆశయాలకు మధ్య మహాభారత యుద్ధంలాంటిది, లేదా దేవాసురయుద్ధం లాంటి పోరాటం జరుగుతూ ఉంటుంది. అటువంటి స్థితిలో వీటిని మించిన విరాట్ పురుషార్థము ప్రవేశించి వాటిని అదుపుచేయకల్గినపుడు ఆ సంకల్పం సత్సంకల్పమై సంకల్ప సిద్ధిని కల్గిస్తుంది. సదా ఆ దిశలో పయనించాలన్న లక్ష్యాన్ని మనస్సులో ఉంచుకోవాలి. అటువంటి కర్మ సత్కర్మగా వెలుగొందుతుంది.

**సద్విచారచమూః కాచిత్ భవేత్ యాచింత్య చింతనైః**
**విచారైర్యుద్ధ్యమనేన తాంస్తు విద్రావయేద్ద్రుతమ్ 48**

మంచి ఆలోచనల ప్రభావము వలన చెడు ఆలోచనలు తొలగిపోయి, సక్రమదిశా నిర్దేశనం జరుగుట తథ్యం. అందువలన 'మనస్సు'లోని చంచల ఆలోచనలు అణచబడాలి. అపుడే మంచి ఉన్నత లక్ష్యాల దిశగా పయనించడం జరుగుతుంది. ఈ అవరోధాలన్నీ "బాలారిష్టాలు"గా సమసిపోగలవు. పక్షిపంజరంలో అటూఇటూ తిరిగినట్లే మనస్సు సంచరిస్తూ ఉంటుంది. కానీ పంజరం తలుపు తీసిన వెంటనే పక్షిఎలా ఎగిరిపోతుందో, మనస్సు అనే పంజరంలోని ఆలోచనల పక్షిని తలుపు తీసి బయటకు వదలినపుడు, ఖాళీ అయిన పంజరంలాగే మనస్సు కూడా ప్రశాంతంగా, మారి, సత్కర్మలవైపు మరలుతుంది.

**పరిశ్రమ మనోయోగస్స్యాస్తి విత్తంఫలం ధ్రువమ్**
**ప్రత్యక్షం, నీతియుక్తం తు విత్తమేతదుపార్జయేత్ 49**

మనోయోగము యొక్క ప్రత్యక్ష సంపదే పరిశ్రమ. ఇటువంటి ప్రత్యక్ష సంపదతోపాటు నీతివంతమైన ఆలోచనామార్గంలో భగవంతుడు ప్రసాదించిన శ్రమ, సమయం, మనోయోగము వంటి యదార్థ సంపదలను పొందే ప్రయత్నం చేయగలగాలి.

– స్వేచ్ఛానువాదం : శ్రీ మారెళ్ళ కామరాజు

[redacted]ణ్యఫలం జన్మజన్మాంతరాల వరకు లభిస్తుంది.

యుగ గీత-4 : మొదటి అధ్యాయం-ఉత్తరార్థం

# సద్గురు రూపంలో భగవంతుని స్వీకరించడం

యుగగీత శీర్షిక క్రింద గత సంచికలలో భగవద్గీతలోని ప్రథమ అధ్యాయమైన అర్జున విషాదయోగ చర్చ జరిగింది. సమర్థుడైన అర్జునుడి వ్యామోహం అతనిని అసహాయుడిని చేసినపుడు శ్రీ కృష్ణుడు సాంఖ్యయోగం బోధించాడు. పరమపూజ్య గురుదేవులు 1982 ఏప్రిల్ అఖండజ్యోతిలో అర్జునుడు ఇలా డీలాపడిపోవడం గురించి చెప్తూ ఇది చెడు సంస్కారమా! భవబంధనమా! చెడు ఆలోచనా! ఏమి అర్థం కావడం లేదు. ఇది పరాక్రమాన్ని పౌరుషాన్ని, సాహసాన్ని, శౌర్యాన్ని ప్రదర్శించవలసిన సమయం. ఈ విషమ పరిస్థితిలో యుగము యొక్క అర్జునుల చేతి నుంచి గాండీవం ఎందుకు జారిపోతున్నది? మోహం ఎందుకు వాడిపోయింది? శరీరం ఎందుకు చమటలు కక్కుతున్నది? సిద్ధాంతాలు అంటే వినోదాత్మకమైన కథ కాదు కదా! సత్యాన్ని తెలుసుకునే సమయమే రాదా? శ్రీకృష్ణుడు చికాకు పడ్డాడు. చెప్పడానికి చేయడానికి మధ్య వ్యత్యాసం ఆయనకు నచ్చవు. అర్జునా! నీ మనస్సు ఎందుకు ఇలా అయిపోందన్నాడు. ఆ వివరణే 2వ అధ్యాయం సాంఖ్యయోగంగా వెలువడింది. నేటి అర్జునులను కూడా మహాకాలుడు అంతరిక్షం నుంచి దాదాపు ఇదే భాషలో ప్రశ్నిస్తున్నాడు. జవాబు ఆశిస్తున్నాడు. ఇది అర్జునుడికి మాత్రమే వేసిన ప్రశ్న కాదు. మనలనందరిని ఉద్దేశించి పలికినది.

సాంఖ్యయోగం గురించి తెలుసుకోబోయే ముందు సాంఖ్యయోగం గీతలోని మహత్వపూర్ణమైన అధ్యాయం అని గుర్తించాలి. దేహాతీత ఆత్మ పరిచయం, దేహంతో చేయవలసిన స్వధర్మ ఆచరణ, స్థితప్రజ్ఞత్వం, శిష్యత్వ జాగరణ అంశాల సంపూర్ణ వ్యాఖ్య ఈ అధ్యాయంలోని 72 శ్లోకాలలో ఇవ్వబడ్డది. వ్యక్తిత్వ నిర్మాణం కొరకు ప్రతిపాదించిన అంశాలు అర్థం చేసుకోవాలి.

అర్జునునికి శ్రీకృష్ణుని మెత్తని చివాట్లతో ఈ అధ్యాయం ప్రారంభమవుతుంది.

**కుతస్త్వాకశ్మల మిదం విషమే సముపస్థితమ్**
**అనార్యజుష్టమస్వర్గమ్ ఆకీర్తికరమర్జున**

**క్లైబ్యం మా స్మ గమః పార్థ నైతత్త్వయ్యుపపద్యతే**
**క్షుద్రం హృదయ దౌర్బల్యం త్యక్త్వోత్తిష్ఠ పరంతప**

ఓ అర్జునా! ఈ సమయంలో ఈ మోహం నీకు ఎక్కడినుండి వచ్చింది? ఇది శ్రేష్టులచే ఆచరింపబడినది కాదు. స్వర్గమును ఇచ్చునది కాదు. కీర్తిని కలిగించునది కాదు. అర్జునా! పిరికితనమునకు లోనుకాకు. నీకిది ఉచితం కాదు. ఓ పరంతపా! హృదయ దౌర్బల్యాన్ని విడచి యుద్ధానికై నడుము బిగింపుము.

ఈ రెండు శ్లోకాల ద్వారా మొదటిసారి శ్రీకృష్ణుడు చెప్పడం ప్రారంభించాడు. అర్జునుడు కోరినట్టుగా రథాన్ని యుద్ధభూమిలో ఇరు సైన్యాల మధ్యగా నిలబెట్టాడు. ఈరెండు శ్లోకాలు చాలా గొప్పవి. యోధుల హృదయాలను హత్తుకుంటాయి. పిరికివాడవని, పలాయన వాదివని అంటే వీరులెవరు సహించలేరు. చతికిలబడిన అర్జునుని పౌరుషాన్ని సవాలు చేస్తూ, అతని మనస్సును గాయపరుస్తూ, మత్తగజాన్ని అంకుశంతో పొడిచినట్లు అంటున్నాడు. నువ్వు ఇలా దిగజారిపోయి, దీనత్వాన్ని వరిస్తే చేజేతులా అపకీర్తికొని తెచ్చుకుంటావు. గొప్పవ్యక్తులు వ్యవహరించిన పద్ధతిని గుర్తుచేస్తూ అర్జునుని ఉత్సాహ పరుస్తున్నాడు. తన మిత్రుని, ఉత్సాహంతో నింపాలని తీవ్రప్రయత్నం చేస్తున్నాడు శ్రీకృష్ణుడు.

పైన చెప్పిన రెండు శ్లోకాలకి జవాబుగా అర్జునుడు తర్కిస్తున్నాడు. 4వ శ్లోకం నుంచి 6వ శ్లోకం వరకు భీష్మాచార్యుని ద్రోణాచార్యుని తలచుకుంటూ "వారిద్దరు పూజనీయులు. వారిద్దరి ఎదుట నిలబడి వారిపై బాణాలు ఎలా ప్రయోగించగలను? మీరు మహా పురుషులు, జ్ఞానులు. మీరు నన్ను తిట్టినా సహిస్తాను, కాని నేను మాత్రం నా వారిని చంపలేను" ఒక వైపు గురుజనులపై మోహం, ఒక వైపు యుద్ధానికి పిలుపు, శ్రీకృష్ణుని చివాట్లు, నేను పూజనీయులైన గురువులని చంపేకంటే భిక్షమెత్తుకుని జీవితం గడపడం ఉత్తమం. గురువులను చంపి కామరూప భోగాలను అనుభవించలేను అంటాడు అర్జునుడు.

తర్కం పరాకాష్టచెంది అన్నం అడుక్కునే దాకా ఆలోచనలు వెళ్ళాయి. శ్రీకృష్ణుడు అర్జునుని మనస్సును మెప్పించి, రోషం తెప్పించి యుద్ధం చేయాలని చెప్తుంటే అర్జునుడు రక్తసిక్త పదార్థాలు మొదలైన ఉద్వేగభరిత వాక్యాలతో జవాబిస్తున్నాడు. యుద్ధం చెయ్యడం మంచిదా! కాదా! తెలియదు. వాళ్ళు గెలుస్తారా, మనం

అన్ని దానాలలోకెల్లా జ్ఞానదానం మిన్న.

గెలుస్తామా తెలియదు. ప్రతి పక్షంలో ఉన్న ఆత్మీయులందరిని చంపి నేను బ్రతికి ఉండాలని కోరుకోవడం లేదు. (6వ శ్లోకం)

అర్జునుని మనఃస్థితి తెలుసుకోవాలి. సిద్ధాంతాలను వల్లె వేస్తున్నాడు. గురువులను చంపడం మహాపాపం అని శ్రీకృష్ణునికే పెద్ద పండితునివలె చెప్తున్నాడు. కాని అతని ఆచరణ పండితుని వలె లేదు. తమోగుణం యొక్క పరాకాష్ఠ మోహంలో జరుగుతుంది. మోహం యొక్క చరమావస్థ నిద్ర అని పరమపూజ్య గురుదేవులంటారు. నిద్ర, బద్ధకం, మత్తు ఒకే మోహానికి ప్రతిరూపాలు. నిద్రను జయించిన అర్జునుడిని గుడాకేశ అంటున్నాడు. అటువంటి అర్జునుడు ఇప్పుడు మోహం అనే నిద్రలో మునిగి ఉన్నాడు. జాగృతమైన ఆత్మలు మోహనిద్రలో మునిగిపోతే జాలివేస్తుంది. కోపం వస్తుంది అంటున్నారు పూజ్య గురుదేవులు. జీవితాంతం మనమళ్ళతో, మనమరాళ్ళతో ఆటలాడుతూ, పాటలు పాడుతూ గడపటం, సంసార బంధంలో ఇరుక్కుని బయట ప్రపంచాన్ని ఒక క్షణం కూడా పట్టించుకోకపోవడం నేటి మానవుల స్థితి, కాని యుగ ధర్మాన్ని అనుసరించి ప్రవర్తించే అర్జునుడుకూడా ఈ స్థితిలోనే ఉన్నాడనిపిస్తుంది. కాని 7వ శ్లోకంలో ఇలా అంటాడు.

**కార్పణ్యదోషాపహత స్వభావః**
**పృచ్ఛామి త్వాం ధర్మసమ్మూఢ చేతాః**
**యచ్ఛ్రేయః స్యాన్నిశ్చితం బ్రూహి తన్మే**
**శిష్యస్తేహం శాధి మాం త్వాం ప్రపన్నమ్**

పిరికితనమునకు లోనై నా స్వభావం కోల్పోయి గిలగిలలాడుచున్నాను. ధర్మాధర్మ విచక్షణకు దూరమై నా కర్తవ్యమును నిర్ణయించుకొనలేకున్నాను. నాకు నిజముగా శ్రేయస్కరమైన దానిని తెలుపుము. నేను నీకు శిష్యుడను, శరణాగతుడను, ఉపదేశింపుము.

గీత ఇక్కడి నుండే గురుశిష్య సంవాదంగా నడుస్తుంది. **"శిష్యస్తేహం"** నేను మీ శిష్యున్ని అని మొదటి సారి అర్జునుడి నోటినుండి వెలువడింది. ఇలాంటి స్థితి రావడమే శిష్యునికి బంగారు ఘడియ. ఈ స్థితి రానంతవరకు అహంకారంతో నా అంత గొప్పవాడు లేడని ఆత్మస్తుతి చేసుకుంటూ ఉంటాడు. నేను చదువుకున్నాను. నేను పండితుడను, నేను మహాదానాలు చేశాను. జీవనదానం చేశాను అని అంటుంటాడు. ఇవన్నీ వదలి "నేను మీ శిష్యుడిని. మీ శరణాగతి కోరుకుంటున్నాను. మీకు ఏది మంచిదని అనిపిస్తే ఆ శిక్షణ ఇవ్వండి" అని అనగలిగితే గురువు సశరీరుడైన, సూక్ష్మ శరీరుడైనా, కల్యాణప్రదమైన ప్రేరణలు ఆ జీవికి అందిస్తాడు. మార్గదర్శనం చేస్తాడు.

సాంఖ్య అంటే అర్థం "జ్ఞానాన్ని సిద్ధాంత పరంగా ఆచరణలోకి తెచ్చుకోవడానికి ఉపయోగపడే బోధ". సాంఖ్యయోగం అనగానే సామాన్యంగా ఇది సన్యాసులకు విరాగులకు సంబంధించినది, మనది కాదు అని ప్రక్కకు పెట్టే ప్రయత్నం చేస్తారు. అది పొరపాటు. సాంఖ్యయోగం జీవన విజ్ఞాన ఆధారశిల, యోగం అనే భవనం సాంఖ్యమీదే నిలపబడింది. మన లోపల ఉన్నటువంటి శక్తులను ఎలా జాగృతం చెయ్యాలి? లౌకిక జీవితం గడుపుతూ స్థితప్రజ్ఞుని వలె, పరమహంస వలె జీవనం గడుపవచ్చు. ఈ యుగంలో, అన్ని స్థితులలో, యువకులు, విద్యార్థులు, గృహిణులు, గృహస్థులు, జిజ్ఞాసువులు సాధకులందరు దీనిని అన్వయించుకోవాలి.

ఏ గురువైనా శిష్యునికి మూడు విషయాలు చెప్తాడు. 1) కర్తవ్యం అంటే ఏమిటి? 2) తన కర్తవ్యం నిర్వర్తిస్తూ ఈశ్వరునితో తాదాప్యం చెందుట శ్రేయస్కరం. 3) తననే ప్రమాణంగా చెబుతూ గురువు ఆదర్శ వ్యక్తిత్వాన్ని వివరించి స్థితప్రజ్ఞుడు ఎలా ఉంటాడో చెప్పడం. వీటిని ఈ విధంగా కూడా విభజించవచ్చు.

1. దేహాతీత ఆత్మను గురించి తెలుసుకుంటూ మన కర్తవ్యమేమిటో తెలుసుకోవాలి. దేహభావన నుండి పైకి ఎదిగి ఆత్మను తెలుసుకోవడానికి ప్రయత్నం చేయాలి.
2. దేహంతో స్వధర్మ ఆచరణ చేస్తూ దానిని దాటిపోవాలి. కర్మ ఆచరిస్తూ నైష్కర్మ్య స్థితికి వెళ్ళాలి. దీని వ్యాఖ్య 31వ శ్లోకంలో వస్తుంది.
3. స్థితప్రజ్ఞ వ్యాఖ్య – ఆత్మని గుర్తించిన వారు ఆ స్థితికి ఎదుగుతే జీవితం ఎలా ఉంటుంది, ఇక్కడ స్థితప్రజ్ఞుని లక్షణాలు 55వ శ్లోకం నుండి చివరిదాకా శ్రీకృష్ణుడు చెబుతాడు.

ఈ విధంగా అర్జున రూపంలో ఉన్న శిష్యునికి జగద్గురువు శ్రీకృష్ణుడు సందేశాన్నిచ్చాడు. ఇదే తరతరాల నుంచి మానవ సముదాయానికి, జిజ్ఞాసువులైన సాధకులకు మార్గదర్శకత్వం చేస్తూనే ఉన్నది.

పరమపూజ్య గురుదేవుల జీవితంలో కూడా ఇలాగే జరిగింది. గురుదేవులు వెలిగించిన దీపకళిక నుంచి సూక్ష్మ శరీరధారియైన మార్గదర్శక శక్తి హిమాలయాల నుంచి గురు రూపంలో పరిచయం

[redacted]లోచనలు ఆరోగ్యం, బలం, దీర్ఘాయువుకు పునాది రాళ్ళు.

చేసుకుంది. గురుదేవులు ఇలా వ్రాశారు. "ఉదయం వేళ ఉపాసన జరుగుతున్నది. అది వసంత పర్వదినం. బ్రాహ్మీ ముహూర్తంలో ఆ చిన్న గదిలో ప్రకాశపుంజం దర్శనమిచ్చింది. నేనేమి భ్రమపడటం లేదు కదా! అని కళ్ళు నులుముకుని మరీ చూసాను. ప్రకాశిస్తున్న జ్యోతి మధ్యనుంచి ఒక యోగి సూక్ష్మశరీరం గోచరమయింది. ఈయన ఎవరు? ఆశ్చర్యం! ఆయన అన్నారు. నీ వెనుకటి జన్మలలో వలె ఈ జన్మలో కూడా నీకు సహాయంగా నీ వెంట ఉంటాము. దేశకాల పరిస్థితులను బట్టి అవసరమైన కార్యక్రమాలు నీ చేత చేయిస్తాము."

"మా సూక్ష్మశరీరంతో చేయలేని పనులు నీ ద్వారా చేయిస్తాను. ఆరోజునే, ఆ క్షణానే నేను ఆ ప్రకాశపుంజ దేవాత్మను మార్గదర్శిగా, భగవత్ స్వరూపంగా స్వీకరించి నన్ను నేను సమర్పించుకున్నాను. 60 సంవత్సరాలుగా ఈ సంబంధం కొనసాగుతూ ఉన్నది. తర్కబుద్ధితో నేను ఎప్పుడు వాదించలేదు, సణగలేదు. వారి కనుసన్నలలోనే నడుస్తున్నాను. ఆరోజే ఆ దివ్యశక్తి నా జీవనక్రమం ఎలా ఉండాలో, దాని స్వరూపం వివరించారు. చెప్పటమేగాక నా జీవన రథానికి సారధియై కళ్ళెం చేతిలోకి తీసుకుని నడిపించారు. నడిపించడమే కాదు ప్రతి పనిని దిగ్విజయంగా నెరవేర్చారు."

గీతలోని రెండవ అధ్యాయం నుంచి ప్రేరణ పొందాలని సద్గురుప్రాప్తిలో వివరించాము. బుద్ధిపై ఆధారపడక భావనాప్రపంచంలో విహరించగలిగే వ్యక్తి సమర్పణ సమగ్రంగా ఉంటుంది. వారి ఆత్మ వికాసానికి అనంతమైన అవకాశాలు ఉంటాయి.

నరేంద్రనాథ్ జీవితంలో కూడా రెండు అవకాశాలు వచ్చాయి. శ్రీరామకృష్ణ పరమహంసను దర్శించాడు. కాని సద్గురురూపంలో స్వీకరించ లేకపోయాడు. రామచంద్ర దత్తు గారింట్లో శ్రీరామకృష్ణ పరమహంస ప్రవచనం సందర్భమున పాట పాడాడు. నరేంద్ర, ఆయన స్వహస్తాలతో ఇచ్చిన మిఠాయి తిన్నాడు. ఇంకొకసారి ప్రొఫెసర్ హేస్టి ద్వారా ఆయన గురించి విన్నాడు, చూచివచ్చాడు కూడా. అప్పటికి ఆయన సామాన్య మానవునిలాగా కనిపించాడు. ఎప్పుడు భగవంతుని చూడాలనే ఆతురత ఆయనను ఇంట్లో నిలవనిచ్చేది కాదు. భగంతుడు ఎలా ఉంటాడు? ఆయన్ని ఎలా చూడగలుగుతాము అనే ప్రశ్నలకు ఆయన నుండి జవాబు వచ్చాక వారిని తన గురువుగా గుర్తించాడు. గురువును జ్ఞానమూర్తిగా, సాధువుగా, పోషకుడుగా, సంఘసంస్కర్తగా అంగీకరిస్తారు కాని సద్గురువుగా భావించి శరణాగతి చెయ్యరు. ఏ రోజు శరణాగతి చేయగలరో ఆ రోజు జీవితంలో ఆధ్యాత్మిక విప్లవానికి శుభారంభం జరుగుతుంది.

"వందే బోధమయం నిత్యం గురుశంకరరూపిణమ్" అంటారు. గురువు శంకర స్వరూపం, మహాకాలుడే. ఆ శంకర రూపంలో ఉన్న పరమ చైతన్యంలో ఒక కణమై వారికి ప్రతి నిత్యం వందనం చేస్తే వారి అనుగ్రహానికి పాత్రత పొందుతాము. "శిష్యులమయితే సర్వం పొందగలము" అనే సూత్రం అందులో దాగి ఉంది.

గీతా పారాయణం చేయడం తేలిక. గీతలోని మర్మములను తెలుసుకోవడం, గీత అనే అమృతాన్ని పానం చెయ్యడం, కణకణం జీర్ణించుకోవడం కష్టతరమైన పని. మన ఉత్సాహం, ఆతురత, కోరిక పొందటానికి ఉత్కంఠ ఉండవలసిన స్థాయిలో ఉన్నాయా లేదా? అది గమనించుకోవాలి. "21వ శతాబ్ది ఉజ్జ్వల భవిష్యత్తు" ఇది మన గురుదేవుల నినాదం. మనకు దీనిపై విశ్వాసం ఉంటే ఆందోళన చెందవలసిన పని లేదు. మన ప్రయత్నంలో ఏ మాత్రం లోటు రానీయకూడదు. ఈ పని చేసే వారికి నిశ్చయంగా కీర్తి, శ్రేయస్సు, లాభం కలుగుతాయి.

గురుదేవుల పట్ల పెరిగిన ఆవేదన, కబీరుదాసుని మేల్కొల్పింది, అర్జునుని చేతనత్వంతో నింపి, నరేంద్రనాథ్‌ని, మూలాశంకరుని కాలి మునివ్రేళ్ళపై నిలిపి వారిని వివేకానందునిగా దయానంద సరస్వతిగా మార్చివేసింది.

పరమపూజ్య గురుదేవులు ఇలా అంటారు. యుగధర్మాను సారం అప్పచెప్పిన బాధ్యతలను నిర్వర్తించడానికే శిష్యుని జీవితం ఉన్నది. యుగధర్మానికి తనదైన మహత్యం ఉంటుంది. కాలపురుషుని పిలుపుగా దానిని భావించి, ఇతర కార్యక్రమాలు ప్రక్కనపెట్టి ఆ కార్య నిర్వహణకు పరిగెత్తాలి. నిప్పు అంటుకుంటే నీటికోసం ఎంత వేగంగా పరిగెత్తుతామో అలా గురుదేవులు చెప్పిన పనికి పరిగెత్తాలి. శిష్యుడు ఒక అడుగు ముందుకు వేస్తే గురువు పది అడుగులు ముందుకు వేసి శిష్యుని ఆలింగనం చేసుకుంటాడు. సంపూర్ణ గీతా రహస్యం ఈ వాక్యంలో ఉన్నది.

8వ శ్లోకంలో తన శరణాగతి భావాన్ని ప్రకటించిన తరువాత శ్రీ కృష్ణుడు ఏమి ఉపదేశం ఇచ్చారో వచ్చేసంచికలో

*– అఖండజ్యోతి : ఆగష్టు 1999*

*– అనువాదం : శ్రీమతి జ్ఞాన ప్రసూన*

[redacted] **మనశ్శాంతికి మార్గం కర్తవ్య పాలన.**

సూర్య విజ్ఞానం - 3

# సమస్త బ్రహ్మాండం ఒక చైతన్య శరీరం

శరీరంలోని ఏ భాగానికైనా దెబ్బతగిలినప్పుడు శరీరంలోని రోమరోమం కంపిస్తుంది. శరీరానికి, మనస్సుకు చికాకు కలుగుతుంది. మొత్తం ధ్యానమంతా శరీరం యొక్క బాధపై కేంద్రితమై ఉంటుంది. మనస్సు సంతులనం కోల్పోయినపుడు శరీరంలోని ప్రతి అవయవం, మనఃస్థితి ఒకదాని నొకటి ప్రభావితం చేస్తాయి. ఇది శరీరం యొక్క చైతన్యతకు ఏకత్వమునకు నిదర్శనం. దృశ్య ప్రకృతి, అదృశ్య ప్రకృతి, మొత్తం సౌరమండలం కూడా ఒకదానితో ఒకటి లోతైన, భావనాత్మక ఆకర్షణతో కలపబడి ఉన్నాయి. దానిలో ఒకచోట ఏదైనా సంఘటన జరిగినపుడు ఇతర స్థానములలో దాని ప్రతిక్రియ ప్రభావం చూపించకుండా ఉండదు.

ఈ తథ్యములను ప్రతిపాదించిన, ఈ రహస్యాలను చెప్పినటువంటి విజ్ఞానం ప్రాచీన కాలం నుండి ఉన్నది. దీనినే జ్యోతిష విజ్ఞానం అని పిలువబడుతుంది. దీని లక్ష్యం సౌరమండల సదస్యుల పరస్పర సంబంధముల వైజ్ఞానిక వివేచన, ఒకదానిమీద ఒకటి చూపించే ప్రభావములను తెలుసుకోవడమే. ఈ విద్యవల్ల పృథ్వినుండి, ఇతర గ్రహనక్షత్రముల నుండి లాభం పొందడం, దుష్ప్రభావములనుండి రక్షించుకొనడం సులభంగా సాధించుకొనవచ్చు. ఇది ఈనాటి అభివృద్ధి చెందిన విజ్ఞానం ద్వారా కూడా సాధ్యం కాదు. కాలాంతరంలో ఈ విజ్ఞానం మరుగున పడి దీని స్థానంలో మూఢనమ్మకాలు, భ్రాంతులు చోటుచేసుకున్నాయి. దీనిని చూసిన జిజ్ఞాసువులు ఈ విద్యను పట్టించుకొనడం లేదు.

ఇంత జరిగినప్పటికి ప్రౌఢత సంతరించుకున్న ఈనాటి విజ్ఞానం అంతరిక్ష పరిశోధనలపై దృష్టి సారించింది. దీనితోపాటే గ్రహనక్షత్రముల, సౌరమండల గతి విధులను (నడకలను, ప్రభావమును) పరస్పర సంబంధములను ఒకదానిపై ఒకటి చూపే ప్రభావమును తెలుసుకునేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. వందల సంవత్సరాల క్రితం తత్వవేత్తలైన ఋషులు జ్యోతిర్విజ్ఞానం ద్వారా తెలుసుకున్న సత్యముల దగ్గరకే ఈనాటి భౌతిక విజ్ఞానులు కూడా చేరుతున్నారు.

జ్యోతిష విజ్ఞానులు సౌరమండల సభ్యులైన నవగ్రహాలను తొమ్మిది దేవతాశక్తుల రూపంలో ప్రతిష్ఠించారు. సౌరమండలం యొక్క అధిపతి సూర్యుడు ఒక మండుతున్న అగ్నిగోళంగా భావించక, జీవమునిచ్చే ప్రాణముగాను, సౌరమండలంలోని సదస్యులను తన గతి విధుల ద్వారా ప్రభావితం చేసేదిగాను గుర్తించారు. సూర్యునితో పాటు మంగళ (కుజుడు), బృహస్పతి (గురువు), బుధుడు మొదలైన గ్రహాలు కూడా పృథ్వి యొక్క వాతావరణాన్ని ప్రభావితం చేస్తాయి.

ఈ తథ్యాన్ని విశ్వంలోని ప్రసిద్ధ భౌతికవాదులు కూడా అంగీకరించారు. యుగోస్లోవియాకు చెందిన భౌతిక శాస్త్రవేత్త ప్రొఫెసర్ స్టీవెన్ డేడీజర్ అభిప్రాయం ఏమంటే విజ్ఞానం తన అంతరిక్ష పరిశోధనలో సఫలీకృతం కావడానికి ప్రాచీన జ్యోతిష విజ్ఞాన సహాయం తీసుకోవలసి వస్తుందని అన్నారు. ప్రకృతిలో జరిగే అనేక సంఘటనలను అర్థం చేసుకోవడం ఈనాటి అభివృద్ధి చెందిన విజ్ఞానానికి కూడా సాధ్యం కావడం లేదు. ఆధునిక వైజ్ఞానికులు అంతరిక్షీయ, సబ్ న్యూక్లియర్ క్షేత్రాలతో ఎంత ప్రగతి సాధించినప్పటికి, బ్రహ్మాండంలో జరిగే అనేక సంఘటనలకు కారణం తెలుసుకోలేకుండా ఉన్నారు. కాని జ్యోతిష్య విజ్ఞానంలో సూర్యునికి సంబంధించిన జ్ఞానం బ్రహ్మాండంలో జరిగే సూక్ష్మ గతివిధులు, సూర్యుని ప్రభావం అంతరిక్ష రహస్యాల ఉద్ఘాటన కనిపిస్తాయి.

భౌతిక విజ్ఞాన సిద్ధాంతముల ప్రకారం ప్రతి పదార్థపు కణము బ్రహ్మాండంలోని ఇతర కణాలతో సాపేక్ష్యంగా గతిశీలమై ఉన్నది. అవి వాటి స్థానములను కూడా పరివర్తన (మార్పు) చేసుకుంటాయి. అందువల్ల వాతావరణం మారుతూ ఉంటుంది. భూమి ఇతర గ్రహాలు కూడా చరాచర పదార్థాల మీద, ఖగోళ పిండముల మీద తమ ప్రభావాన్ని చూపుతూనే ఉంటాయి. ఈ విషయములు తెలిసినప్పటికి భౌతిక విజ్ఞానం, గ్రహనక్షత్రముల ప్రభావములను పూర్తిగా అవగాహన చేసుకోలేకపోతున్నది. అందువలన సమగ్రమైన అవగాహన కొరకు లుప్తమైన (పోగొట్టుకున్న) జ్యోతిష విజ్ఞానాన్ని పునర్జీవితం చేయవలసిన అవసరం ఎంతైనా ఉన్నదని ప్రొఫెసర్ స్టీన్‌లెన్ డేడీజర్ నొక్కివక్కాణిస్తున్నారు.

ప్రఖ్యాత ఆస్ట్రియన్ వైజ్ఞానికుడు ఎర్నెస్ట్ మైక్ అంటారు– బ్రహ్మాండములోని అనంతమైన కణములు ఒకదానితో ఒకటి జోడింపబడి ఉన్నాయి, వాటి మధ్య గట్టి సంబంధం ఉన్నది. గ్రహాల సామీప్యం, చంద్రుని గతితో ఏదో విధమైన సంబంధం కలిగి ఉన్నది. ఇది పృథ్విపై అనేకరకాల అననుకూల పరిస్థితులను ఉత్పన్నం చేస్తుంది. గ్రహములు పృథ్విపై, జీవ అయస్కాంత శక్తిపై తమ ప్రభావాన్ని చూపుతాయి. గ్రహముల అసంతులన వల్ల ఉత్పన్నమయ్యే అయస్కాంతపు తుఫానులు, ప్రాకృతిక ప్రకోపములను, జీవధారులలో అనేక మానసిక, నరముల సంబంధించిన రోగములను కలిగిస్తాయి. భూమ్యాకర్షణలో జరిగే మార్పులు మానవ ఆచరణను స్వభావం ప్రభావితం చేస్తాయి.

[redacted] తప్పులను ఎత్తి చూపేవాడే నిజమైన మిత్రుడు.

[redacted]

రష్యా విజ్ఞానవేత్త చీనవస్కి ఈ క్షేత్రంలో చాల కాలం పరిశోధనలు చేసి ఒక నిర్ణయానికి వచ్చారు. వీరు సౌరమండలంలోని మార్పులకు పృథ్వి యొక్క వాతావరణం, పృథ్విపై జరిగే సంఘటనలకు సంబంధం ఉన్నదని అంటారు. సూర్యునిలో ప్రతి 11 సంవత్సరములకు అణు విస్ఫోటనములు జరుగుతాయి. అప్పుడు ఆ సంవత్సరంలో పృథ్విపై యుద్ధాలు క్రాంతులు జరుగుతాయి, అంటు వ్యాధులు ప్రబలుతాయి అని కూడా శాస్త్రజ్ఞులు అన్నారు.

జియోజార్జీ గిఆర్ది అనే వైజ్ఞానికుడు జ్యోతిష విజ్ఞాన ప్రేరణతో విజ్ఞానంలో కాస్మోబయోలజీ అనే ఒక క్రొత్త శాఖ ప్రవేశపెట్టారు. ఈ సిద్ధాంత ప్రకారం మొత్తం బ్రహ్మాండం ఒక శరీరం. ఇందులో జరిగే ప్రతి సంఘటన వేరుగా విడివిడిగా ఉండక సంయుక్తంగా జరుగుతుంది. అందువల్ల ఏ గ్రహం ఎంత దూరాన ఉన్నప్పటికి దాని ప్రభావం భూమి మీద తప్పని సరిగా ఉంటుంది.

అహ్మదాబాద్‌లోని భౌతిక అనుసంధాన ప్రయోగశాలలోని ఇద్దరు వైజ్ఞానికులు ప్రొఫెసర్ కె.ఆర్ రామనాథన్, డా॥ అనంత కృష్ణన్ అనేవారు భూమి సౌరమండలంలోని ఒక అభిన్న అంగమని నొక్కివక్కాణించారు. ఆకాశంలోని పిండముల (గ్రహములు, నక్షత్రములు) స్పందనలు పృథ్విని ప్రభావితం చేస్తాయి. వారి పరిశోధనలలో గ్రహించినదేమిటంటే వాయుమండలంలోని 'డి' క్షేత్రంలో శక్తి వంతమైన ఎక్స్ కిరణాల ప్రవాహం స్కార్పివోను తాకి జీవ జగత్తును ప్రభావితం చేస్తాయి. వాటికి హాని కలిగిస్తాయి.

ఎటామిక్ ఎనర్జీ కమిషన్ యొక్క ఒకప్పటి అధ్యక్షుడు, ప్రఖ్యాతి గాంచిన డా॥ సారభాయి విభిన్న దేశముల గోష్ఠిలో మాట్లాడుతూ సూర్యుడేగాక, ఆకాశంలోని పిండముల (గ్రహ, నక్షత్రములు) యొక్క ప్రభావం భూమి మీద పడుతుంది. జ్యోతిష్య విజ్ఞానం యొక్క సూత్రాలను అన్వేషించినట్లయితే, వాటిని ఉపయోగించుకోగలిగితే అనేక మహత్వపూర్ణమైన విషయములు అర్థం చేసుకోవచ్చని అన్నారు.

రష్యన్ వైజ్ఞానికుడు బ్లాదిమీర్ దేశ్యోతోమ్ ఈ విషయంలో చాలా తీవ్రమైన పరిశోధనలు చేశారు. పృథ్విమీద అప్పుడప్పుడు వచ్చే అయస్కాంత తుఫానుల వల్ల పృథ్విపై నివసించే వారిలో నరాల సంబంధించిన రోగములు, మనస్సుకు సంబంధించిన రోగములు ఎక్కువయ్యాయని చెప్పారు. భూమిపై అయస్కాంత క్షేత్ర తీవ్రత లేదా దీని ఫ్రీక్వెన్సీలోని మార్పులు ఆకాశంలోని పిండముల నుండి వచ్చే శక్తి ప్రవాహముల పరిణామమే. వారి తొలి పరిశోధనలలోనే సూర్యుని మీద విస్ఫోటనములు జరిగినప్పుడు పృథ్విపై ప్రచండమైన అయస్కాంత తుఫానులు వస్తాయని తెలుసుకున్నారు. దీని ప్రభావం అందరి మీద ఉంటుంది కాని బలహీనమైన మనస్థితి గల వ్యక్తులపై ఎక్కువగా ఉంటుంది. అందువల్ల వారు హత్యలకు, ఆత్మహత్యలకు పాల్పడవచ్చు. అసంతులిత పరిస్థితుల వల్ల దుర్ఘటనలు పెరుగుతాయి.

మస్తిష్కం యొక్క క్షమతకు ఆధారమైన అల్ఫాశక్తి పృథ్వియొక్క అయస్కాంత క్షేత్రంలో ముడివడి ఉన్నది. ఈ భూమ్యాకర్షణ ఆకాశంలో ఉన్న పిండములతో నేరుగా సంబంధం ఉన్నది. అందువలన మానవ జీవనం అంతరిక్షంలో జరిగే సంఘటనలతోను, శక్తులతోను విలక్షణమైన సంబంధం ఉన్నది. అందువల్ల అంతరిక్షంలో జరిగే గందరగోళములు పృథ్విని, మానవ ప్రకృతిని, మనస్సును, బుద్ధిని, చేతనత్వమును ప్రభావితం చేస్తాయి.

ఖగోళ శాస్త్రవేత్త పాస్కల్ పరిశోధనల ప్రకారం సూర్యుని, చంద్రుని శక్తివంతమైన ప్రభావాల వలన సముద్రంలో ఆటుపోట్లు రావడమే కాక జీవుల మీద కూడా తమ ప్రభావం చూపిస్తాయి. దీనిలో పృథ్వి, పృథ్వి వాతావరణం, వనస్పతులు జీవధారులు కూడా ఉన్నాయి. ప్రాచీన కాలంలో జ్యోతిష్య విజ్ఞానులు ఈ దిశలో ప్రయోగాలు చేశారు. అంతర్‌గ్రహ ప్రభావములను తెలుసుకున్నారు. దీని వల్ల అనేక సందర్భాలలో మానవజాతి లాభాన్వితమైనది.

విజ్ఞానం యొక్క ధ్యానం కూడా ఈ దిశలో పయనిస్తున్నది. అంతర్ గ్రహ ప్రభావాలను అంచనా వెయ్యడం మొదలయ్యింది. ఇది శుభ పరిణామము. కాని జ్యోతిర్విజ్ఞానం లేకుండా ఈ ప్రభావం అంచనా వెయ్యడం సాధ్యం కాదు. ఈ దిశలో ప్రాచీన భారతీయ జ్ఞానం మార్గదర్శనం చేయగలదు. ఆర్యభట్టుని జ్యోతిష్య సిద్ధాంతములు, గోళపాదుని సూర్యసిద్ధాంతములు, ఇంకా నారదేవ బ్రహ్మ గుప్తుని ప్రయోగములు, భాస్కర స్వామి రచించిన మహా భాస్కరీయం మొదలైన దుర్లభ అమూల్య గ్రంథములు అనేక రహస్యములతో నిండి ఉన్నాయి. పంచ సిద్ధాంతికలో వరాహ మిహిరుడు పాలిశ, రోమక, వాశిష్ఠ, సౌర, పితామహ అనే పేర్లుగల ఐదు జ్యోతిష్య సిద్ధాంతములను విస్తృతంగా విపులీకరించాడు.

తత్వవేత్తలైన మహర్షులు అన్వేషించిన ఈ విద్య కేవలం సూర్యుని, బ్రహ్మాండం యొక్క గతి విధులను చెప్పి ఊరుకోలేదు. దీని భౌతిక పక్షం ఎంత విస్తృతం, ఆకర్షణీయమైనప్పటికి, ఇది జ్యోతిర్విద్య యొక్క కలేబరమే. ఈ కలేబరంలో తత్వశక్తి ప్రవాహముల దైవీయ విజ్ఞానమున్నది. దీనిని అర్థం చేసుకొని వర్తమానంలో, భవిష్యత్తులో కావలసిన దిశలో పరిస్థితులను తీర్చిదిద్దుకొనవచ్చు.

దైవీయ విజ్ఞాన రహస్యములు సూర్యసాధనలో ఉన్నాయి. ఈ సాధనలో ఉన్మీలత (తెరచుకుని) దృష్టితోనే దీని రహస్యములను తెలుసుకోవడం సాధ్యమవుతుంది. ఈ సాధనలతో బ్రహ్మాండములోని రహస్యములను తెలుసుకొని సౌరమండల శక్తి ప్రవాహములతో లాభాన్వితం కావడం సంభవమే.

*– అఖండ జ్యోతి, జూన్ 1993*

**మనస్సు కరగడం మానవతకు గుర్తు.**

శబ్ద బ్రహ్మ

# శబ్దశక్తితో రిద్ధిసిద్ధుల ప్రాప్తి

ఈ ప్రపంచం అందంగా శోభాయమానంగా కనిపిస్తుందంటే దానికి శబ్దం యొక్క అసాధారణ ప్రభావం ఉన్నది. ఇది తెలుసుకున్నవారు శబ్దశక్తిని పెంపొందించుకోవడానికి, దానిని ఇష్టం వచ్చినట్లు ఉపయోగించుకోవడానికి సిద్ధం అవుతున్నారు. దేశవిదేశాలలో వేలాది రేడియో కేంద్రములు నిరంతర ప్రచార కార్యక్రమంలో మునిగిఉన్నాయి. ప్రతిరోజు కోట్ల సంఖ్యలో ముద్రింపబడే వార్తా పత్రికలు ఈ పనినే చేస్తున్నాయి. సాహిత్య ముద్రణ, ప్రచురణలో మునిగి ఉన్న లక్షలాది కార్యకర్తలు ఈ పనిలోనే నిమగ్నమయి ఉన్నారు. టెలిఫోన్, సినిమా, సిడిలు, డివిడీలు ఈ పనే చేస్తున్నాయి. విద్యాలయాలు ఉన్నది దీని కోసమే. మనుష్యులకు శబ్దం ద్వారా లభించే జ్ఞానం గురించి తెలుసు, దానిని పూర్తిగా వినియోగించుకుంటూనే ఉన్నారు. మానవుల అథఃపతనానికి, ద్వేష దుర్భావనలకు కూడా శబ్దం యొక్క దురుపయోగమే కారణం.

స్థూలంగా శబ్ద శక్తి గురించి ఇలానే అనిపిస్తుంటుంది. **సూక్ష్మంగా పరిశీలిస్తే ఒక రహస్యం తెలుస్తుంది. శబ్దం ఒక అత్యంత ఉన్నత స్థాయి సామర్థ్యం కలిగిన శక్తి.** ఏ విధంగా నీటి ఆవిరి, అణువు, తుపాకి గుండు ద్వారా గొప్ప శక్తులు అవతరిస్తాయో, అదే విధంగా శబ్దశక్తి యొక్క సూక్ష్మ ప్రభావం అతి మహత్వపూర్ణమైనది. చాల రోజుల నుంచి ప్రత్యేకమైన శబ్దముల ప్రభావం శరీర అవయవములపై ఎలా ఉంటుందో అనే దానిని గురించి ప్రయోగాలు జరుగుతున్నాయి. ఈ ప్రయోగ ఫలితాలు చూసి చాలా ఆశ్చర్యపడవలసి వస్తుంది. హాలెండ్, డెన్మార్కు దేశాలలోని పశువుల కాపరులు పాలు పిండే సమయంలో ఒక ప్రత్యేకమైన స్వరలహరి వినిపించేవారు. వీటిని వినిపించినపుడు పశువుల నాడి మండలంలో దీని ప్రభావం పడి, పాలు ఇచ్చే గ్రంథులు ఎక్కువ పాలు ఇచ్చేవి. సర్పవిద్య తెలిసినవారు నాగస్వరం వాయించి విషసర్పాలను వాటి బిలములనుండి బయటకు రప్పించి, అవి ఆ సంగీతంలో తన్మయమైనపుడు వాటిని పట్టుకుంటారు. ప్రాచీన కాలంలో వేటగాళ్ళు ఒక రకమైన సంగీతాన్ని ప్రయోగించి జింకలను పట్టుకునే వారు. మధుర సంగీతం విని అలా నుంచుని పోయేవి. అప్పుడు ఆ ధూర్తులు ఆ జింకలను పట్టుకునేవారు.

విషవ్రణాలు, భూతోన్మాదం వంటి రోగాల నివారణకు ఈనాడు కూడా గ్రామాలలో కుండలు బోర్లించి దానిపై కంచు పళ్ళెం పెట్టి కర్రతో కొడుతూ విచిత్రమైన ధ్వనులు చేయడం వల్ల ఆశ్చర్యకరమైన పరిణామాలు కలుగుతున్నాయి. విషసర్పాలు కాటువేస్తే ఈ చికిత్సతోనే విషం దిగిపోవడం జరిగింది. భూతోన్మాదానికి ఈ చికిత్స అద్భుత ఫలితాలను ఇస్తుంది. అమెరికాలోని విజ్ఞాన వేత్తలు నిద్రపట్టని వారికి తేలికపాటి సంగీత లహరిని వినిపించి నిద్ర పట్టించగలిగారు. నరాల బాధలు ఉన్నవారికి ఒక ప్రత్యేకమైన సంగీతం ద్వారా రోగముక్తులను చేస్తున్నారు. గర్భస్థ బాలునికి మానసిక, నరాల బలమునకు గర్భవతులకు ఒక ప్రత్యేకమైన వాద్య ధ్వనులను వినిపిస్తున్నారు. ఆశాజనకమైన ఫలితాలు కలుగుతున్నాయి.

ప్రాచీన కాలంలో మన దేశంలో మేఘమల్హర్ రాగాన్ని ఆలాపిస్తే మబ్బుతునక లేని ఆకాశంలో మబ్బులు వచ్చి వర్షం కురిసేదని చెప్తారు. మంత్రశాస్త్రం దీని వికసించిన రూపమే. భారతీయ విజ్ఞాన వేత్తలైన ఋషులు శబ్దవిద్యను ఈ దృష్టితో లోతుగా అధ్యయనం, అన్వేషణ చేశారు. వారి ఆశ్రమాలు ఈ రకమైన ప్రయోగాలకు ఆటపట్టుగా ఉండేవి. ఏ శబ్ద గుచ్ఛముల సమూహం, ఏమంత్రం ఎలాంటి ఉచ్చారణతో చేయాలి, ఏ భావముద్ర ఉండాలి, ఏ వ్యక్తి ద్వారా ప్రయోగం చేస్తే ఎలాంటి పరిణామాలు ఉత్పన్నమవుతాయి అనే అన్వేషణ ఆవిష్కారం మంత్ర విద్యలోని భాగములు.

శబ్దాన్ని నోటితో ఉచ్చరిస్తాము. నోటిలో నాలుక ప్రధానమైనది సాధారణంగా నాలుకతోనే మాట్లాడతామని అనుకుంటారు. కాని వాస్తవంగా కంఠం, నాలుక, అంగిలి, పెదవులు మొదలైన విభిన్న అవయవముల కదలికల వల్ల శబ్దములు ఉచ్చరింపబడుతాయి. పాణిని వ్యాకరణంలో అక్షరముల స్థానములు కూడా చెప్పబడ్డాయి. ఈ అవయవముల కదలికల మిశ్రమం స్వరూపంలో వచ్చే ధ్వని బాహ్య జగత్తులో శబ్దరూపం దాలుస్తుంది. చెవి ఈ శబ్దాలను వినగలుగుతుంది. మస్తిష్కం ఆ శబ్దాన్ని ధారణ చేస్తుంది. ఈ శబ్దం "ఈథర్" తత్వంలో కలసి పృథ్వి ఒక చివరి నుంచి ఇంకొక చివర వరకు వ్యాపించడమేగాక విశ్వ బ్రహ్మాండమంతటా వ్యాపిస్తుంది. కొంచం సేపే అది వినిపించవచ్చు కాని దీని అస్తిత్వం అనంత కాలం వరకు ఉంటుంది.

**[redacted] ఆకట్టుకుంటుంది. సౌశీల్యం హృదయాన్ని దోచుకుంటుంది.**

మన నోటి నుంచి వెలువడిన శబ్దం కొన్ని సెకండ్లలో ఈ దేశం నుంచి ఆ దేశానికి చేరుతుంది. చంద్రుడు మొదలైన గ్రహాలను చేరటానికి కొద్ది నిమిషాలు పడుతుంది. సౌరమండలంలోని నవగ్రహముల కక్షలను దాటటానికి కొన్ని గంటలు పడుతుంది. మన సూర్యుడు 9 గ్రహములతో 48 ఉపగ్రహముల సమేతంగా తిరుగుతున్నాడు. 25 లక్షల నక్షత్రాలు మన పాలపుంతలో ఉన్నాయి. పాలపుంత ఒక్కటే విశ్వబ్రహ్మాండంలో లేదు. అలాంటి కోట్లాది పాలపుంతలు ఈ అనంత ఆకాశంలో తిరుగుతున్నాయి. వీటన్నింటిలో "ఈథర్" వ్యాపించి ఉన్నది. ఈనాడు మన నోటి నుండి వెలువడిన శబ్దం కోట్లాది సంవత్సరాల వరకు సముద్రంలో తరంగములవలె వెళ్తూనే ఉంటుంది. గోల్ సిద్ధాంతం ఆధారంగా తిరిగి తిరిగి ఎక్కడి నుండి వెలువడిందో అక్కడికే తిరిగి వస్తుంది. ఈ శబ్దం ఎంత దూరం వెళ్ళినా దాని అస్థిత్వం ఉంటూనే ఉంటుంది. దానిని ప్రత్యేకమైన పద్ధతులతో పట్టుకోవచ్చు. మహాభారతంలో జరిగిన సంఘటనలు కళ్ళతో చూడటానికి, శ్రీకృష్ణుని గీత వినడానికి ప్రయోగాలు జరుగుతున్నాయి. భౌతిక విజ్ఞానం ముందు ముందు ఎంత ప్రగతి సాధిస్తుందంటే ఏనాడో జరిగిన సంఘటనలను చూడగలగడం, అప్పుడు మాట్లాడిన మాటలు వినగలగడం సాధ్యం అవుతుంది. గాయత్రీ మహామంత్ర శబ్దరచనను విశ్లేషించే సమయమున పెద్దలు చెప్పింది ఏమిటంటే **"శబ్దాన్ని సామాన్యమైన దానిగా చూడకండి బాహ్యజగత్తులో దాని ప్రభావం సామర్థ్యం అత్యంత అద్భుతమైనవి"**

శబ్దం యొక్క ప్రభావం అంతఃమనస్సుపై అద్భుతంగా ఉంటుంది. నోటి నుండి వెలువడిన శబ్దం బాహ్యజగత్తులోనే ఉండదు. దాని శక్తి సగం బయటకు వెళ్తుంది. సగం శక్తి లోపలే తిరుగుతుంది. ఉచ్చరించిన శబ్దంలోని సగం శక్తి బ్రహ్మాండంలో వ్యాపిస్తుంది. సగం శక్తి పిండంలోనే (శరీరంలోనే) ప్రభావం చూపుతుంది. తుపాకి పేల్చినపుడు గుండు బయటకు వెళ్ళి లక్ష్యాన్ని తాకుతుంది. అదే సమయంలో దాని ప్రభావం వెనుక ప్రక్కకు కూడా చూపిస్తుంది. అందువల్ల తుపాకి పేల్చేవారు దానిని భుజానికి సవ్యముగా ఆన్చుకుని ప్రయోగిస్తారు. లేకపోతే పేల్చేవాని భుజానినో, చేతినో అది గాయపర్చవచ్చు. శబ్దోచ్చారణ ఒక రకంగా తుపాకి కాల్చడం లాంటిదే. దాని ప్రభావం కేవలం ఆకాశంలో మాత్రమే ఉండదు. అది పయనించిన చుట్టుప్రక్కల ప్రాంతాలలో, శరీరంలో ఉంటుంది. ఈ స్పందనలను సూక్ష్మ అధ్యయనం చేసిన తరువాత తత్వదర్శులైన ఋషులు మంత్ర విద్యను ఆవిష్కరించారు. ఏ ఏ శబ్దాలు, ఏ ఏ క్రమంలో, ఏ భావనలో, ఏ స్థితిలో ఎలా ఉచ్చారణ చేస్తే ఏమి జరుగుతుందో అనేది పరిశోధించారు. ఈ గొప్ప శక్తిని లోకహితం కొరకు అనేక విధాలుగా ప్రయోగించవచ్చనే నిర్ధారణకు వచ్చారు. వారు లక్షలాది సంవత్సరాల అవిశ్రాంత కృషి చేసి పొందిన ఫలితాల వల్ల మానవజాతికి చాలా మేలు జరిగింది. ఈనాడు ఏ విధంగా యంత్రముల ద్వారా సుఖం, సౌఖ్యములు లభిస్తున్నాయో, అదే విధంగా ప్రాచీన కాలంలో మంత్రముల ద్వారా సుఖశాంతులు సమృద్ధులు పొందేవారు.

ప్రాచీన కాలంలో దివ్యమైన అస్త్రశస్త్రముల ప్రయోగం మంత్రశక్తి ఆధారంగా జరిగేవి. ఆగ్నేయాస్త్రం, బ్రహ్మాస్త్రం నారాయణాస్త్రం మొదలైనవి ఈనాటి ఆయుధాల వంటివి కావు. ఈనాటి ఆయుధాల కన్నా అత్యంత సామర్థ్యవంతమైనవి. మంత్ర శక్తిని యజ్ఞముల ద్వారా ప్రయోగించి వర్షములు కురిపించేవారు, పౌష్టికమైన ఆహార పదార్థములను, వనస్పతులను ఉత్పాదన చేసేవారు, శారీరిక, మానసిక వ్యాధులను తగ్గించేవారు. ఆత్మిక ఉత్కృష్టత పెరుగుతూ ఉండేది. దివ్యదర్శనం, సూక్ష్మశ్రవణం వంటి సిద్ధులు ప్రాప్తించుకుని ఎవరికి వారే ఒక మహత్వపూర్ణ వైజ్ఞానిక యంత్రంగా రూపొందేవారు.

ఈనాడు **ఈ మహా విజ్ఞానం మరచి, మణిని పోగొట్టుకున్న సర్పం వలె పతన స్థితిలో ఉన్నాము.** నవజాగరణ పుణ్య సమయంలో మనం మన వర్చస్సుకు మూలాన్ని తిరిగి వెతకాలి, సాధించాలి. శాస్త్రకారులు "శబ్దోవైబ్రహ్మ" అన్నారు. బ్రహ్మలో ఉన్నటువంటి కళ, ఆ విభూతి ఆ గొప్పదనం అన్నీ శబ్దశక్తి ద్వారా ప్రాప్తించుకోవచ్చు. **మంత్రం అనేది శబ్దశక్తి యొక్క ఉచ్చస్థరీయ ప్రయోగం. దీని ఉపయోగం కనుక మనం తెలుసుకున్నట్లయితే నిస్సందేహంగా నిజమైన జ్ఞానులుగా, విజ్ఞానులుగా తయారవవచ్చు.**

గాయత్రీ మహామంత్రం సమస్త మంత్ర శాస్త్రముల ప్రాణం, బీజం, మర్మం. ఆగమ, నిగమ, వేద తంత్రముల అంతర్గతంగా కూడా తాంత్రిక ప్రయోగాలున్నాయి. వీటన్నింటిని గాయత్రి బీజశక్తి యొక్క పల్లవించిన పరికరములుగా అర్థం చేసుకోవాలి. మంత్ర విద్య భాండాగారం వేదమాత, దేవమాత, విశ్వమాత గాయత్రీ మహాశక్తి ద్వారా ఉద్భవించింది. ఈ అనుపమ అద్భుతమైన, అనంతమైన, అప్రమేయమైన విభూతిని ప్రాప్తించుకుని మనం మన వైజ్ఞానిక, సామాజిక, ఆధ్యాత్మిక, భౌతిక జీవనం సుఖంగా, సమృద్ధితో సార్థకం చేసుకోవాలి.

*– అఖండ జ్యోతి, సెప్టెంబరు 2004*

*– అనువాదం : శ్రీమతి జ్ఞాన ప్రసూన*

[redacted]ను ముంచుతుంది. ఒక చిన్న దుర్గుణం మనిషిని ముంచుతుంది.

రంగుల విజ్ఞానం

# రంగులలో అందమే కాదు శక్తి కూడా ఉన్నది

రెండవ ప్రపంచ యుద్ధం జరిగినప్పుడు రంగుల యొక్క ప్రభావం గురించి ఎన్నో విషయాలు వెలుగులోకి వచ్చాయి. "జీవితంపై రంగుల ప్రభావం" అనే విషయంపై చాలా దేశాలు పరిశోధనలు చేసాయి. వేరు వేరు రంగులు వేరు వేరు విధాలుగా మనో భావాలను మేల్కొల్పుతాయని, వాటిలో చమత్కారమైన శక్తి ఉందని కనుగొన్నారు. పెళ్ళిళ్ళకి, ఉత్సవాలకి, పర్వదినాలకి గుమ్మాలకి ఆకుపచ్చగా, పసుపు పచ్చగా, ఎర్రగా, నీలం రంగులో తోరణాలు కట్టి అలంకరించడం మన దేశంలో ఆచారం. అలా గుమ్మానికి రంగు రంగుల తోరణాలు కట్టడం వలన ఆ ఇంటికి సంబంధించిన వ్యక్తులకే కాక అక్కడకు వచ్చిన వారికి ఆనందం కలుగుతుంది. ఇది రంగులలోని రహస్యం.

జర్మనీలో కెమెరాలు తయారుచేసే ఒక ఫాక్టరీలో ఒక ప్రయోగం చేశారు. ఆ ఫాక్టరీలో గోడలు, దర్వాజాలు, తలుపులు, కిటికీలు అన్నిటికి ముదురు నీలం రంగు వేశారు. ఆ నీలిరంగు ప్రభావం వలన అక్కడి కార్మికులు పూర్వంకంటే ఎక్కువ వేగంగా పని చేయడం ప్రారంభించారు. ఉత్పత్తి పెరిగింది, రాబడి పెరిగింది. తరువాత దానిపైన ఏదో నల్లరంగు పూసారట దాని ప్రభావం వలన జరిగి కార్మికులలో నిరాశ, ఆలస్యం, ఉద్వేగం పెరిగి ఉత్పాదన పూర్తిగా పడిపోయింది.

చెప్పవచ్చేదేమంటే అందానికి, అలంకారానికి రంగులతో గట్టి సంబంధం ఉంది. సౌందర్యం అనేది ఆత్మకి సంబంధించిన ఒక గుణం. దానిని గురించి తగినంత వివరంగా తెలుసుకోలేకపోతే లాభం బదులు హాని జరగవచ్చు. ఇల్లు, గుమ్మాలు, కిటికీలు, గోడలపై చిత్రించే లతల రంగులు, వస్త్రాల రంగులు ఇవి ఏ రంగులో ఉంటే మనస్సులో ఎటువంటి భావాలు రేకెత్తిస్తాయి తెలుసుకొని ఉపయోగించుకుని, లాభం పొందవచ్చు.

కొంతమందికి ముదురు ఎరుపురంగు ఇష్టం ఉండదు. ఒక మానసిక చికిత్సకుని దగ్గరకి ఒక వ్యక్తి వచ్చి "నా బుర్రలో ఎప్పుడూ ఏదో సంక్షోభంగా ఉంటుంది, ఆవేశంగా ఉంటుంది. కారణం తెలియడంలేదు" అన్నాడట. చికిత్సకుడు సూక్ష్మంగా అన్ని విషయాలు పరీక్షించినా కారణం అతనికి కనిపించలేదు. ఒక రోజు ఆ డాక్టరు ఆ రోగి ఇంటికి వెళ్ళడట. వాళ్ళ ఇంట్లో గుమ్మాలకి, కిటికీలకి ఎర్రటి రంగు తెరలు వ్రేలాడుతున్నాయట. వాకబుచేస్తే ఆ రోగి భార్యకూడా ఎక్కువగా ఎరుపు రంగులు దుస్తులే ధరిస్తుందని తెలిసింది. ఇంట్లో ఉన్న ఎర్ర రంగు తెరలన్నీ తీసివేసి నీలం, ఆకుపచ్చ రంగుల తెరలు వేయమని సలహా ఇచ్చాడట వైద్యుడు. భార్య కూడా ఎర్రరంగు దుస్తులు వేయడం మాని వేరే రంగులు ధరించడం ప్రారంభించాక ఫలితాలు ఆశజనకంగా మారాయి. రోగి ఉద్విగ్నత, బాధ తగ్గసాగాయి.

భగవతి సరస్వతి జ్ఞానానికి, మాధుర్యానికి దేవత. ఆమె రూపకల్పనలో రంగులకి విశేష మహత్వం ఉంది. ఋషులు ఆమెను **యాకుందేందు తుషార హార ధవళా యా శుభ్ర వస్త్రావృతా** అని వర్ణించారు.

ఇక్కడ శ్వేత వర్ణం అంటే జ్ఞానానికి, గంభీరతకు, పవిత్రతకు చిహ్నము. అందువలననే పెళ్ళికాని కన్యల, విధవలను శ్వేత వస్త్రాలను ధరించమంటారు. అటువంటి వారిని చూస్తే ఎదుటివారిలో ద్వేషభావము, దుర్భావము రాదు, ఇందువలన విద్యాలయాలకు వెళ్ళేవారు శ్వేత వస్త్రాలు కాని, లేత రంగు దుస్తులు కాని ధరించాలి.

నీలం రంగులు ధరించిన వానిని చూస్తే ఉదారతా, సౌందర్య ప్రేరణ కలుగుతుందట. మాధ్యమిక తరగతుల విద్యార్థులపై నీలం రంగు ప్రభావం ఎక్కువగా కనిపిస్తుంది. ఈ వయస్సు అబ్బాయిలకు, అమ్మాయిలకు నీలం రంగు వస్త్రాలు ధరింపచేస్తే అత్యంత లాభాన్నిస్తుంది అంటున్నారు పరిశోధకులు. **ట్యూబ్ లైటు ప్రకాశం నీలం రంగులో ఉంటే దోమలు పారిపోతాయని అమెరికాలో ఒక ప్రయోగం వల్ల తెలుసుకొన్నారు.** నీలం రంగు దోమలకి బాధాకరంగా ఉంటుందట. అక్కడ బూడిద రంగు ప్రయోగం చేసి ఇతర కీటకాల్ని రక్షించడంలో కృతకృత్యులయ్యారట.

ఎరుపు రంగంటే ఆక్రమణ, హింస, స్ఫూర్తికి ప్రతీక అని చెపుతారు. ఆంబోతుకు ఎర్రరంగు చూపిస్తే కంగారుపడుతుంది రెచ్చగొట్టబడుతుంది. నారింజ రంగు వీరత్వానికి, బలిదానానికి ప్రేరణనిస్తుంది. అందుచేత యుద్ధాలలో దీనిని ఉపయోగిస్తారు. మిలటరీలో ఉండే పెద్ద పెద్ద ఆఫీసర్ల భుజాలపై ఎర్రరంగు పట్టీ పెడతారు, టోపీపైన ఎర్రరంగు పట్టీలుంటాయి. వాటిని చూసి జవాన్లలో, రోషము, ఉషారు ఉద్భవిస్తాయి. ఈ రంగు వ్యక్తిగతంగా, కుటుంబంలో ఉపయోగించేది కాదు. నలుపు, బూడిదరంగు శక్తికి ప్రతీకలు. కాని వీటిని అలంకారాలలో పాక్షికంగానే వాడతారు.

జీవకోటిని ప్రభావితం చేయడంలో గులాబీరంగుకి అగ్రస్థానం ఉందనే విషయం విదితమే! గులాబి రంగు ప్రకాశంలో చెట్లు బాగా పెరుగుతాయి. పక్షులు వృద్ధి పొందుతాయి. జ్వరము, అటలమ్మ, జలకేసర మొదలయిన రోగాలపై గులాబి ప్రకాశం వలన ఆశాతీతమైన లాభాలు గోచరించాయి.

**[redacted] కాక చేతల ద్వారా చేసే ఉపదేశం సార్థకం అవుతుంది.**

ప్రసిద్ధ జీవ శాస్త్రజ్ఞుడు విక్టర్ ఇన్యూషియన్ మాలిక్యులర్ బయాలజీలో కొత్త ప్రయోగాల వలన “గులాబీ ప్రకాశంలోని జీవన కార్యకలాపాలకి ఆత్మ ప్రకృతితో కలయిక ఉంది” అని నిర్ధారించారు. ‘అల్బర్ట్ జెంట్ జోజీ” (నోబుల్ పురస్కార విజేత – బయోకెమిస్ట్) “ప్రతి ప్రాణికి సంవేదన శీలతకు దాని స్థిరత్వానికి గులాబీరంగు చాలా అనుకూలిస్తుంది” అన్నారు. పూజలలో గులాబీరంగు వస్త్రాలు, లఘు సర్వతోభద్ర చక్రంలో ఎర్రరంగు ఉపయోగిస్తారు. స్త్రీలు గులాబిరంగు పాదాలకు పారాణిలాగా అత్తుకుంటారు, సింధూరాన్ని పాపిటలో దిద్దుకుంటారు. దీని వలన సౌందర్యం ఇనుమడించడమే కాక చూసేవాళ్ళ మనస్సులలో, భావంలో శక్తి, పవిత్రత వృద్ధి చేస్తాయి.

ఇన్యూశియన్ సూర్య కిరణాల గురించి విశ్లేషణ చేస్తూ “జీవన కార్యకలాపాలలో ఖర్చుఅయే శక్తి 660 నుంచి 680 మిలీ మైక్రోన్ దాకా మనిషి తిరిగి ఎలా పొందుతాడు, దానికి సౌరవర్ణక్రమం (స్పెక్ట్రమ్)లోని నారింజరంగు భాగం పరిశీలిస్తే సరిగా తెలుసుకోగలుగుతారు. ఇన్యూశియన్ ఈ పరిశోధన అయిదు సంవత్సరాల పాటు కొనసాగించాడు. ఎక్సరే ఉపకరణాల ద్వారా జంతువుల శరీరంలోనికి భయంకరమైన రేడియేషన్ ద్వారా జ్వరాలు పుట్టించాడు. గులాబీ ప్రకాశంతో దానికి వైద్యం చేసి 25% రోగగ్రస్త జంతువులని 20 రోజులలో పూర్తి ఆరోగ్యవంతులుగా చేశాడు.

హిందువులలో చిరకాలంగా ఒక ఆచారం ఉన్నది. ఇప్పటికీ రాజస్థాన్ ఉత్తర ప్రదేశ్‌లలో గోడల పై రంగుల చిత్రాలు చిత్రించే అలవాటు ఉన్నది. దీని వలన తెలియకుండా రంగుల ప్రభావం మనుష్యులపై పడుతుంది. చాలామంది ఈ రంగుల వలన లాభం పొందవచ్చు. విద్యాలయాలలో, సార్వజనిక స్థలాలలో రంగు రంగుల డిజైన్లు, కళాకృతులు రచించడం, కిటికీలు, దర్వాజాలు రంగుల పరదాలు అలంకరించడం, వివిధ రంగులతో రచించిన సుభాషితాల వలన వందలకొలది మంది లాభం పొందుతున్నారు. పోను పోను జనం ఈ రంగుల గురించి బాగా తెలుసుకొని ఇంకా అమితమైన లాభాలు పొందగలరు.

పసుపు పచ్చరంగుకి ప్రేమకి సంబంధం ఉంది. భారతీయులకి ఈ విషయం ఎప్పుడో అవగతమయింది. ప్రకృతికి ప్రతిరూపంగా పచ్చని వస్త్రాలు ధరించే ఆచారం పురాతనమైంది. **పసుపురంగు బుద్ధిని వికసింపచేసేది, ఆరోగ్యవర్ధకం అని చెపుతారు.** ఉపాసన, అనుష్ఠానంలో దీని మహత్వం చాలా ఉంది. ప్రాతఃకాలంలో పసుపుపచ్చని మధుపర్కాలు ధరింపచేస్తారు. ఈ రంగు ప్రభావంతో ప్రేమ, వివేకమూ వికసిస్తాయి. ఈరెండు దాంపత్య జీవితానికి, మానవ జీవన కల్యాణానికి చాలా సహాయం చేస్తాయి. ఉపాసనా, పురశ్చరణకి ఈ రంగు దోహదం చేస్తుంది. అందువలన పచ్చరంగు విశిష్ఠత సంతరించుకుంది.

ఆకుపచ్చరంగు ఆనందాన్ని, ఆహ్లాదాన్ని ఇస్తుంది. మేధాశక్తితో ఎక్కువ శ్రమ పడి పని చేసే వారికి, అస్వస్థులైన వారికి ఈ రంగు ఉపయోగించాలి. కొండలలో, కోనలలో విహరిస్తే అచ్చటి పచ్చదనం కళ్ళకి ఎంతో హాయినిస్తుంది. ప్రకృతి వికసించిన స్థలాలకు విహారానికి వెళ్ళే అవకాశం వస్తే తప్పక వినియోగించుకోవాలి. దీని వలన మనస్సుకి శరీరానికి అలసట దూరమయి హాయి కలుగుతుంది. ఇంటికి ఇరువైపులా ఆకుపచ్చని చెట్లు, లతలు కూరగాయలు పండించి లాభాన్వితులు కావచ్చు.

ఆకుపచ్చరంగుతో పని చేసే శక్తి పెరుగుతుంది. వానా కాలంలో రైతులు ఒంటరిగా ఎంతపని చేయగలరో, జ్యేష్ఠమాసంలో అదే పనిని ఎంతోమంది రైతులు కలిసి చేయలేరు. ఒకసారి విమానాలు తయారుచేసే ఫాక్టరీకి ఇరుప్రక్కలా రంగులు ప్రయోగం చేశారు. ఇక్కడ ఆకుపచ్చ రంగును ఉపయోగించారు. కృత్రిమమైన ఆకుపచ్చరంగు సూర్యకిరణాలు ప్రసరింపచేసారు. తరువాత శ్రామికులు ఎక్కువ శక్తితో పని చేయడం ప్రారంభించారు.

జీవితాన్ని ప్రభావితం చేసే ముఖ్య రంగులు ఇవి. ఇతర రంగులు కూడా ప్రభావంలో తక్కువ ఏమీ కాదు. చాలా రంగుల కలయిక చాలా ఆకర్షణీయంగా ఉంటుంది. ఇంద్ర ధనస్సులోని ఏడురంగుల కలయిక మనోహరంగా ఉంటుంది. ధార్మిక దృష్టిలో గోధుమరంగుకి హిందువులు, బౌద్ధులు మహత్యం కల్పించారు. ఈ రంగు సాత్వికము పవిత్రము, జీవితంపై ప్రేమ, శ్రద్ధాభావాలు జాగృతం చేస్తుంది.

ఈ రంగులన్ని సూర్య కిరణాలలోనే ఉన్నాయి. సూర్యుని ప్రకాశాన్ని “స్పెక్ట్రోమీటరు విడగొట్టినట్లయితే యంత్రంలో అది ఏడురంగులలో విభజింపబడతాయి. ప్రకృతిలో ఏరకమైన రంగుల కలయిక, విడిపోవుట అనేది సూర్య కిరణాల యొక్క లీల. మన జీవితంలో పరిస్థితి, వయస్సు, ఉపయోగం దృష్టిలో ఉంచుకొని రంగులను ఉపయోగించాలి. ఇది కూడా ఒక కళ. పూర్వం ఇళ్ళల్లో రంగురంగుల చిత్రాలు చిత్రించడం చిత్రాలు అలంకరించడం, వేషభాషలు ఎలా ఉండేవో వాటిని తిరిగి ఉపయోగంలోకి తేవాలి. ఈ రంగుల కళలను వికసింపచేయాలి. విద్యాలయాలలో గ్రంథాలయాలలో, దేవాలయాలలో రంగుల వెలుగులతో, పూలతో అలంకరించాలి. ఉత్సవాలలో, శుభకార్యాలలో ఆయా స్థలాలలో రంగు రంగులలో అలంకరించి ఒక విశిష్ఠత కల్పించి శోభామయంగా చేస్తే అందమే కాదు దాని వలన అంతరంగ గుణాల వికాసం, వృద్ధి, శక్తి కూడా ప్రతివారికి లభిస్తుంది. జీవితం రంగుల మయం చేసుకోవాలి.

*– అఖండ జ్యోతి, జూలై, 1969*

*అనువాదం : శ్రీమతి జ్ఞాన ప్రసూన*

[redacted]వ స్వరూపాలు. వాటిని ఆరాధిస్తే వెలుగు, ఉల్లాసమూ రెండూ కలుగుతాయి.

## గాయత్రి - 24 శక్తి ధారలు (19)

# భవాని

భవాని అనేది గాయత్రికి మరోపేరు. ఈ రూపంలో ఆద్యశక్తి ఉపాసన చేస్తే భర్గ తేజస్సు అభివృద్ధి చెందుతుంది. అవాంఛనీయ శక్తులను పరిస్థితులను ఎదిరించి ఓడించేందుకు భర్గ (తేజము) అవసరము. దీనిని ఒక శక్తి ధార అని కూడా అంటారు. దుర్గా, చండీ, భైరవీ, కంకళీ, భవానికి పర్యాయవాచకాలు. వీరి ముఖాలు, భావచేష్టలు వికృతంగా ఉంటాయి. వీరి వాహనం సింహం. సింహం అంటే పరాక్రమం, ఆక్రమణకి చిహ్నం. ఆమె చేతులలో ఉన్న ఆయుధాలు శత్రువులను చిన్నాభిన్నం చేసి చూర్ణం చేసే శక్తి కలవి. ప్రజలు కత్తిని భవానీ అని పిలుస్తారు. అవాంఛనీయాల్ని అడ్డుకోడమే వీని ప్రయోజనం. రాక్షసుల శస్త్రాలను నీరసింపచేయడానికి ఉపయోగపడతాయి. అవినీతిని నిరోధించడం, నీతిని సమర్థించడం కోసం వీటిని ఉపయోగిస్తారు కనుకనే భవాని అని పిలుస్తారు.

ధర్మం సేవలో, సాధనలో, కరుణ కురిపించడంలో, సహాయంలో, ఉదారత్వంలో ఉపయోగపడుతుంది. ధర్మం యొక్క సృజనాత్మక పక్షం ఇది. ధర్మానికి మరోపక్షం అవినీతిని ఎదుర్కొనడం? ఇది లేనిదే ధర్మం పూర్తికాదు. ధర్మం సజ్జనత్వాన్ని రక్షించాలంటే చెడుని ఎదురించాలి. ఈ నిరోధించే శక్తినే భవాని అంటారు. దుర్గా, చండీల రూపంలో ఈ లీలలనే వర్ణిస్తారు. దేవీ భాగవతం మహాశక్తి గురించి విశేషంగా చెప్పబడింది. ఇంకా పురాణాలు ఉపపురాణాలలో కూడా చర్చ జరిగింది. అసురనాశిని, సంకట నివారిణి అని దేవిని చిత్రించారు. అవతారాలకు రెండు ఉద్దేశ్యాలు ఉంటాయి. ఒకటి ధర్మ సంస్థాపన రెండు అధర్మ వినాశనం. నిజానికి రెండు ఒకదానిపై ఒకటి ఆధారపడివున్నాయి. సృజన, ధ్వంసం రెండు ప్రతిక్రియలని ఆచరిస్తే తప్ప పటిష్టమైన వ్యవస్థ నిర్మాణం జరగదు. భోజనం చేయడం ఎంత అవసరమో మలవిసర్జన కూడా అంతే అవసరం. ఒక వస్తువు తయారు చేయడానికి, వృద్ధి పరచడానికి ఎంత కృషి చేయాలో ఆక్రమణ చేసే తత్వాల నుంచి రక్షింపబడటానికి అంతే కృషి చేసి తీరాలి. రాజ్యాధికారం ప్రజలను పాలించడానికే కాదు. ప్రమాదాలను అడ్డుకోడానికి సైన్యం, పోలీసుల నియామకం మొదలైన ప్రయత్నాలు చేయాలి. రైతు వ్యవసాయం చేసి పంటపండిస్తాడు. తోటమాలి తోటను పెంచుతాడు వాటిని కాపాడుకోలేకపోతే అహోరాత్రులు చేసిన కష్టం నేలపాలవుతుంది. లేక పరహస్తగతమవుతుంది. ఆ దుష్ట శక్తులు ప్రోత్సాహం పొంది, బలం పుంజుకొని దుస్సాహసాలు చేస్తాయి. వానిని పోషించడం ప్రోత్సాహించడం ఎంత అవసరమో, దుష్టత్వాన్ని ఎప్పటికప్పుడు సమూలంగా నాశనం చేయడం అంతే అవసరం. ఏదో ఒకటి మాత్రం చేస్తే ప్రయోజనం శూన్యం. మనలోని దుర్బుద్ధిపై పోరాటమే సంఘర్షణకి మొదటి మెట్టు. నీచభావాలు, చెడు ఆలోచనలు అంతరంగంలో నాటుకుపోతాయి. మానవుడిని పతనం చేస్తాయి. పరాభవం అనే గోతిలోకి తోస్తాయి. చెడ్డ అలవాట్ల వల్ల చెడ్డ పనులకు, దుర్వ్యసనాలకు లోనవుతాడు. తత్ఫలితంగా కష్టాలు, నష్టాలు, బాధలు, అవమానాలు అనుభవించాల్సివస్తుంది. వ్యక్తిత్వంలో పాతుకుపోయిన దురలవాట్లను పెకలించి నాశనం చేయాలి. జప-తప-ధ్యానాదులే సహాయకర్తలు.

సోమరితనం, బద్ధకం, అవ్యవస్థ, అమర్యాద, స్వార్థము మానవునికి లోకంలో తిరస్కారము అందిస్తాయి తప్ప ఏమాత్రము గౌరవాన్ని ఇయ్యవు. ఈ గుణాలు అవధులు దాటితే వ్యక్తి భ్రష్టుడైపోయి, పశువు అని, పిశాచం అని పిలుపించుకుంటాడు. కోరికలు, అహంకారం పెరిగిపోయిన వ్యక్తి సమాజంలో ఇతరులను పీడిస్తాడు. అసహ్యము, ఛీత్కారం ఎదురవుతాయి. ఈ స్థితినుంచి పైకి లేచినపుడే వికాసానికి అవకాశం లభిస్తుంది. ఆత్మ శోధన చేసుకోగలిగే సాహసమే భవాని. ఆత్మ విజయమే గొప్పది.

సమాజంలో సహకారం, సజ్జనత్వము, సృజనాత్మక ప్రయత్నాలు జరిగేచోట కూడా చెడు, దురాలోచలూ తక్కువగా ఏమి ఉండవు. అవాంఛనీయత్వము, అవినీతి, మూఢనమ్మకాల వలలు అదృశ్యంగా పరచి ఉంటాయి. వీటివల్ల ఎన్నో వ్యక్తిగత సమస్యలు, సాంఘీక సమస్యలు తలెత్తి వికృతమైన వాతావరణం తయారవుతుంది. వ్యక్తిగతంగా, సామూహికంగా ప్రచండమైన ప్రయత్నం కావాలి. ఈ ప్రయత్నాలనే చండీ అంటారు. ఈ శక్తి గాయత్రి సాధనతో సహజంగా మెండుగా లభిస్తుంది.

★★★

[redacted] నియోగం అవుతుంటే భవిష్యత్తు స్వర్గమయం అవుతుంది.

మనం మన ఆరోగ్యం

# చందనస్య మహత్పుణ్యం పవిత్రం పాప-రోగ నాశనం

చందనం సువాసన మరియు చల్లదనం కలిగించే ఒక దివ్యమైన వస్తువు. ఇది పరిసర ప్రాంత వాతావరణంలో సువాసనలు నింపుతుంది. మత్తును కలిగిస్తుంది. ఈ చందనపు దివ్య సుగుణాలతో మన శరీరం చల్లగాను, మనస్సు ప్రసన్నంగా, హృదయం పవిత్రతతో నిండిపోతుంది. ఇది సాత్వికమయిన సుగంధపూరిత విశేషాల గుణం కలిగినందున ప్రతిధార్మిక కార్యక్రమములో విశేషంగా ఉపయోగించబడుతుంది. ఇది ఆధ్యాత్మిక, ధార్మిక కార్యక్రమాలలోనే కాకుండా రోగనివారణ ఔషధాలలో కూడా ఎంతో ప్రాధాన్యత సంతరించుకుంది. విభిన్న రోగాలకు ఇది అమోఘమయిన గుణమిచ్చే ఔషధంగా కూడా ఉపయోగించబడుతుంది. దీని విభిన్న గుణాల వల్ల ఆధునిక ఆరోగ్య చికిత్సా విధానంలో ఉపయోగింపబడడంతోపాటు ఔషధ పరిశోధన విభాగంలో ఆశ్చర్యకరమైన అద్భుతగుణాలు ఉండినట్లు కనుగొన్నారు.

గంధపుచెట్టు నిరంతరం వసంత శోభతో పచ్చ పచ్చగా సంవత్సరం పొడవున పెరుగుతుంది. ఇది దాదాపుగా 24 నుండి 30 అడుగుల ఎత్తు పెరుగుతుంది. (6.4 నుండి 9.0 మీటర్ల వరకు) వృక్ష శాస్త్రజ్ఞులు దీని ఆకులు అండాకృతిని పోలి ఉంటుందని చెప్తారు. పూవులు వంగరంగులో గుత్తులుగా పూస్తాయి. దీని పండ్లు వంగరంగు కలబోసినట్లు ఉంటాయి. ఏప్రియల్, మే మధ్యలోను, అక్టోబర్, నవంబర్ నెలలో పంటకు వస్తుంది. గంధపు చెట్లు పూర్తిగా పరిపక్వ స్థితికి రావటానికి దాదాపుగా 60 సం॥ పడుతుంది. కాని తక్కువ వయస్సులో ఉన్న చెట్లను కూడా ఉపయోగించుకోవచ్చు. ఈ వృక్షాలు తమిళనాడు, కర్ణాటక దక్షిణ ప్రాంతంలో 200 కి.మీ. మేర వ్యాపించి ఉన్నవి. దక్షిణ ప్రాంతంలో ఈ వృక్షాలు ఏపుగా పెరుగుతాయి. ఇవి స్వతః సిద్ధంగా పుట్టి పెరుగుతున్న వృక్షాలు.

ఈ ప్రాంతంలో విపరీతమయిన వేడితో పాటు వాతావరణంలోని గాలులు, ఈ వృక్షములు పెరుగుటకు ఎంతో అనుకూలంగా ఉంటాయి. ఇక్కడి వాతావరణం అత్యంత సమృద్ధితో పాటు సాత్వికతతో నిండి ఉంటుంది. దీని చుట్టు ప్రక్కల ఏర్పడిన వాతావరణం ఇక్కడ నివసించే వ్యక్తుల మనసు మీద ఏ విధమైన ప్రభావం చూపుతుందో తెలుసుకోవలసిన విషయం. మనో వైజ్ఞానికులు రసాయనిక రూపంలో చందన నూనెలో ఆల్ఫా, బీటా, సెంటాలాల్, ఆల్డీహైడ్, కీటోన్ మొదలైనవి ఉన్నవి అని తెలుసుకున్నారు. చందన ధూపం సుగంధ వాసనతో పాటు దుర్లభమయిన తత్వంతో కూడి మనో భూమి మీద ఇది ప్రభావం చూపిస్తుంది. వాతావరణ నిపుణులు చెప్పేవివరణ ఏంటంటే ఒక గంధపు చెట్టు యొక్క సుగంధం దాదాపుగా వందమీటర్ల వైశాల్యంలో వ్యాపిస్తుంది. కృత్రిమంగా తయారైన సుగంధం 24 గంటలలో ఇంత వైశాల్యంలో వ్యాపింపచేయటానికి ఎన్నో వేల రూపాయిలు ఖర్చు చేయవలసి ఉంటుంది. కాని ప్రకృతి సిద్ధమైన చందన సువాసనలు సహజంగా ఎల్లప్పుడూ వెదజల్లబడుతాయి. ఈ విధంగా ఒక చందన వృక్షం సువాసన దాని పరిసర ప్రాంతాలలో విస్తరించటమే కాకుండా ప్రాణవంతమైన ఆక్సిజన్ ఉత్పత్తిని ఎక్కువగా చేస్తూ ఉంటుంది. ఈ కారణం వలనే మనిషి దీని పరిసర ప్రాంతంలోనికి వస్తూనే తెలివైనవానిగా, ప్రాణవంతునిగా, చైతన్యవంతునిగా మారగలడు.

పూర్వం మన ఋషులు ఈ చందనం మొక్క దివ్య విశేషాలు ఎరిగినవారే. అందువల్లనే వివిధ దేవ కార్యాలలో చందనం యొక్క చెక్కలను ఉపయోగించేవారు. ప్రస్తుతం ఈ చందనం నుండి లెక్కలేనన్ని సుగంధ ద్రవ్యాలు, లేపనాలు, నూనెలు ఉత్పత్తి చేస్తున్నారు. కాని మనం మన భోగాల కోసం మాత్రం ఉపయోగించుకుంటున్నాము. కాని భావనాత్మక మనఃస్థితి కొరకు ఉపయోగించలేకున్నాము. చందనాన్ని ఆధ్యాత్మిక భావాలు, దైవ కార్యాలలో వినియోగించుకుంటే మన హృదయాలు సాత్వికంగా మారి పవిత్ర వాతావరణంలో నిండిపోవడం ఖాయం.

ఇతిహాసకారులు వ్రాసిన విషయాలను లోతుగా గమనిస్తే క్రీస్తు పూర్వం 5వ శతాబ్దికి ముందు నుండే భారతదేశంలో చందన ఉపయోగాలు ఉన్నవి అని తెలుస్తుంది. 18వ శతాబ్ది మధ్యకాలం వరకు మన దేశం చందనాన్ని ముఖ్యమైన వస్తువుగా పరిగణిస్తుండేది. భారతదేశంలో తెల్లచందనం, ఎర్రచందనం పసుపు చందనంగా 3 జాతులు ఉండేవి. చరిత్రకారుల అభిప్రాయం ప్రకారం మొదటి శతాబ్ది నుండి మూడవ శతాబ్ది వరకు ప్రముఖంగా రోమ్ దేశస్థులు మన దేశం నుండి ఈ ఉత్పత్తులను దిగుమతి చేసుకొనేవారని ఎన్నో ప్రమాణాలున్నవి.

[redacted] భోగం, రోగం సహచరులు.

6వ శతాబ్దంలో అరబ్బులు మన దేశం నుండి చందన నూనెలు దిగుమతి చేసుకొనేవారు. ఈ విధంగా చందనం పంట వ్యవసాయ పరంగాను, వ్యాపారపరంగాను అతి ప్రాచీనకాలం నుండి ప్రసిద్ధమైంది. మన భారతదేశం పురాతన కాలం నుండి చందనాన్ని ఆయుర్వేద వైద్యంలో వాడుట ఉన్నది.

చందనం యొక్క ముఖ్యమైన ఔషధగుణాలు ఈ క్రింది విధంగా ఉన్నవి. శారీరక చల్లదనం కొరకు, రక్తలేమిలోను, విషహారిణిగాను, అతిమూత్రం, వాతపిత్త సంబంధ మందులుగాను ఉపయోగంలో ఉన్నది. ఇన్ని గుణాలు కలిగినందువల్లనే జ్వర సమయంలో, రక్తహీనతలో, వాంతులు విరోచన సంబంధ వ్యాధులను, అతి మూత్ర సంబంధ వ్యాధులకు, పాండురోగాలకు రకరకాల చర్మవ్యాధులకు విషకారక వ్యాధులలోను అతి ఉష్ణకారకాలయిన అనేక వ్యాధులకు ఈ చందనాన్ని ఉపయోగిస్తున్నారు. వైద్యుల పర్యవేక్షణలో మాత్రమే దీని ఉపయోగాలు తెలుసుకోవలసి ఉంటుంది. ఆయుర్వేద వైద్యుల అభిప్రాయాల ప్రకారం నీటితో అరగదీసిన గంధాన్ని నొప్పి వద్దగాని, వాపు వద్దగాని వ్రాస్తే లేక జ్వరం వస్తే శరీరం మీద లేపనంగా పూసినట్లయితే త్వరగా ఉపశమనం కలుగుతుంది. విషహరణంలోను, శారీరక మంటలు ఉన్నప్పుడు చల్లదనం కొరకు అరగదీసిన గంధం వ్రాయాలి. వివిధ చర్మరోగాలకు కూడా ఈ గంధం ఎంతో లాభదాయకంగా పని చేస్తుంది. బాగా దప్పికగా ఉంటే గంధాన్ని కొబ్బరినీళ్ళలో కలిపి త్రాగిస్తే త్వరగా దప్పిక తీరుతుంది. రక్తహీనతకు బియ్యపు కడుగులో గంధాన్ని, తేనె, పటిక బెల్లం కలిపి త్రాగిస్తే రోగం తగ్గిపోతుంది. వాంతులకు ఉసిరిక రసంలో గంధం కలిపిస్తే తగ్గిపోతుంది. గంధపు నూనెను ఉపయోగించి ఎన్నో రోగాలు నయం చెయ్యవచ్చు. మూత్ర శుద్ధికి, వీర్యవృద్ధికి ఉపయోగకరం. క్రిముల నాశకారి, కఫాన్ని అరికట్టుతుంది. కడుపులో మంటగా ఉంటే చందనం నూనెను ప్రతిరోజూ 15 లేక 20 చుక్కలు వరకు సేవిస్తే లాభం ఉంటుంది. చందనపు నూనె చిన్న యాలకులు, సొంఠితో సేవించితే కడుపు మంట తగ్గుతుంది. మూత్రాశయం రోగాలకు, వాతరోగాలకు చందన నూనెను పాలతో కలిపి తీసుకోవలసింది.

ఇంతేకాకుండా కఫం, దగ్గు మొదలయిన వ్యాధులకు కూడా చందనం ఉపయోగించుకోవచ్చు. చెవిపోటు, దంత బాధలకు చందన నూనెను తీసుకోవటం మంచిది. దురదలు, పొడలు ఉంటే గంధపు నూనెలో ఆవనూనెను సమ పాళ్ళలో కలిపి రాసుకుంటే త్వరగా ఉపశమనం కలుగుతుంది. భారతదేశంలో దొరికే చందనంతో హృదయ సంబంధిత వ్యాధులను నివారణ చెయ్యవచ్చు. చైనా దేశంలో దొరికే ఎర్రచందనం మూత్రాశయ రోగాలకు మంచి మందుగా ప్రసిద్ధి చెందింది.

అమెరికాలోని శాన్‌ఫ్రాన్సిస్కోలోని ఎలోఫన్ హెల్త్ కేర్ సెంటర్‌లో డా॥ నికల్సన్ గారు భారత్‌లో దొరికే చందననానికి అత్యంత రోగ నిరోధక శక్తి కలదని నొక్కి వక్కాణించారు. దీని ద్వారా ఎన్నో రకాల వ్యాధులను ముఖ్యంగా హృదయ సంబంధ రోగాలను నయం చెయ్యవచ్చని అన్నారు. డా॥ నికల్సన్ తన చికిత్సా విధానంలో గమనించిన విషయం ఏమిటనగా ఈ చందనం వివిధ రూపాలలో ప్రయోగించటం వలన రక్త ధమనుల్లో పేరుకుపోయిన "కొలస్ట్రాల్"ని తగ్గించటమే కాక ధమనుల గోడలు పలుచబడి రక్త సరఫరాకి అడ్డంకులు పోతాయాని తెలిపారు.

తెల్లచందనం చల్లదనాన్ని కలిగిస్తుందని డా॥ నికోల్సన్ తెలిపారు. వడదెబ్బ, అతిసారము, కఫం, బొబ్బలు, శ్వాసకోశ వ్యాధులు, జ్వరం, మంటలు, కాలేయం, పిత్తాశయముకు సంబంధించిన అనేక రోగాలను దూరం చెయ్యవచ్చు. ఊపిరితిత్తుల వ్యాధులను కూడా ఈ చందనం బాగా తగ్గిస్తుంది. జర్మను దేశపు డాక్టర్లు చందనంతో మూత్రాశయంలో వచ్చే రాళ్ళను మొదలయిన వాటిని తొలగించే విధానంలో విజయం సాధించారు. ఇలాంటి ప్రయోగాలే కాకుండా ప్రపంచంలో ఉన్న అనేక ప్రయోగశాలల్లో చందనం యొక్క వివిధ ఉపయోగాల్ని తెలుసుకోవటం కొరకు అనేక ప్రయోగాలు చేస్తున్నారు. మంచి ఫలితాలు చందనం ద్వారా పొందుతున్నారు. మనం కూడా చందన వినియోగ విషయంలో ఎప్పటికప్పుడు ప్రయోగాలు చేస్తూ ఉండాలి.

ఈ చందనంలో అత్యంత విలువైన ఆధ్యాత్మిక విషయాలు నిక్షిప్తమైఉన్నాయి. మెదడు శాంతిగా చల్లగా ఉండి సుగంధపు వాసనలతో ప్రసన్నంగా ఉండేందుకు మనం చందనాన్ని తిలకంగా దిద్దుకుంటున్నాము. దీని సువాసనలలో మన అంతరంగం సంతోషం, ఆనందంతో నిండుతుంది. ఈ కారణంగానే చందనం పవిత్రమైనది. పావనమైనది. పాపనాశకమైనది, లక్ష్మీ నిలయమైనదిగా ఆపద విపత్తులనుండి రక్షించేదని చెప్పబడింది. ఉంటుంది. ఈ విధంగా దివ్య సుగంధ తత్వాన్ని తెలుసుకుని భౌతిక, ఆధ్యాత్మిక రంగాలలో లాభాలు పొందవచ్చును. కాబట్టి మనం చందనం దైవసంబంధ కార్యాలలో, పూజావిధానాలలో మాత్రమేగాక అనేక రకాలుగా ఉపయోగించుకోవచ్చు.

*– అఖండజ్యోతి, జనవరి 2005*

– అనువాదం : జి. చెన్నకేశవరావు

[redacted]మైన శరీరం కన్నా అందమైన ఆచరణ మిన్న.

సాధనా విజ్ఞానం

# ఉపాసన మనిషిని దేవ మానవుడిగా మారుస్తుంది

ఉపాసన అంటే అర్థం దగ్గరగా కూర్చోవడం. భక్తుడికి, భగవంతుడికి మధ్య ఉన్న సంబంధాలన్నింటిలోనూ ఈ బంధమే అన్నింటికంటే శ్రేష్ఠమైనది. తండ్రి, తల్లి, సహాయకుడు, ప్రభువు మొదలైన సంబంధాలలో విధాత యొక్క గొప్పతనం ఉంది. కాని దానితోపాటు భక్తుడు తనని తాను దీనుడిగా, దరిద్రుడుగా, యాచకుడిగా, క్షుద్రుడిగా అసహాయుడిగా భావించడం కనిపిస్తుంది. భగవంతుణ్ణి గురించి వర్ణించాల్సిన పనిలేదు, ఆయన మహిమలు జగద్విదితం. భట్రాజుల పొగడ్తలు వినాలన్న కోరిక ఆయనకు లేదు, మనం పొగిడితే ఆయన ప్రసన్నుడవుతాడు, మనల్ని కరుణిస్తాడు అని భావించడం తప్పు. సృష్టివ్యవస్థను నడపడంలోనే సమయం సరిపోదు. మిగిలిన విషయాలకు సమయం, అభిరుచి ఎలా ఉంటుంది? ప్రశంసల వర్షానికి పొంగిపోయి భగవంతుడు ఎవరినైనా అనుగ్రహిస్తాడు అని సామాన్య ప్రజలు భావిస్తారు. భగవంతుణ్ణి ఆ విధంగా చిత్రీకరించడం సబబు కాదు.

ధనసంపదలు, మోక్షప్రాప్తి ఈ రెండింటిలో మన స్వార్థమే ఎక్కువ ఉంది. ఇవి కావాలని వినయంగా అడిగినా, మన దీనత్వాన్ని ప్రకటించినా వారి గౌరవం, మన గౌరవం రెండూ దక్కవు. భగవంతుని సాన్నిధ్యాన్ని పొందటం కోసం వేడుకోవటం కాక మన స్థాయిని ఆయనకు తగ్గట్లుగా పెంచుకోవడం అన్ని విధాలా శ్రేయస్కరం.

ఒక గొప్పవ్యక్తి దగ్గర కూర్చోవడానికి మన స్థాయిని పెంచుకోవాలి. ప్రధానమంత్రి ప్రసంగించే సమావేశాల్లో, ఎంపిక చేసిన పార్లమెంటు సభ్యులకు మాత్రమే ప్రవేశం ఉంటుంది. నగలవ్యాపారి, వ్యాపారస్థులు తమ స్థాయికి చెందిన వ్యక్తులనే దగ్గర కూర్చోబెట్టుకుంటారు. కొనేవాడు, మధ్యవర్తి అతనికి కొంచెం దూరంగా నిలబడి ఉంటారు. ఆవుదూడ తన తల్లి పాలు త్రాగుతుంది. ఆవుకి, దూడకిమధ్య ఆత్మీయసంబంధం ఉంది. తల్లి దూడను ప్రేమతో దగ్గరకు తీసుకుంటుంది. గోపాలుడు, మిగతా పశువులు ఆవుకి అంత దగ్గరగా రాలేవు.

చందనం చెట్లు సమీపంలో ఉన్న మామూలుచెట్టు కూడా దాని లాగానే సుగంధాలను వెదజల్లుతూ ఉంటాయి. స్వాతిచినుకు మత్స్యపుచిప్పమీద పడి ముత్యంగా, వెదురు మీద పడి వేణువుగా మారుతుంది. సత్‌సాంగత్యానికి ఇంత అపారమైన శక్తి ఉంది.

ఈ స్థాయికి చేరుకోవడానికి, ఉపాసన అవసరం అవుతుంది. వేడుకోవలసిన అవసరం ఇందులో లేదు. గోరింటాకు దాటంతట అవే ఎర్రగా పండుతుంది. ఉద్యానవనంలో విహారం చేస్తుంటే మంచి సుగంధభరితమైన వాసనలు ముక్కుపుటాలను తాకితే, కళ్ళు ఆ సుందర దృశ్యాన్ని చూసి ఆహ్లాదపడుతాయి. సమీపంగా ఉండటం వల్ల వచ్చే లాభం ఇదే. దుష్టుల సహవాసం వల్ల వచ్చే ప్రతిఫలం లోకవిదితమే. బొగ్గును గనుల నుండి బయటకు తీసుకువస్తున్నప్పుడు, అమ్ముతున్నప్పుడు ఆ మసివల్ల బట్టలు నల్లబడతాయి. దుర్వాసనలను వెదజల్లే వస్తువులను ముట్టుకుంటే చేతులనుండి, బట్టలనుండి దుర్గంధం వెలువడుతుంది.

భక్తుడికి, భగవంతుడికి మధ్య ఏకత్వం, సాన్నిహిత్యం, ఆత్మీయతలను పెంచడం కోసం ఉపాసనను ఒక విశిష్టమైన ప్రక్రియగా మన పూర్వీకులు పేర్కొన్నారు. దీనితో పోలిస్తే మిగతావన్నీ తృణప్రాయమే. మానవ జీవితానికి లభించిన ఒక చక్కటి ఆలంబన ఉపాసన. ఇదే ఉత్తమమైన పురుషార్థం. ప్రపంచంలోని సద్గుణాలు, విజయాలన్నిటికంటే ఇది మహత్తరమైనది. భగవంతుడితో సంబంధం కేవలం ఒక పరిచయస్థుడిగా కాకూడదు. తల్లి-తండ్రి, సహాయకుడు ఇలా ఏదో ఒక సంబంధాన్ని ఆయనలో పెట్టుకోవాలి. ఆ విధంగా ఆయన సమస్త సంపదకు వారసుడు కావాలి. మన జీవితంలో దీన్ని మించిన విజయం మరొకటి లేదు. దీనికోసం శ్రద్ధా-భక్తితో ఉపాసనను చెయ్యాలి.

ఉపాసన మనకు వెలుగుని, మార్గదర్శనాన్ని ప్రదానం చేస్తుంది. ఆదర్శాల నిలయమైన పరమాత్మ మనకు దగ్గరగా వచ్చి మనల్ని ఆదర్శాలతో నింపుతాడు. దైవీదత్తమైన

[redacted] సవ్యమైన దినచర్య ఆరోగ్యానికి మూలం.

సంపదలకు మనం అధిపతులు కావచ్చు. వాటిని సంపాదించటం కోసమే మనకు ఈ మానవజన్మ లభించింది. ఉపాసన ద్వారా సాధకుడికి లభించిన ఆనందాన్ని నోటి మాటలతో వర్ణించలేము, ఇది అనుభూతి చెందాల్సిన విషయం. పక్షి తన గుండెలో గుడ్లను దాచుకొని పొదుగుతుంది. ఆ వేడికి గుడ్లు పిల్లలుగా మారుతాయి, అదే విధంగా భగవంతుని సమీపంలో ఉన్న మనిషి ఎంతో వికాసాన్ని పొందుతాడు.

ఉపాసన భగవంతుడికి, జీవుడికి మధ్య ఏకత్వాన్ని, సామీప్యాన్ని స్థాపిస్తుంది. ఉపాసనతో భావ తీవ్రతను జోడించాలి. ఒకసారి భగవంతుడి సమీప్యాన్ని పొంది, రసానుభూతిని పొందిన తరువాత ఉపాసనని వదిలిపెట్టాలన్న తలంపు సాధకుడి మనస్సులోకి రాదు. పరమేశ్వరుడి సమీపానికి చేర్చే పూజ సార్థకమవుతుంది. ఈ భావన, నమ్మకం స్థిరపడిన కొద్దీ ఉపాసన మరింత ఉత్సాహాన్ని, ప్రతిఫలాన్ని ఇస్తుంది.

భావపూర్వకంగా చేసిన పూజ సాధకుడి అంతకరణాన్ని ఆనంద సాగరాల్లో ఓలలాడిస్తుంది. మనలోని ప్రగాఢమైన భక్తిభావన, భగవంతుడి మధుర దరహాసంలా మారుతుంది. భక్తులతో ఉల్లాసకరమైన మధుర సంభాషణ మొదలవుతుంది. భక్తుడు, భగవంతుడు దగ్గరయి అనిర్వచనీయమైన ఆనందసాగరంలో ఓలలాడుతారు.

దీని తరువాత ఉపాసకుడు భగవంతుడి దగ్గరకు, భగవంతుడు ఉపాసకుడి దగ్గరకు పయనిస్తూపోతారు. ఈ అనుబంధం పెరిగి పెద్దదయి తదాత్మ్యస్థితిలోకి వెళ్ళి, మమైకమవడంతో ముగుస్తుంది. మానవ జీవిత పరమార్థం ఇదే. ఒక సహాయకుడిగా, అంగరక్షకుడిగా, భగవంతుడు ముందు, వెనకా తనతోపాటు నడవటాన్ని భక్తుడు అనుభూతి చెందుతాడు. ఉపాసన ద్వారా, ఆ మహాశక్తితో అతి సన్నిహితమైన సంబంధాన్ని స్థాపించటం జరుగుతుంది. ఉపాసన ఒక మామూలు మనిషిని దేవమానవుడిగా మల్చుతుంది.

భగవంతుడు అనుక్షణం తనతోఉన్నట్లుగా సాధకుడు అనుభూతి చెందుతాడు.

★★★

## కదిలించే కళ్లు

37.సీ॥ ఋతుబాధలన్నియు ఋజువుగా సహియించి
కౄరమృగాలతో మైత్రినెరపి
మానవస్నేహంబు మానివేయుచునేను
ఒంటిగాజీవించు బంటుతనము
మూడింటియందును ముచ్చటన్ గెలుపొంది
ఆధ్యాత్మశక్తిని అందుకొనెడి
త్రోవపట్టితినంచు ప్రేమగాగురువులు
ఆశీస్సులందించి యలరువిధము

తే॥ గురువు గుహలోన నిద్రించి కుదురుగాను
కందమూలంబులన్ దినుచు గడపువిధము
మానవాళికి దెలుపుట మరువకనుచు
కవిని కదిలించే గురుదేవు కంటిచూపు

38.సీ॥ నందనవనమందు నయమొప్పదిరుగుచు
ప్రకృతియందాలకున్ పరవశింప
సూర్యోదయంబును సూర్యాస్తమయమును
జరిగేటివేళల జాడలేక
గురుదేవు మాటతో గుహలలో నిద్రించి
చలిపులి బాధను చల్లపరుప
దేవకందదినుచు దేహాన్ని పీడించు
ఆకలి బాధల నదుపు చేయ

తే॥ బ్రహ్మ కమలంబును పరమబ్రహ్మ వోలె
యోగనిద్ర నొసగుచుండ జోగు విధము
మానవాళికి దెలుపుట మరువకనుచు
కవిని కదిలించే గురుదేవు కంటిచూపు

రచన–మధుర కవయిత్రి
పొన్నూరు హైమవతీ శాస్త్రి

**యుగశక్తి గాయత్రి**
**మాస పత్రిక చదవండి !**
**చదివించండి !!**

[redacted]కుచిత తత్వాలు ఆధ్యాత్మిక దారిద్ర్యానికి లక్షణాలు.

### తత్వదర్శనం

# దేవపూజలో దాగిన రహస్యాలు

మనకు దేవతలు 33 రకాలు, పితృ దేవతలు 8 రకాలు, అసురులు 99 రకాలు, గంధర్వులు 27 రకాలు, పవనులు 49 రకాలు కలరని తెలుపబడినది. ఈ వివిధ శక్తులను చూస్తే భారతీయులకు ఎంత సూక్ష్మ విజ్ఞానము కలదో, దాని వలన ప్రకృతికి వారేవిధంగా యజమానులు కాగలిగారో తెలుస్తుంది. రావణాసురుని దగ్గర దేవతలు బందీలుగా ఉండేవారని, అతను దేవతలను జయించాడని తెలుపబడింది. భారతీయులకు ఇంతమంది దేవతలుండడాన్ని బట్టి వాళ్లు మానవత్వము యొక్క వికాసానికి చెందిన లెక్కలేని దైవీ గుణాలను వికసింపజేయడానికి ఎంతో లోతుగా ఆలోచించారన్న విషయం తెలుస్తుంది. ప్రతి దేవతా ఒక్క గుణానికి సజీవ రూపము. దేవ పూజ అంటే ఒక విధంగా సద్గుణాలకు, సామర్థ్యాలకు, ఔన్నత్యానికి సంబంధించిన గుప్తతత్వాలను పూజించడమని అర్థము. జీవితంలో ఉండవలసిన యోగ్యమైన, ఉత్తమోత్తమమైన మంచి గుణాలకు దేవతారూపాన్ని ఇచ్చి సమాజము యొక్క దృష్టిని దాని వైపుకు ఆకర్షించడం జరిగింది. గుణాలకు మూర్తిస్వరూపాన్నిచ్చి వివిధ దేవతల రూపాన్ని నిర్ధారించడం జరిగింది. ఈ సరళమైన పద్ధతి వలన జనానికి తమ జీవనాన్ని ఉన్నత స్థితివైపుకు తీసుకు వెళ్ళడానికి చక్కని అవకాశం లభించింది. మీరు ఏ దేవీ దేవతలను పూజించినా ఆ దేవీ దేవతలు జగన్నియంత యొక్క శక్తి యొక్క స్వరూపాలు. అవి దేవత్వములో అంతర్భాగములు. అవి వ్యక్తిత్వములో వికసించి సమర్థవంతులను చేస్తాయి.

**"ఆరోగ్యం భాస్కరాదిచ్ఛేత్ ధనమిచ్ఛేత్ హుతాశనాల్,**
**జ్ఞానంచ శంకరాదిచ్ఛేత్ ముక్తిమిచ్ఛేత్ జనార్ధనాత్"**

అంటే ఆరోగ్యం కావాలని సూర్యనారాయణుడిని అడగాలి, ధనము కావాలని హుతాశనుడిని (అగ్నిదేవుడిని) అడగాలి, జ్ఞానము కొరకు శంకరుని ఆరాధించాలి, ముక్తి కోసము జనార్ధనుని ఆశ్రయించాలి అని.

ఈ శ్లోకము యొక్క స్థూలమైన అర్థము ఆయా కోరికలు తీరడానికి ఆయా దేవతలను పూజించమని, ఆరాధించమని, చింతన చేయమని. పూజ అర్చన అన్న మాటల యొక్క మామూలు అర్థం గంధము, అక్షింతలు, ధూపం, దీపం, పుష్పం, నైవేద్యం, తాంబూలం, అర్ఘ్యం, స్తోత్రం, నమస్కారము మొదలైనవి అనుకుంటాం. ఈ మాత్రంగా కర్మకాండ చేయడం వల్ల దేవతలు ప్రసన్నులై మనం కోరుకున్న వాటిని ఇస్తారని భావిస్తాం. అనేకమంది పై పై అర్చనలు, పూజలతో చాలా సమయం గడపడం మనం చూస్తూనే ఉంటాం. కానీ వారి కోరికలు పూర్తిగా నెరవేరకపోవడమూ చూస్తూనే ఉంటాం. అటువంటి స్థితిలో పైన తెలిపిన శాస్త్రవచనం మీద అనుమానం ఏర్పడుతుంది.

లోతుగా చూస్తే ఈ వచనాన్ని సందేహించాల్సిన అవసరమే లేదు. ఫలించకపోవడానికి కారణం మన యొక్క దృష్టికోణం. దేవతలను ప్రసన్నం చేసుకోవడానికి ధార్మిక కర్మకాండకు చెందిన పూజాపత్రి చాలని తలుస్తాం. కాని అది నిజం కాదు. దేవీ దేవతల యొక్క అసలు స్వరూపాన్ని అర్థం చేసుకోవాలి. ప్రతి దేవీ దేవత యొక్క వ్యావహారిక రూపాలే మనం దైనిక జీవనంలో చేసే పని పాటల మీద ఆధారపడి ఉంటాయి. ఆ దేవత ఈ జగత్తులో మనం చేసే మంచి పనులు, అవి చూపించిన దిశలో పరిశ్రమ చేయడం, త్రికరణ శుద్ధిగా తన్మయులం కావడం మొదలైనవాటిని గమనిస్తుంది. మనం చేసే కర్మలకు సంతోషించి ఆ దేవత కోరిన ఫలితాలను ఇవ్వడం జరుగుతుంది. మనం ఎంచుకున్న ఇష్టదేవత యొక్క వ్యావహారికమైన రూపాన్ని అర్థం చేసుకోవాలి.

ఉదాహరణకు సూర్యుడినుంచి ఆరోగ్యము, బలము, దీర్ఘాయువు కోరుకుంటే లెక్కలేనన్ని లాభాలను చూసిన మీదనే తత్వజ్ఞానులైన పెద్దలు సూర్యుడికి నారాయణ అన్న దివ్యమైన విశేషాన్ని జోడించారు. సూర్యశక్తిని అత్యధికంగా పొంది, దానిని నిత్యవ్యవహారంలోకి తెచ్చుకోవడానికే సూర్యునికే చేసే పూజ వలన ఆరోగ్యం పెరుగుతుంది.

హుతాశన అగ్నిహోత్రం అన్న మాటకు అసలైన అర్థం "సాహసంతో కూడిన త్యాగం" అని అగ్ని హోత్రంలో మొదట మనం విలువైన హవన సామాగ్రిని ఎంతో భక్తితో హవనం చేయాలి. అప్పుడే మనకు యజ్ఞఫలం లభిస్తుంది. బాధ్యతతో, నిజాయితీతో, కఠిన శ్రమకు సిద్ధం కాగలవాడే ధనాన్ని

**[redacted] మాట్లాడుతారు, మూర్ఖులు వాదిస్తారు.**

సంపాదించగలుగుతాడు. తన అదృష్టాన్ని నమ్ముకుని ఏ విధమైన ప్రయత్నామూ చేయకుండా కూర్చునే సోమరి, సాహసహీనుడును గొప్ప పనులేవీ చేయలేడు, ధనాన్ని సంపాదించనూ లేడు. రైతు విత్తనాలను పొలంలో జల్లుతాడు, ధైర్యంతో ఆరు మాసాలు ఆ పొలాన్ని తన శ్రమతో చెమటతో తడుపుతూపోతాడు. ఫలితంగా ఒక విత్తనానికి బదులు వందల విత్తనాలు అతనికి లభిస్తాయి. సాహసి అయిన వాని మెడలో లక్ష్మీదేవి విజయమాలను అలంకరిస్తుంది. ధైర్యవంతుడు, ఉత్సాహంతో నిరంతర పరిశ్రమ చేసేవాడు, తన పనీ పాటల యందు ఏకాగ్ర చిత్తంతో శ్రద్ధనిలిపేవాడు సఫలీకృతుడౌతాడు. ఇదే అగ్నిని పూజించడం యొక్క నిజమైన వ్యావహారిక స్వరూపం. అగ్ని దేవతను పూజించే విధానం అర్థం చేసుకున్న వ్యక్తి అగ్నివలె కఠోర తపస్సు చేయాలి.

జ్ఞానం కోసం శంకరుడిని ఆరాధించే విధానం ఉంది, శంకరుడు సంయమనం కలవాడు, త్యాగి, ఏకాగ్రచిత్తం కల యోగి, ఉదారుడు. శంకరుని యొక్క ఈ గుణాలను తన నడవడిలోను, దినచర్యలోను ప్రదర్శించే వ్యక్తియే నిజమైన అర్థంలో జ్ఞానవంతుడౌతాడు. అతనికే తత్వదర్శన ప్రాప్తి లభిస్తుంది. ఓర్పులేనివాడు, మమకారంలో మునిగినవాడు, లోభి, చిత్తస్థైర్యం లేనివాడు, ఉదారగుణం లేనివాడు, జ్ఞానాన్ని బోధించడానికి ఎంత చక్కని ఏర్పాటున్నా అతను అర్భకునిగానే మిగిలిపోతాడు. అది జ్ఞానం కాదు, ఒక విధమైన అజ్ఞానం మాత్రమే. దాని వలన అతనిలో అబద్ధాలాడడం, మోసం, దొంగిలించడం, అహంకారం, ఓర్పులేకపోవడం వంటి దుర్గుణాలు పెరుగుతాయి. ఎవరిలో శివతత్వం నెలకొని ఉంటుందో అతను ఏ గురువూ లేకుండానే ఏకలవ్యునివలె ఒక మట్టి బొమ్మను గురువుగా చేసుకుంటాడు, కబీరువలె జ్ఞానంలో దీక్ష తీసుకుంటాడు. దత్తాత్రేయునివలె సాలె పురుగును, ఈగను, కాకులను, కుక్కలు వంటి అల్పజీవులను గురువులుగా చేసుకొని, వాటి ద్వారా తన జ్ఞానభాండాగారాన్ని నింపుకుంటాడు. జ్ఞాన ప్రాప్తికి తనలోపల శంకర తత్వాన్ని నెలకొల్పుకోవడం అవసరమౌతుంది. దీనికిది వ్యావహారిక రూపం.

ముక్తికోసం జనార్థనుని పూజించడం జరుగుతుంది. జనార్థన పూజను, లోకసేవను అనేకమంది తత్వదర్శకులు ముక్తికి సాధనాలుగా భావించారు. జీవంలేని ప్రతిమలను పూజించడం కన్న జీవులలో నెలకొన్న సజీవపరమాత్మను పూజించడం ఉత్తమ విధానమని అనేకమంది మహర్షులు భావించారు. ఈ విధంగా లోకసేవ ఈశ్వరపూజయే అవుతుంది, దానివల్ల మోక్షద్వారాలు తెరచుకుంటాయి.

దేవతాపూజ ప్రత్యక్షఫలాన్నిచ్చే సాధనం, భారతీయుడు తన చుట్టూగల ప్రతి జీవిలో వృక్షాలలో, పశువులలో, ప్రతి మనిషిలోను భగవంతుడు వ్యాపించి ఉండడం చూస్తాడు. ప్రపంచంలోని ప్రతి ప్రాణిని, తన చుట్టూగల మనుషులను జనార్ధన రూపాలుగా తలుస్తాడు. అటువంటి వ్యక్తి కనబడేట్లుగా గాని, కనబడకుండా గాని ఎవరికీ కీడు చేయడు, చేయలేడు. అట్టి సాత్విక ఆలోచనలు గల వ్యక్తి తనలోని సద్గుణాల వల్ల ఇతరులను ముక్తులను చేస్తాడు, తనకు తాను జీవన్ముక్తుడౌతాడు.

మన దేవపూజలో ఈ విధమైన రహస్యాలు పుష్కలంగా నిండిఉన్నాయి. అవి మనలోపల దాగిఉన్న పరాక్రమానికి చిహ్నాలు. ఇవి గుణాల యొక్క స్థూల ప్రతిమలు. ఈ రోజులలో మానవుడు తనలోపల దాగి ఉన్న శక్తులను మరిచిపోయాడు. లేకుంటే జ్ఞానం, ఆధ్యాత్మికత, ధర్మం, వివేకాలతో అసామాన్య జ్ఞానభాండారం నిండి ఉండేది.

– అనువాదం : కె.బి. సోమయాజులు

## గోడలకి చెవులు

*సాధారణంగా వ్యక్తి అన్నింటి పట్ల ఆపేక్ష చూపిస్తాడు కాని మంచి ఆలోచనలు, మంచి పనులు పట్టించుకోడు. చైనాకు చెందిన హుయిలేంగ్ అనే ధర్మోపదేశకుడు గోడవైపు ముఖాన్ని, శ్రోతలవైపు వీపును ఉంచి ప్రవచనం ఇస్తూ ఉండేవాడు. ఇదేమి వింతని ప్రజలు ప్రశ్నించగా అతను ఇలా అన్నాడు. "ఈనాటి మనుషులు గోడల్లాగే ఉంటున్నారు. కనీసం ఒక కిటికి వంటిది కూడా మానవులకు ఉండటం లేదు. వారు వింటారనిగాని, అర్థం చేసుకుంటారని గాని, విన్నది ఇతరులకు చెప్తారని గాని ఆశలేని నేను ఈ విధంగా గోడలకి చెప్పటం అలవాటు చేసుకున్నాను. నేను చేస్తున్న ఈ పని వలన ఎప్పుడో అప్పుడు గోడలకి చెవులు వస్తే ప్రజలు కూడా ఎప్పుడో అప్పుడు వింటారులే, గోడలకే చెవులు వచ్చాయి కదా! అనే ధైర్యం కలిగి నాలో క్రొత్త ఉత్సాహం కలుగుతుంది."*

*– ప్రజ్ఞా పురాణం నుండి*

**[redacted]తూ నవ్విస్తూ జీవించడంలోనే ఉన్నది సార్థకత.**

ఆదిశక్తి యొక్క లీలాకథలు - 6

# సాధనాలో వచ్చే ఆటంకాలను తొలగించివేస్తుంది అర్గలా స్తోత్రము

ఆదిశక్తి యొక్క లీలాగాథలను వర్ణించుటకు శ్రీదుర్గాసప్తశతి యొక్క రెండవది అయిన అభిన్న అంగం అర్గలాస్తోత్రం. ఆదిశక్తి అయిన తల్లిని గూర్చి సాధన చేయుటకు సాధకుడు శక్తివంతుడు కావాలి. అందుచేత ముందుగా అతడు కవచం ధరించుట ఆవశ్యకం. సాధనకూడా గొప్ప యుద్ధం వంటిది. ఈ మహాసంగ్రామంలో సాధకుడు ప్రతిక్షణమూ ఆసురీశక్తుల యొక్క లెక్కలేనన్ని దృశ్యాదృశ్యములైన దెబ్బలను సహించవలసివస్తుంది. ఒకొక్కప్పుడు ఈ దెబ్బలు సాధకుని ప్రాణాలమీదకు వచ్చేటంత భయవహంగా, దారుణంగా ఉంటాయి. సాధకుని లోపలా, వెలపలా రెండు అయామాలలోనూ ఈ రాక్షసుల యొక్క మాయావిసేన ఒకదానిని మించి మరొక ప్రమాదాలను సృష్టిస్తూ ఉంటుంది. అమ్మయ్యా! ప్రమాదం తప్పిపోయింది కదా! అని ఏ కొంచెం అజాగ్రత్తగా ఉన్న మరొక పరీక్ష ఎదురౌతుంది. ఈ అప్రమత్తత ఎంతవరకూ? ఎప్పటివరకూ? అందుచేత సాధకుడు కవచమును ధరించిఉండటం ఎంతో అనివార్యం. ఈ కవచం బాహ్యజగత్తులో సాధకుని దృశ్యాదృశ్య రూపంలో రక్షిస్తూ ఉంటుంది.

కానీ బాహ్యజగత్తులోని శత్రువులకన్నా అంతరంగంలోని శత్రుసమూహాలు ఇంకా భయంకరమైనవి. ఇవి కుండలినీ ఆరోహణమును జరగనీయవు. అందుచేత శ్రీదుర్గాసప్తశతిని దర్శించిన ఋషులు అర్గలాసాధనా విధానమును సృజించారు. అర్గలా అనే శబ్దమునకు అర్థం 'గొలుసు' ఈ రోజులలో తలుపులు మూయడానికి క్రొత్త పద్ధతులు వచ్చాయి. కానీ కొద్దికాలం క్రితం వరకూ తలుపులను మూసి దానిపైన గడియ (గొలుసుతో కూడినది)ను వేసేవారు. పల్లెప్రాంతాలలో ఈ సాంప్రదాయం బహుశా ఇప్పటికీ కొనసాగుతూ ఉండిఉండవచ్చు. రాత్రిపూట నిద్రించాలన్నా లేదా పగలు ఏదైనా పని చేసుకోవలన్నా తెలివిగలవారు తలుపులు మూయడం మంచిది అని ఆలోచిస్తారు. ఐతే ఇందుకు కేవలం తలుపులు మూసినంతమాత్రానే సరిపోదు. ఆ తలుపులను మూసి గడియ వెయ్యటమో లేదా తాళం వెయ్యటయో చేస్తే మంచిది.

అర్గలా విధిని సరియైన రీతిలో ప్రయోగించడం వలన సాధకుడు బాహ్యజగత్తులోని శత్రువులనుండీ రక్షింపబడతాడు. అలాగే కవచం అతనికి పరిస్థితులవల్ల ఏర్పడే ప్రమాదాలనుండీ, వ్యాధులు ఇంకా మరిన్ని ఇతరములైన ఆటంకములనుండీ కాపాడుతుంది. కవచసాధన సరియైన పద్ధతిలో చేయబడినట్లయితే, భౌతికమైన ప్రమాదముల సంఖ్య తగ్గుతుంది. ప్రారబ్ధవశాన ఏమైనా ఇబ్బందులు వచ్చినా కవచధారణ చేసిన సాధకుడు వీనివల్ల కలిగే బాధలను చిరునవ్వుతో సహించగల్గుతాడు. కవచం తరువాత అర్గలా సాధనకూడా చక్కగా చేసినట్లయితే సాధకుడు ఇక నిశ్చింతతతో సాధనాత్మక ప్రయోగాన్ని చేయగల్గుతాడు.

శ్రీదుర్గాసప్తశతి యొక్క అర్గలాసాధనలో ముఖ్యంగా 25 మంత్రాలు ఉన్నవి. ఇంకా వేరే పారాయణ విధానాలలో ఫలశృతిని చూపించే మరి రెండు ఇతర మంత్రాలు కూడా జోడింపబడినవి. ఈ మంత్రసాధనా వినియోగక్రమంలో దీనియొక్క ఋషి స్వయంగా 'విష్ణుభగవానుడే!' అని తెలియవస్తున్నది. ఈ మంత్రం అనుష్టుప్ ఛందస్సులో ఉన్నది. ఈ సాధన యొక్క అధిష్ఠానదేవత స్వయంగా మహాలక్ష్మియే! కొన్ని కొన్ని విధానాలలో ఈ సాధనయొక్క పూర్వక్రమంలో జగన్మాత యొక్క ధ్యానం ఇవ్వబడింది. ఈ ధ్యానంలో దేవి యొక్క మనోహరమైన స్వరూపాన్ని వర్ణిస్తూ ఈ క్రింది విధంగా చెప్పబడినది.

**ప్రకాశమధ్యస్థిత చిత్స్వరూపాం పరాయమే సదంధతీం త్రినేత్రామ్।**
**సిన్ధూరవర్ణామితి కోమలాంగీమ్ మాయామయీ తత్త్వమయీ నమామి॥**

అనగా చైతన్య స్వరూపిణియైన మాత ప్రకాశమండలం యొక్క మధ్యలో యున్నది. త్రినేత్రధారియైన తల్లి సాధకులకు అభయముద్రతో వరదానమిచ్చుచున్నది. సింధూరవర్ణంతో అత్యంత కోమలమైన అంగాలను కలిగియున్నదామె. ఆమెయే మాయామయి, ఆమెయే తత్త్వమయీ కూడా! ఆమెకు నమస్కరించి సాధకుడు తన సాధనను ప్రారంభించలెను' అని అర్థం.

సృష్టిలో ఈ సంపూర్ణ జగత్తులో ఆ తల్లి మినహా మరియెవ్వరూ లేరు. శక్తి సంపన్నుడైన సాధకునకు ఈ రహస్యం గనుక తెలిసినట్లయితే అతడు తాను స్వయంగా అన్ని రకాలైన భయాలు,

[redacted]ర్వవాటిని పెద్దలు ఆచరిస్తే దివి భువికి దిగివస్తుంది.

విఘ్నాలనుండి బయటపడగలడు. ఎందుకంటే సాధనా సమయంలో ఎదురయ్యే సమస్తమైన ఆటంకాలు తల్లియొక్క మాయారూపాలేగాక మరేమిటి? ఈ విధమైన మాయారూపాలలో కూడా తల్లిని దర్శించగల్గిన సాధకునకు లేదా అటువంటి తన బిడ్డలకు తల్లి స్వయంగా తత్త్వమయియే అవుతుంది. ప్రస్తుతం ఈ పంక్తులను చదువుతున్న సాధకులకు తమ బాల్యం ఇంకా జ్ఞాపకం ఉంటే, వారు తమకు జన్మనిచ్చిన తల్లితో ఆడుకున్న పలువిధాలైన ఆటలు కూడా జ్ఞప్తికి రాగలవు. తల్లి తన చిన్న బిడ్డలతో పలురకాల ఆటలు ఆడటానికి లెక్కలేనన్ని రూపాలు ధరిస్తుంది. ఒకప్పుడు ఆమె దొంగ అవుతుంది. మరొకసారి సిపాయి అవుతుంది. ఒక్కొక్కసారి పోటీదారుడుగా నిలబడి తగాదాపడుతుంది ఆ తల్లి. అప్పుడప్పుడు తన బిడ్డను ఓడించటానికి ఆమె తన శక్తినంతా వెచ్చిస్తున్నదా అనిపిస్తుంది.

ఐతే తల్లి ఆడే ఈ ఆట బిడ్డ ఆడుతూవున్నంత వరకూ సాగుతుంది. ఒకవేళ బిడ్డలు అలిగినా, ఏడ్చినా లేదా ఆటనంతటితో ఆపేసి అమ్మ ఒడిలోకి చేరాలని పట్టుపట్టినా, ఆటలలో ఆమె దాల్చిన రకరకాల వేషాలన్నీ ఒక్కక్షణంలో సమాప్తమౌతాయి. తన సంతానాన్ని ప్రాణాధికంగా ప్రేమించే, పిల్లలపట్ల వాత్సల్యాన్ని కురిపించే మమతామయి అమ్మ ఒకటే అప్పుడు మిగిలిఉంటుంది. బిడ్డ మారాం చేసి అమ్మా! అని ఏడ్చినప్పుడు మాయ ఎక్కడ? మాయారూపమేమిటి? తన బిడ్డను ప్రేమించకుండా ఉండలేని బిడ్డపైన సంపూర్ణమైన ప్రేమాభిమానాలను వర్షించే అమ్మ ఒక్కతే ఇక మిగిలి ఉంటుంది, అంతే!

అర్గలాస్తోత్రం యొక్క సాధనలోని రహస్యం కూడా దాదాపు ఇందులోని ప్రతిఒక్క మంత్రం యొక్క ప్రథమపాదంలో తల్లి యొక్క లీలామయ రూపాల స్మరణ ఉంటుంది. రెండవపాదంలో సాధకుడు తన తల్లిని కోరే కోర్కె (పిల్లవాడు మారాం చేసి ఇవ్వమని అడిగే కోర్కె) ఉంటుంది. ఉదాహరణకు

**రక్త బీజవధేదేవి చణ్డముణ్డ వినాశినీ ।**
**రూపం దేహి జయం దేహి యశోదేహి ద్విషోజహి ॥**

దేవీ! నీవు రక్తబీజుడిని వధించేదానవు, నీవే చండముండులను నాశనం చేయగలదానవు. కానీ నాకు మాత్రం నీ యొక్క సత్యరూపం, తత్త్వరూపం కావాలి. నా సాధనలో విజయం కావాలి. నన్ను యశస్విని గావించు. అప్పుడు సాధనకు ఇబ్బందిని కలిగించే కామం, క్రోధం మొదలైన సమస్త శత్రువులను నేను నాశనం చేయగలుగుతాను.

మంత్ర ప్రభావం కల్గిన ఈ అర్గలాస్తోత్రం యొక్క స్వరం చాలా రహస్యంగా ఉంటుంది. ఇందులో మాతయొక్క మాయామయి, తత్త్వమయి రూపాలు రెండింటినీ స్తుతించడమూ, రెండింటిని యాచించడమూ అనేది ఈ సాధనలోని రహస్యం. ఇందులో సాధకుని యొక్క పట్టుదల, నమ్మకం, తల్లిపట్ల తనకున్న సంపూర్ణమైన అధికారానికి నమూనా. ఈ క్రింది మంత్రం ద్వారా ఈ సత్యాన్ని దర్శించవచ్చు.

**విద్యావన్తం యశస్వన్తం లక్ష్మీవన్తం జనం కురు ।**
**రూపం దేహి జయందేహి యశోదేహి ద్విషోజహి ॥**

అమ్మా! నీ యొక్క ఈ భక్తుడిని, ఈ మాయా ప్రపంచంలో విద్యావంతుడిని చేయి, యశస్విని చేయి ధనవంతుడినిగా చేయి. తల్లీ! ఐతే దానితోపాటే నాకు రూపం, సాధనా సమరంలో జయం, సాధనకు అడ్డువచ్చే శత్రువుల నాశనం, యశస్సు కూడా ప్రసాదించవలసినది.

విశ్వజనని అయిన మాత సంపదనూ, మోక్షమునూ ఏకకాలంలో ప్రసాదించగల సమర్థురాలు. సాధనలో లెక్కలేనన్ని మార్గాలు, సంప్రదాయాలు ఉన్నవి. అన్నింటికీ వాటివాటి విశేష పద్ధతులు, ప్రాశస్త్యములు, వరములు (కానుకలు) ఉన్నాయి. ఐతే ఆ తల్లి యొక్క తనయకానీ, తనయుడుకానీ అయినటువంటి సాధకుల మార్గం ప్రత్యేకంగా ఉంటుంది. అది తల్లిని పిలవడం. 'అమ్మా! అమ్మా! అమ్మా!' అని పిలుపు ఆపకుండా పిలుస్తూనే ఉండటం. మా అమ్మ సర్వసమర్థురాలు అనే సంపూర్ణమైన విశ్వాసం కలిగిఉండటం వారి ప్రత్యేకత. ఆమె ఎంత సమర్థురాలంటే, ఆమె సామర్థ్యం నుండి ఒక చిన్న అంశమాత్రపు శక్తిని పొంది బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు సమర్థులైనారు. ఇక ఆమె అమాయకులైన తన బిడ్డలకోసం ఎంత దయామయిగా ఉంటుందంటే వారు అమ్మా అని పిలిచి ఏదైనా అడిగితే ఏనాడూ ఎటువంటి స్థితిలోనూ ఆమె నిరాకరించదు. ఆమెను భౌతికమైన సిరిసంపదలనడిగినా లేదా ఆధ్యాత్మిక ఉన్నతిని కోరినా లేదా రెండూ ప్రసాదించమని కోరుకున్న ఆమె దేనినీ కాదనదు. ఒక్కక్షణం కూడా ఆలస్యం చెయ్యకుండా ఆమె తన బిడ్డలు కోరినవన్నీ సమకూర్చుతుంది. ఈ సత్యమును తెలుసుకున్నవారు, వారికి శక్తిసాధన యొక్క తత్వభోధ జరిగినట్లే అని తెలుసుకొనవలయును. కాబట్టి ఇక అర్గలాస్తోత్రమును ముగించి కీలకమైన సాధనదిశగా వారు పయనించగలరు.

– *అఖండ జ్యోతి, జూన్ 2007*
– అనువాదం : *శ్రీమతి కృష్ణకుమారి*

**[redacted]్యం లేని వ్యక్తి చుక్కాని లేని నావ వంటివాడు.**



పూజ్య గురుదేవుల అమృతవాణి

# మనిషి దేవతగా మారాలి, పృథ్వీ స్వర్గం అవ్వాలి

## మనస్సు ఒక కల్ప వృక్షం

దేవతలారా! సోదరులారా !

నిన్న మీకు పంచకోశములలోని మనోమయకోశం గురించి చెప్తున్నాను. మనలోని మనోమయ కోశమే అన్నిటికన్నా పెద్ద దేవత, అన్నిటికన్నా పెద్ద రాక్షసి కూడా. మనస్సుని వశపరచుకుని పరిష్కరించుకుంటే అదే కల్పవృక్షం అవుతుంది. లేకపోతే ఇక వేరే చెప్పాల్సిన అవసరం లేదు. మనస్సును వశపరచుకోవడానికి సులువైన పద్ధతి ఏకాగ్రతను అభ్యసించడం. మిత్రులారా! మనకు మన జీవితాలలో ఏకాగ్రత అనే కళ ఉండాలి. ఒకే విషయంపై నిష్ఠ, ఒకే విషయంపై చింతన ఉండాలి. ఈ భావంతోనే ఆ విషయంపై ఏకాగ్రతతో మననం చేయాలి. మీ పద్ధతులను చూసి, మీ మానసిక స్థితిని చూసి మీ మనస్సు ఎటువైపుకి మళ్ళిందో తెలుసుకుంటాను, ఏ పని మీద మీరు దృష్టి సారించగలరు అనేది చెప్పగలుగుతాను. మీకు ఏ విషయం మీద అభిరుచి ఉన్నదో చూసి, ఏ విషయంపై మీ అభిరుచిని సారించవచ్చో చెప్తుంటాను. ఒక ఉదాహరణ చెప్తాను. ఎప్పుడు ఎవరు ధ్యానం చేయించినా అందమైన దృశ్యాలపై ధ్యానం చేయిస్తారు. అయితే శ్రీకృష్ణ భగవానుడు అందంగా ఉండేవారంటారా?

## ధ్యానం ఎలా చేయాలి?

మిత్రులారా! శ్రీ కృష్ణ భగవానుడు అందంగా ఉండకపోవచ్చు. నల్లగా, చిన్న మోహంతోటి, చిన్న చిన్న కళ్ళతోటి ఉండేవారేమో! ఇలా ఉండేవారు అని మనకెలా తెలుస్తుంది? మేము మాత్రం చాలా అందమైన విగ్రహాలు చూసామండి అని మీరు అనవచ్చు. అవును, మీరు అందమైన కృష్ణుడిని చూసారు, ఆ సౌందర్యంతోనే మనం మన మనస్సును ఏకాగ్రత చేస్తాము. ఏ వస్తువు చూపులకే కాక మనస్సుకు కూడా అందంగా కనిపిస్తుందో ఆ వస్తువుపైనే మనస్సును కేంద్రీకరించడం జరుగుతుంది. దేవీ దేవతల మూర్తులు గాని, వారి వస్తువులు గాని మరేవైనా సరే అందంగా రూపుదిద్దేది అందుకే. ఆ సౌందర్యంపైన మనస్సు తన్మయత్వం చెందుతుందనే ఉద్దేశ్యంతోనే అలా రూపాలనిస్తారు. ఎలా తన్మయత్వం కలుగుతుంది? ఎలా ఏకాగ్రత వచ్చేస్తుంది? అవిరిని అటూ ఇటూ పోనివ్వకపోతే అద్భుతాలు చూపిస్తుందో అలా మనకూ వస్తుంది. ఆవిరి నలువైపులా వ్యాపిస్తే దాని వల్ల ఎటువంటి ప్రయోజనము ఉండదు. అదే ఆవిరి గనక ఒకే చోట పట్టిఉంచినట్లయితే ప్రెషరు కుక్కరులోని అన్నాన్ని నిమిషాల్లో ఉడికించేస్తుంది. ఆ ఆవిరితోనే రైలింజను ముందుకు కదులుతుంది. ఇలాంటి అద్భుతాలు ఆవిరి ఎన్నో చేస్తుంది. కాని ఇదే నీటిఆవిరి చుట్టూ వ్యాపిస్తే మాత్రం దానికి ఏ శక్తీ ఉండదు. తుపాకీ మందును ఒక చోటికి చేరిస్తే అది తుపాకిలోని గుండు శక్తిని కలిగి ఉంటుంది. కానీ అదే తుపాకీ మందును నేల మీద చల్లితే అగ్గిపుల్లతో వెలిగించినా కూడా తుస్సుమంటుంది. వెలుగూ రాదు, చప్పుడూ రాదు. ఆ తుపాకీమందు తుపాకిలో పెట్టి కాలిస్తే పులినీ చంపగలదు, ఏనుగునూ చంపగలదు, కాని నేల మీద చల్లితే దేనికీ పనికి రాదు.

## ఈ యుగానికి నేనే వ్యాసుడిని

మిత్రులారా! కొందరు మాతో చెప్తుంటారు, మా జీవితాల్లో వైవిధ్యం చాలా ఉంది. చాలా రకాలుగా విస్తరించింది. జీవితమంతా ఒక దిశ లేకుండా, ఒక లక్ష్యం లేకుండా, ఒక ఆశయం లేకుండా, ఆనందించదగ్గ ఒక విషయం లేకుండా అలా సాగిపోతోంది. నాయనా! నా జీవితం మాత్రం ఒక సునిశ్చిత దిశలో సాగిపోయింది. గత యాభై ఏళ్ళుగా నా జీవిత లక్ష్యం, నా జీవితమంతా భారతీయ ధర్మం, భారతీయ ఆధ్యాత్మికతే. పుట్టాక పదిహేనేళ్ళు ఊరికే ఆడుతూ పాడుతూ గడిచిపోయాయి. ఇది స్వర్ణ జయంతి సంవత్సరం అని చెప్పచ్చు. ఇప్పుడు 66 ఏళ్ళు పూర్తికావస్తున్నాయి నాకు. ఈ యాభై ఏళ్ళలో లక్ష్యం వైపుకి చాలా దూరం పయనించాను. వ్యాసుడు ఎంత కాలంలో 18 పురాణాలు రచించాడో, నాకు అంతే కాలం పట్టింది. వ్యాసుని వయసు, నా వయసు ఒకటే. వ్యాసుల వారు పూర్తి చేసిన పనినీ, నేను పూర్తి చేసిన పనినీ తూకం వెయ్యండి. వ్యాసులవారి మాతృభాష సంస్కృతం, కాబట్టి ఆయన సంస్కృతంలో రాసారు, నా మాతృభాష హింది, కాబట్టి నేను హిందీలో రాసాను. మేమిద్దరం చేసిన పనిని త్రాసులో వేస్తే సమానంగా తూగుతాయి. మా ఇద్దరి కష్టం సమానమే. ఇందులో తేడా లేదు.

[redacted]శారీరక బలం కన్న భావనల బలం మిన్న.

## ఏకాగ్రత యొక్క చమత్కారం

అంటే మీరు వ్యాసులవారితో సమానమా? అవును నాయనా! నేను బల్ల గుద్ది చెప్పగలను నేను వ్యాసుల వారి కన్నా గొప్పవాడినని. వ్యాసులవారికి ఒక స్టెనోగ్రాఫర్ దొరికాడు, వినాయకుడు. వ్యాసులవారు చెప్పుకుంటూ పోయారు, వినాయకుడు రాసుకుంటూ పోయాడు. ఒకవైపు నుండి చెప్పడం మొదలుపెట్టగానే అటు రాయడం కూడా మొదలైపోయేది. ఒక గంటన్నర సేపు నేను చెప్పింది రాయడం మొదలుపెడితే ఎంత సేపు పడుతుందో చూడండి. ఒక మనిషికి కనీసం మూడు రోజులు పడుతుంది. అంటే 18 పురాణాలు ఇద్దరు మనుషుల కష్టమన్నమాట. నాయనా! మరి నా దగ్గర ఎవ్వరూ స్టెనోగ్రాఫర్లు, టైపిస్టులు లేరు. నా అంతట నేను చదివాను, నేనే చెప్పుకున్నాను, నేనే రాసాను. అంటే మీకు వ్యాసులవారి కన్నా ఎక్కువ శక్తి ఉన్నదంటున్నారా? అవును నాయనా! నాకు ఎక్కువ శక్తి ఉంది. ఎక్కువ కష్టపడ్డాను. ఎలా చేసారండీ ఇదంతా? ఎలాగూ కాదు. ఏకాగ్రత, ఒకే దిశ. రెండవ వైపుకి నా మనస్సు వెళ్ళలేదు, నా కోరిక పరిగెత్తలేదు, తప్పుదోవ పట్టలేదు. కష్టాలు, అడ్డంకులు వాటి స్థాయిలో అవి వస్తూనే ఉన్నాయి, కాని నేను మాత్రం నా గమ్యం వైపుకి కొనసాగిపోయాను.

## మనోమయకోశమే దైవం

మిత్రులారా! లోకులంతా తాము చెప్పవలసిన మాటలు చెప్పుకుంటూ పోయారు, కాని నేను వారందరికీ నమస్కారం పెట్టి వచ్చేశాను. గురూజీ, ఈరోజు ఉండండి. కాస్త టీ అయినా తాగి వెళ్ళండి అన్న వాళ్ళకి నేను నా గమ్యం చేరాక అక్కడే తాగుతాను అని చెప్పేవాణ్ణి. వెనక్కి లాగే వాళ్ళకి, ఎరవేసి పట్టుకునే వాళ్ళకి, నిలబెట్టేవాళ్ళకి, పడదోసేవాళ్ళకి, బెదిరించేవాళ్ళకీ అందరికీ ఒక నమస్కారం పెట్టి, నన్ను వెళ్ళనివ్వండి బాబు, చాలా దూరం వెళ్ళాలి, నా లక్ష్యం చేరుకోవాలి. నన్ను ఆపవద్దు, తప్పుదోవ పట్టివ్వద్దు అన్నాను. నాయనా! ఈ విధంగా నేను ఇక్కడి వరకు పయనించాను. ఇది ఏంటి? ఇదే మనోమయకోశసాధన, ఏకాగ్రతకి సాధన. ఈ మనోమయకోశం ఒక దేవత. ఎన్నో వరాలనిస్తుంది. ఈ దేవత ఇవ్వగలిగే వరాల ముందు మిగతా దేవతలిచ్చే వరాలేమూలకొస్తాయి? వినాయకుడు, శివుడు, హనుమంతుడు మనకేమివ్వగలరు? వారిని పూజించే పూజారులకే వాళ్ళేమీ ఇవ్వలేకపోతే ఇక మనకేమిస్తారు?

## మనలోనే రెండు శక్తులున్నాయి

మిత్రులారా! విజ్ఞానమయకోశం నాలుగవ కోశం. మనలోనే దేవతలు, అసురులు, ఈ రెండు శక్తులు పనిచేస్తూ ఉంటాయి. మనలోనే ఈ రెండింటి మంథనం జరుగుతూ ఉంటుంది. ఈ రెండు శక్తులు తమ వైపుకి మనలను ఆకర్షించుకోవాలని, లాక్కోవాలని చూస్తూంటాయి. ఎలక్షన్లప్పుడు రెండు పార్టీలు నిల్చుంటే, వాళ్ళు ఏ విధంగా ప్రవర్తిస్తారో, ఆ రెండు శక్తులు కూడా ఇంతే. ఎలక్షన్లప్పుడు రెండు పార్టీల ప్రచార సాధనాలు బలపడతాయి. రెండు పక్షాలు తమ వాగ్దానాలు, గొప్పతనాలు చెప్పడం మొదలుపెడతాయి. అదే విధంగా ఈ రెండు శక్తుల ఎలక్షన్లు మనలోనే జరుగుతూ ఉంటాయి. ఎప్పటికీ ఈ రెండు శక్తుల యుద్ధం జరుగుతూనే ఉంటుంది. ఈ రెండిట్లో ఒకరు అసురులైతే, రెండవది దేవతలు. దేవతలవైపు మనం ఓటు వేయడం మొదలుపెడితే, వారిని సమర్థించడం మొదలుపెడితే మనలోని సామర్థ్యాలు వికసిస్తాయి, స్వర్గీయ జీవితంలోని ఆనందాలు మనకు లభిస్తాయి. ఈ జీవితంలోనే దేవతల వలె ఈ శరీరంలోనే గొప్ప జీవితాన్ని గడపవచ్చు.

## విజ్ఞానమయకోశానికి ఐదు విశేషతలు

మిత్రులారా! విజ్ఞానమయకోశం దైవత్వ కోశం. దీని ఫలం స్వర్గం. పరిణామం – వ్యక్తిగత జీవితంలో దైవత్వ వికాసం. ఐతే గురువుగారు, ఈ నాల్గవ కోశం యొక్క సాధన మా చేత చేయిస్తారా అని అడుగుతారు. అవును, బ్రహ్మవర్చస్సులో చేయిస్తారు. దైవత్వానికి రెండు ధారలున్నాయి. అసలు దేవతలు ఎలా ఉంటారు? దేవతల దృష్టికోణం చాలా గొప్పగా ఉంటుంది. మనుషులది మాత్రం దరిద్రంగా, అమాయకంగా, సంకుచితంగా, పిసినారిగా, పనికిరానిదిగా ఉంటుంది. దేవతలకు దివ్యదృష్టి ఉంటుంది. దివ్యదృష్టి అంటే ఏంటి? సుదూర దృష్టి, శ్రేష్ఠ దృష్టి, వివేక దృష్టి – ఇది దివ్యదృష్టి, ఉన్నతమైన ఆలోచనా సరళి ఉన్నవారిని దేవతలు అంటారు. వారికి నీచమైన ఆలోచనలు రావు. ఇవే దేవతల ఐదు విశేషతలు. మనలోని ఐదు కోశాలలో విజ్ఞానమయ కోశం ఒక దేవత.

మిత్రులారా! ఏ విధంగా అయితే గాయత్రీ మాతకు పంచముఖాలున్నాయో, అదే విధంగా విజ్ఞానమయకోశానికీ పంచ ముఖాలున్నాయి. హనుమంతునికి కూడా పంచముఖాలుంటాయి. బ్రహ్మవర్చస్సు దగ్గరున్న ఆంజనేయుడు పంచముఖాలతో దర్శనమిస్తాడు. ఇంకెవరెవరికి ఉన్నాయి గురువుగారు?

**సంతృప్తిని మించిన సంపద లేదు.**

శివశంకరునికి కూడా ఐదు ముఖాలు ఉన్నాయి. అందరు దేవతలకీ ఉంటాయి. ఐదు ముఖాలంటే ఐదు విశేషతలని అర్థం. మన దృష్టికోణంలో ఈ ఐదు విశేష గుణాలు వచ్చేస్తే కనుక మనమే. దేవతలమవుతాము. దేవలోకంలో ఏముంటుంది? కల్పవృక్షం ఉంటుంది. కల్పవృక్షమంటే ఏంటి? దాని కింద కూర్చుని ఏది కావాలనుకున్నా, ఏది కోరుకున్నా జరిగిపోతుంది. దేవతలు ఏది కోరుకుంటే అది జరిగిపోతుంది. కోరుకోవడంలో ఏ ఇబ్బంది ఉండదు.

## ఆశ అనేది ఇవ్వాల్టివరకు ఎవరికీ తీరలేదు

నాయన! మీరంటున్న ప్రాపంచిక కోరికలు అనేవి మండుతున్న అగ్ని వంటివి. నేటి వరకు ఎవ్వరికి తృప్తి లేదు. ఎప్పటికీ తృప్తి పడరు కూడా. ఒక కోరిక తీరకముందే ఇంకొకటి పుట్టుకొస్తుంది. బి.ఎ. పాసయ్యే లోపల, డిగ్రీ చేతికొచ్చే లోపల ఎమ్మే మీదకొచ్చి పడుతుంది. పెళ్ళి ఆనందించే లోపల పిల్లలు కావాలంటారు. కూతురు పుడితే కోడుకు కోసం ఎదురు చూస్తారు. ఒక వెయ్యి రూపాయలు సంపాదిస్తే, రెండు వేలు సంపాదించాలనే కోరిక పుట్టుకొస్తుంది. ప్రపంచంలోని ఐశ్వర్యం అంతా కాళ్ళ మీదకొచ్చి పడేంత వరకు కోరిక తీరదు. అలా సంపాదించిన వాళ్ళు ఎవరైనా అలెగ్జాండరైనా, హిరణ్యకశ్యపుడైనా, రావణుడైనా, ఎవరైనా ఏ మాత్రం నిశ్చింతగా ఉన్నారు? ఎవరికీ నిశ్చింత లేదు, శాంతి లేదు. మరలాంటప్పుడు కల్పవృక్షంతో కోరికలు ఎలా తీరుతాయి? కోరికలోని దృష్టికోణం మారాలి. భౌతిక కోరికలనే దృష్టికోణం మనల్ని మింగేస్తుంది. **'భోగా న భుక్తా వయమేవ భుక్తాః'** అనే సూక్తి ఉన్నది. అంటే మనం భోగాలను భోగించలేకపోయినా, భోగం మనలను భోగించింది అని. మనం కోరికల్ని తీర్చుకోలేకపోయినా, కోరికలు మనల్ని మింగేస్తాయి.

## కోరికల స్థాయి మార్చుకోవాలి

మిత్రులారా! మన కోరికల స్థాయిని పెంచుకోగలిగితే, మానవీయ గొప్పతనానికి సంబంధించిన కోరికలు మన కోరికలవుతాయి. మేము నిజాయితీ పరులమవుతాము, మేము లోకసేవకులమవుతాము, మేము శీలవంతులమవుతాము, మేము సైనికులమవుతాము, ఇందులో అడ్డేముంది? కాస్త చెప్పండి నాకు. కాదండి, నేనొక ఇల్లు కట్టుకుంటాను అంటారు. సరే నాయనా! బీమా కంపెనీకి వెళ్ళి నా ఖాతా ఉంది, నాకొక పాతికవేలు అప్పు కావాలని అడగండి. వాళ్ళిస్తారో లేదో నాకు తెలియదు. గవర్నమెంటు దగ్గరకెళ్ళి అప్పడగండి. మీ స్నేహితులనడగండి, బావనడగండి, బావమరిదిని అడగండి. కాస్త డబ్బిస్తే నా ఇల్లు కట్టేసుకుంటానని చెప్పండి. అసలు ఆ ఇల్లు పూర్తవుతుందో లేదో నేను చెప్పలేను. ఈ జన్మలో పూర్తవుతుందో, చచ్చాక పూర్తవుతుందో చెప్పలేను. కాని నేను నిజాయితీ పరుడనవుతాను, శీలవంతుడినివుతాను అనే కోరిక మాత్రం క్షణాల్లో తీరిపోతుంది. నేను ఒక మహాత్మునిగా జీవిస్తాను అని వాల్మీకి లాగా ఒక్క క్షణంలో మీరు సంకల్పించుకోండి. మీరు తక్షణం వాల్మీకి మహర్షంతటి వారవుతారు, ఖచ్చితంగా తక్షణం అవుతారు. ఇందులో ఇబ్బందేమీ లేదు. శ్రేష్ఠులవడానికి అడ్డంకి ఉండదు. శ్రేష్ఠత్వానికి సంబంధించిన మీ కోరికలన్నీ ఈ రోజే పూర్తవుతాయి, ఇప్పుడే పూర్తవుతాయి.

## ప్రతి మనిషీ ఐశ్వర్యవంతుడే

మిత్రులారా! దైవత్వానికి చిహ్నం కోరికలు పూర్తవడం. దేవతలందరూ కల్పవృక్షం కింద కూర్చుంటారు, వారి జీవితం అందంగా, నవ్వుతూ, నవ్విస్తూ సాగిపోతుంది. ఏదైనా తీసుకోవడం కన్నా ఎప్పుడూ దేవతలు ఇవ్వడానికే చూస్తూ ఉంటారు. ఆ ఇవ్వడంలో ఉన్న ఆనందాన్ని, తృప్తిని నిరంతరం అనుభవిస్తూంటారు. అది కాదండి, మా దగ్గర డబ్బు లేకపోతే, అప్పుడు మేమెలా ఇవ్వాలండి? అని అడుగుతారు. అసలు నేను డబ్బు గురించి మాట్లాడటం లేదు. డబ్బు సమృద్ధిగా ఉన్నవాళ్ళు కూడా కష్టాల్లో కూరుకుని ఉన్నారు. ఎవరికైనా ఆ డబ్బిస్తే వాళ్ళకు కూడా కష్టాలు తప్పవు. అన్నిటికన్నా నికృష్టమైన సంపద ఈ డబ్బు. మన దగ్గర చాలా సంపదలున్నాయి. తెలివనే సంపద, శ్రమనే సంపద, భావనలనే సంపద ఈ సంపదలన్నీ ప్రతి మనిషి దగ్గరా దండిగా పడున్నాయి. ప్రతి మనిషి కుబేరుడంతటి ఐశ్వర్యవంతుడే.

## దేవతలుగా మారండి

మిత్రులారా! మీరు కోరుకుంటే ఇతరులకు ప్రేమను పంచవచ్చు, దిశను చూపించవచ్చు, ఇతరులకు మాధుర్యాన్ని పంచవచ్చు. ఇతరులకు సేవ చేయవచ్చు, సహాయం చేయవచ్చు. ఇంకెన్నెన్నో చేయవచ్చు. ఎందుకోసం? ఇవ్వడం కోసం. మీరు మీ ఆవిడకి ప్రేమను పంచచ్చు, మీ పిల్లవానికి సంస్కారాలనివ్వవచ్చు. మీ పక్కింటివారికి సహాయాన్నందించవచ్చు. ఇవ్వడానికి చాలా పద్ధతులున్నాయి. ఇవ్వాలనే గనక మనిషి తత్పరుడైతే లెక్కలేనన్ని వస్తువులు ఇవ్వడానికి అతని దగ్గరున్నాయి. ఇచ్చేవారినే దేవతలంటారు.

(మిగిలినది రాబోయే సంచికలో)

*– అఖండజ్యోతి, ఫిబ్రవరి 2009*

*అనువాదం : శ్రీమతి జయలక్ష్మి*

[redacted] లేని మాటల కన్నా మాటలు లేని హృదయం మిన్న.

**నావారితో నామాట : 2011 - 2012 జన్మ శతాబ్ది సంవత్సరం**

# ఇంకా 70 రోజులు మాత్రమే ఉన్నాయి

## చారిత్రాత్మకమైన ఈ కాలాన్ని చేజార్చుకుంటే పశ్చాత్తాపపడవలసివస్తుంది

పత్రికలో ప్రస్తుతం వస్తున్న ఈ వ్యాసాలు 2007 జనవరి నెలలో వసంతపర్వంలో శతాబ్దీ ఉత్సవాలకు కౌంట్‌డౌన్ రూపంలో ఆరంభించబడ్డాయి. గడచిన 4 సంవత్సరముల నుండి శతాబ్దీ పురుషుని 'యుగనిర్మాణయోజన, విచార క్రాంతి అభియాన్ (ఆలోచనలలో క్రాంతి)' లో మన పాత్ర ఏమిటి? దీనిమీద లోతైన ఆలోచన, చర్చ జరుగుతూ వున్నది. ఈ వ్యాసం ద్వారా మన ఆరాధ్యులైన పరమపూజ్య గురుదేవులు మన నుండి ఏమి కోరుకున్నారు? రాబోయే ఒక సంవత్సరంలోను, దాని తర్వాత అనుయాజలో భాగంగా మిగిలిన 4 సంవత్సరములలోనూ ఏవిధంగా మనం ఆ పనులను పూర్తిచేస్తాం? అనే విషయాల గురించి దిశానిర్దేశం లభిస్తుంది. ఈ సంవత్సరం చివరి సంచికలో 'నావారితో నా మాట' లో మేము కొన్ని మహత్త్వపూర్ణ తథ్యములను పాఠకుల ముందుంచాలనుకుంటున్నాము. వాటి ద్వారా పాఠకులకు తమ భావికాలపు దినచర్య మరియు ఆధ్యాత్మిక ప్రయాణంలో మార్గదర్శనం లభిస్తుంది.

**దయచేసి క్రింది ముఖ్య విషయాలను జాగ్రత్తగా చదవండి.**

1. మీరు–మేము కొన్ని ప్రత్యేకమైన పనులను చేయుటకు ఎన్నుకోబడ్డాము కనుక మనమందరం విశిష్టమైనవారము. ఈ పనులలో పాలుపంచుకున్న అదృష్టము ఎన్నుకోబడిన ఆ కొద్దిమందికే లభిస్తుంది. యుగపురుషుని జన్మ శతాబ్దిలో భాగస్వాములు కావడం అనేది మనందరకు ఒక గౌరవనీయమైన విషయం. లెక్కించలేనంతమంది గురువులు వచ్చారు, వెళ్ళారు. కానీ వారి శిష్యులకు తమ గురువు యొక్క జన్మ శతాబ్దివరకు జీవించివుండగలిగే అవకాశం లభించలేదు. మీకు లభించినది. కనుక ఈ అవకాశమును కోల్పోవద్దు. ఏమిటి, ఎప్పుడు, ఎక్కడ, ఏవిధంగా ఈ జ్ఞానం మరియు శక్తి నిర్వహణాప్రక్రియతో జోడింపబడతాము? దీన్ని అర్థం చేసుకునే ప్రయత్నం చెయ్యండి. **ఇటువంటి సమయం మళ్ళీమళ్ళీ రాదు.**

2. జన్మశతాబ్ది మహాపర్వం కేవలం ఒక ఉత్సవంగా మాత్రమే జరుగదు అన్న విషయాన్ని గుర్తుంచుకోవాలి. ఇది ఇచ్చిపుచ్చుకునే సమయం. ఒకవేళ మీరు తీసికోవటానికి సిద్ధంగా ఉంటే, గురుసత్తా కూడా ఇవ్వటానికి సిద్ధంగా ఉంది. ముందుగా మీరు 'నేను ఏమివ్వగలను' అనే విషయాన్ని నిర్ణయించుకోవాలి. ఈ ప్రత్యేక సంవత్సరంలో విశేషమైన వరదానాలు వర్షిస్తాయి. సమయదానం, జీవనదానం, సాధనాదానములు అన్నీ ముఖ్యమైనవే. మిమ్మల్ని మీరు సరిదిద్దుకుంటూ, మీ వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దుకునేందుకు ఇది అద్భుతమైన కాలం. కనుక అవకాశాన్ని చేజార్చుకోకండి. ఉడుత నుండి మొదలుకొని హనుమంతుని స్థాయి వరకు మీకు సాధ్యమయ్యేదాన్ని చేసితీరాలి. శబరి యొక్క రేగిపళ్లు మొదలుకొని భామాషా యొక్క అంశదానం స్థాయి వరకు మీరేమి చేయగలరో అది చెయ్యటానికి ఇది సరైన సమయం. మనమందరం ఈ అవకాశాన్ని జారవిడుచుకోకూడదు.

3. ఇది ఒక మైలురాయి తప్ప అంతిమయాత్ర కాదు అన్న విషయాన్ని గుర్తుంచుకోవాలి. జన్మశతాబ్ది ఉత్సవం మన యుగనిర్మాణయోజన యొక్క ప్రయాణం మధ్యలో వచ్చిన ఒక మజిలీ. మనం ఇప్పటివరకు ఏమి చేశాం? ఇంకా ఏమి చేయాలి? అన్న విషయాలను ఈ సమయంలో సింహావలోకనం చేసుకోవాలి. యుగనిర్మాణం జరిగేవరకు, ఈ ప్రణాళిక పూర్తయ్యేవరకు మనం ఆగకుండా, నిరంతరం పయనిస్తూనే ఉండాలి. ఆ సత్తా మీద పూర్తి విశ్వాసముంచి మన మిగిలిన జీవితమును ఆయనకు అర్పిస్తూ ఆయన ప్రణాళికలను ఎలా అమలుపరచాలి అన్న విషయాలను గురించి ఆలోచించాలి. ఇది రాబోయే 2011 నుండి 2015 వరకు, తిరిగి 2015 నుండి 2026 వరకు కొనసాగే అవిశ్రాంత యాత్ర. మనం అప్పటివరకు జీవించి ఉంటామో ఉండమో తెలియదు కదా! అన్న సంశయాత్మక ఆలోచనలకు ఎవ్వరూ తావివ్వరాదు. శ్వాస ఉన్నంతవరకు మన ఆరాధ్యుని కొరకు జీవించాలి అన్న భావనను మళ్ళీమళ్ళీ గుర్తుచేసుకుంటూ ఉండాలి. మధ్యలో ఇతర మహత్వాకాంక్షలకు స్థానమీయరాదు.

4. మరో విషయంలో కూడా మనం చాలా అదృష్టవంతులం. ఎందుకంటే మన గురుసత్తా మనలను తన అంగ

[redacted]ంలో గవ్వలు వదులుకుని వజ్రాలు పొందుతాం.

అవయవములుగా చేసుకున్నారు. ప్రపంచంలో గురు–శిష్య పరంపర అతి పురాతన కాలం నుండి, ఉపనిషత్తుల కాలం నుండి నేటివరకు వస్తూనేవున్నది. కానీ ఏ గురువూ తన శిష్యులతో 'మీరు నా అంగ అవయవములు' అని చెప్పలేదు. మన గురుదేవులే మనలను ఇలా సంబోధించారు. అంతేకాక ఈ భావన మనలో అహర్నిశలు ఉండుటకుగానూ ఈ మాటలను 24 గంటలూ స్మరణలో ఉంచుకోవాలి అనికూడా చెప్పారు. గురుదేవులిలా అన్నారు. "మీ అందరి సమన్వితశక్తి యొక్క పేరే, ఈ పంక్తులను వ్రాస్తున్న వ్యక్తి పేరు." ఎంత దివ్యమైన సంబోధన. ఏ యుగపురుషుని జన్మ శతాబ్దిని మనం జరుపుకోబోతున్నామో ఆయన తన అణువణువులోనూ, కణకణంలోనూ, ప్రతి చిన్న భాగంలోనూ ఉన్నామని మనకు ఈ సంబోధన తెలియజేస్తున్నది. మనం వారిని అనుభవపూర్వకముగా గమనిస్తే ఇది సత్యమని అర్థమవుతుంది. అత్యంత శ్రేష్ఠమైన ఉన్నతస్థాయిలో ఆలోచించే మనీషీ, తపస్వి, సాధకుడు, బ్రాహ్మణుడు అనే పదానికి రూపుదాల్చిన వ్యక్తి, మమతామూర్తి, ఇంత పెద్ద మహాకూటమి యొక్క సృష్టికర్తయైన మహానుభావుడు మన కణకణంలోనూ వ్యాపించియున్నప్పుడు మనం అల్పమైన ఆలోచనలను ఎందుకు చేస్తున్నాం? మనం ప్రత్యేకమైనవారము, మన కార్యనిర్వహణాశక్తి మన గురుసత్తా ద్వారా పర్యవేక్షించబడుతున్నదనే విషయం మనకు మరల మరల ఎందుకు స్మరణకు రావటంలేదు. ఇలాంటి పరిస్థితిలో నిరాశకు లోనుకారాదు. ప్రతికూలపరిస్థితులకు, ఆలోచనలకు ఎప్పుడూ చలించిపోకూడదు. చిన్న స్థాయిలోనే ఎంతమేరకూ సరిగ్గా చేయగలమో అంతవరకే చేద్దాం. అయితే, మన గురుసత్తా యొక్క కీర్తికి శోభనిచ్చే స్థాయిలోనే చేయాలి.

5. 2011 నుండి 2013 వరకు విధిని నిర్ధారించబోయే సమయం, కలియుగంలో –సత్యయుగం యొక్క స్వరూపం నిర్ధారించబడబోతున్నదనే మరియొక ముఖ్య విషయాన్ని కూడా మనం గుర్తుంచుకోవాలి. ఇందులో ప్రతి ఒక్క క్షణం ఎంతో విలువైనది. శతాబ్దీ సంవత్సరం, అఖండజ్యోతి యొక్క వజ్రోత్సవ జయంతి సంవత్సరం, సూర్యసాధనా సంవత్సరం, 2011 నుండి 2013 వరకు వరుసగా ఎంతో వేగంగా ప్రపంచం మొత్తం విశ్వవసుధగా మారనున్నది. లెక్కలేనన్ని ప్రదేశాలనుండి యుగనిర్మాణం పెల్లుబకనున్నది. గురుసత్తా అందించిన ఈ ఆలోచనాధారను ఎన్నో సంస్థలు జీవంతం చేయగలవు. జీవనవిధానం ఎంతో వేగంగా మారిపోనున్నది. ప్రజలు పాశ్చాత్య భౌతికవాదరూపం నుండి ఆధ్యాత్మికవాద జీవనవిధానం వైపు తరలిరావటం చూడగలము. ప్రాక్–పశ్చిమ దేశములన్నీ కూడా భారతదేశానికే శరణాగతి కాగలవు. సరిగ్గా చెప్పాలంటే భారతదేశం జగద్గురువు కాబోతున్నది అనే విషయం దృష్టిగోచరమౌతున్నది. గొప్ప చారిత్రాత్మకమైన ఘడియ ఇది. సత్యయుగం ఎర్రఎర్రని దివ్యమైన బంగారు కాంతులతో నిండిన అరుణ ప్రకాశము ప్రతిఒక్క వ్యక్తికి కనపడే అత్యంత మహత్వపూర్ణమైన సమయమిది.

స్వామీ వివేకానందులు తమ లేఖావళిలోనూ, శ్రీఅరవిందులు తన పుస్తకాలలో, సాయంకాలపు ప్రసంగాలలో కూడా, సత్యయుగం యొక్క శుభారంభం శ్రీరామకృష్ణపరమహంస ఈ భూమిపై జన్మించిన సమయంలో అనగా క్రీ.శ. 1836 లోనే జరిగిపోయింది అని చెప్పారు. 175 సంవత్సరాల సంధికాలం జరిగిన తదుపరి తిరిగి 2011 తర్వాత మార్పులు వేగంగా జరగటం చూస్తాం. ఆ ఘడియలే ఇప్పుడు వచ్చాయి. బద్ధకం, సోమరితనం, భోగవిలాసములలో జీవితాన్ని వ్యర్థం చేసుకోకూడదు. జీవితాన్ని సరిగ్గా జీవించటానికి, కీర్తి–ప్రతిష్ఠలను కైవశం చేసుకొనటానికి సరియైన సమయమిదే.

6. పరమపూజ్య గురుదేవులు ఏ సంప్రదాయమును నెలకొల్పలేదు. ఒక బహిరంగ వేదికను ఏర్పాటు చేసి అందరినీ ఆహ్వానించారు. ప్రజలు వస్తున్నారు. ఆదరణ పెరుగుతూవున్నది. **"ప్రతి మనిషిలో దైవత్వం వెల్లివిరియాలి, భూమిపై స్వర్గావతరణ జరగాలి. ఇదే యుగనిర్మాణయోజన ముఖ్య లక్ష్యము"** అని వారు ప్రవచించారు. 'చెడు అలవాట్లను వదిలి మంచి మానవులుగా మారండి. మీలోని అనంతమైన శక్తులను గుర్తించండి' అని కూడా చెప్పారు. మీరు యువకులైతే మీ శక్తిని హిమాలయాల వరకూ చేర్చండి, గృహస్థులైతే సద్గృహస్థులుగా మారండి. మీ కుటుంబాన్ని సంస్కారాల టంకశాలగా మార్చండి, పౌరులైతే మర్యాదస్తులుగా పేరుగాంచండి, దేశాన్ని అభివృద్ధి చెందిన ఒక సంపన్నమైన దేశంగా తయారుచెయ్యండి. నిన్ను నువ్వు సంస్కరించుకుంటే చెడు అలవాట్లు వాటంతట అవే పోతాయి' అని గురుదేవులు ప్రబోధించారు. అనేకమంది ఉపన్యాసాలనిస్తారు, కానీ జీవితంలో వాటిని అమలుపరచరు. శ్రీరామశర్మ ఆచార్య గురుదేవులు తమ ఆచరణతో శిక్షణనిచ్చి,

**నేటి పనిని నేడే చెయ్యి.**

లక్షలు కాదు, కోట్లమంది జీవితాలలో సద్గుణాలనే విత్తనాలను నాటారు. మనం కూడా ఆ ప్రవాహంతో కలవాలి, ఎంతోమందిని కలపాలి. ఆ ప్రవాహం ఎప్పుడు కూడా నిరంతరముగా ప్రవహిస్తూనే ఉంది.

7. శతాబ్దీ పురుషుడు జన్మించి 2011 నాటికి, 100 సంవత్సరాలు నిండుతున్నాయి. 1911 నుండి ఇప్పటివరకు జరిగినదేదైనా కూడా ప్రత్యేకంగానే ఉంది. ఐతే ఇప్పుడు జరుగబోతున్నది ఇంకా ప్రత్యేకంగా ఉంటుంది. వేదాలు రచించబడినప్పుడు పృథ్వీపై మొదటి క్రాంతి(మార్పు లేక విప్లవం) వచ్చింది, ఉపనిషత్తుల కాలంలో రెండవ క్రాంతి వచ్చింది. వేదాలు నిర్వచించిన కర్మకాండలతో కూడిన విధివిధానాలనుండి విడివడిన ఈ క్రాంతి యావత్ప్రపంచమును ఒక ఊపువూపింది. మూడవ క్రాంతి మహాభారత సమయంలో భగవద్గీత ఆవిర్భవించినప్పుడు కర్మయోగం యొక్క అసలుసిసలైన సందేశం ప్రతివొక్క వ్యక్తికీ చేరినప్పుడు ఉద్భవించినది. కరుణ–భావసంవేదనాపూరితమైన నిష్కపట జీవితాన్ని ప్రతిపాదించిన బుద్ధుని ఆగమనంతోపాటు నాల్గవ క్రాంతి ప్రజలలోకి వచ్చింది. సంత్‌జ్ఞానేశ్వర్, కబీరు మొదలుకొని స్వామీ వివేకానంద, శ్రీఅరవిందులు, కారల్‌మార్క్స్ మరియు పరమపూజ్యగురుదేవులు 20 వ శతాబ్దంలో ఐదవ క్రాంతి యొక్క పూర్వార్ధమును తీసికొచ్చారు. గత రెండు శతాబ్దములలో ధర్మతంత్రపరంగా లోకశిక్షణ నివ్వడమనేది అన్నిటికన్నా పెద్ద సంఘటన. ధర్మం యొక్క సరియైన రీతి–నీతి ఏమిటి? మానవుని జీవితం ఏవిధంగా మార్పు చెందింది అనేది వారు చెప్పారు. ఇప్పుడు జన్మశతాబ్దీ క్రాంతి యొక్క ఉత్తరార్ధం 2011 నుండి ప్రారంభం కానున్నది. 2011 నుండి 2026 వరకూ అనగా రాబోయే 15 సంవత్సరాలలో ఇక యావత్ప్రపంచంలో జీవితాన్ని ఎలా జీవించాలి అనే కళను క్రియాన్వితం చేసే ప్రక్రియ వ్యాప్తిచెందనున్నది. ఈ ప్రక్రియ మాత్రమే సత్యయుగాన్ని తీసుకురాగలదు. 2026 అఖండదీపం యొక్క శతాబ్దీ సంవత్సరం అనే విషయం అందరికీ గుర్తుండే వుంటుంది, గుర్తుండి తీరాలికూడా. అంటే జన్మశతాబ్దీ సంవత్సరం దగ్గర మనం ఆగిపోకూడదు. యుగనిర్మాణయోజన సమాప్తమయ్యేవరకు అంటే 2026 లో అఖండదీపం యొక్క శతాబ్దీ సంవత్సరం వరకు అందరూ ఈ యాత్రలో నిరంతరం ఒక వినమ్ర సాధకుని రూపంలో పాల్గొనవల్సివుంది. లౌకికమైన గౌరవం లభించినా, లభించకపోయినా ఎన్నో రెట్ల ఆధ్యాత్మిక యోగ రహస్యాలు లభించనున్నవి. వాటిని గురించి మీరు ఊహించలేరుకూడా.

రండి! జన్మశతాబ్దికి సన్నద్ధం కండి! ఎందుకంటే ఈ యాత్ర సుదీర్ఘమైనది. బహుశా మనందరి జీవితాంతమూ కొనసాగవచ్చు. క్రాంతి అనేది ప్రక్రియ. ఇందులో పాల్గొనటానికి అందరికీ సౌభాగ్యపూరితమైన ఆహ్వానమిదే. సత్యయుగం మీ అందరి కొరకు ఎదురుచూస్తున్నది.

*– అఖండజ్యోతి, డిశంబరు 2010*

*అనువాదం : శ్రీమతి కృష్ణకుమారి గుంటూరు)*

## శ్రీ గాయత్రీ శతకం

39. *బలము, శీలము, సుగుణముల్, ప్రాభవమ్ము*
*ధనము, సద్బుద్ధి, సత్కీర్తి, తాత్వికతల*
*వృద్ధిజేయును మంత్రమున్ విశ్వసింప*
*విశ్వజనయిత్రి గాయత్రి వేదమాత*

*తా:– ఏ సాధకుడు గాయత్రీ మంత్రాన్ని సంపూర్ణంగా విశ్వసించి జపిస్తాడో అతనికి నైతిక బలము, సౌశీల్యము, సుగుణ సంపదల ప్రభవము, ధనము, సద్బుద్ధి, సత్కీర్తి, తాత్త్విక చింతన మొదలైన వానిని సమృద్ధిగా అందిస్తుంది వేదమాత.*

*40. శత వదనములతో వాణి నుతులు సలుప*
*శాంతి మంత్రమున్ వర్ణింప సాధ్యమగునే?*
*అట్టి మంత్రమున్ జపియింప హాయి గూర్చు*
*విశ్వ జనయిత్రి గాయత్రి వేదమాత*

*తా:– వంద ముఖములతో సరస్వతీ తల్లి నిత్యం ప్రశంసలు పలుకుచుండగా శాంతి మంత్రమైన గాయత్రీ మంత్రమును వర్ణించడానికి ఎవరికి సాధ్యమవుతుంది? అటువంటి మహామంత్రమును ప్రతినిత్యం సాధకుడు జపిస్తూ ఉంటే జీవితంలో హాయిని, ఆనందాన్ని కలిగిస్తుంది విశ్వమాత.*

*రచన : సహజ కవి, సాహిత్య రత్న,*
*శతక చతురానన, పద్య కవితాసుధానిధి*
*శ్రీ అయినాల మల్లేశ్వర రావు*

**[redacted]శయాల కోసం, దుర్బలులు ఆశల కోసం జీవిస్తారు.**

### దేవసంస్కృతి విశ్వవిద్యాలయం : వ్యక్తిత్వ పరిష్కారము

# నేటి యువతరానికి కావాలి దిశానిర్దేశం

నేడు అందరి ముందు ఉన్న అతి క్లిష్టమైన, తక్షణము సమాధానము వెతకవలసిన సమస్య– "మనిషి రకరకాలుగా ప్రకృతిని దోచుకుంటుంటే ఈ భూమి ఇంకెంత కాలము ఉంటుంది? దీనిని ఎలా అరికట్టవచ్చు?" అనేక రకాలుగా, అన్ని కోణాల నుండి ఈ ప్రపంచాన్ని నాశనము చేస్తున్న శక్తుల బారి నుండి కాపాడటానికి శక్తి, సామర్థ్యం, ఆధునికభావాలతోపాటు నిరంతరం ప్రయత్నం కూడా కావాలి. ఇవన్నీ నేటి యువతరంలో పుష్కలంగా ఉన్నాయి. ఈనాటి యువతే రేపటి ప్రపంచాన్ని నిర్మించగలిగేది. ప్రపంచ భవిష్యత్తు వారి చేతులలోనే ఉన్నది. అందుకని ప్రపంచమంతా ఈ యువతను అన్ని రంగాలలోను ప్రతిభావంతులుగా తయారు చేసి, ఇప్పటి నుండే వారు ఈ వినాశక శక్తులను ఎదుర్కోగల సమర్థులుగా తయారు చేయాలనే భావంతో ప్రపంచ దేశాల సమాఖ్య (యూనైటెడ్ నేషన్స్) 2010 సంవత్సరమును ప్రపంచ యువత సంవత్సరంగా పేర్కొంది. ఈ సంవత్సరంలో యువతను సమాజంలో జరిగే ప్రతి ప్రక్రియలోను పాల్గొనేటట్లుగా చేయాలని ప్రయత్నిస్తున్నట్లు యూనైటెడ్ నేషన్స్ అధికారులు తెలిపారు. ఇందుకు అన్ని దేశాల ప్రభుత్వాలు, సంఘాలు, సామాజిక సంస్థలు ఆయా దేశాలలోని యువతను ఉత్సాహపరచి, వారి మేధస్సును సమాజానికి ఉపయోగపడేలా తీర్చిదిద్ది, వారు సమాజహిత చర్చలలో పాలుపంచుకునేలా చేయాలని వారు పిలుపునిచ్చారు. 'చర్చలు మరియు పరస్పర అన్యోన్యత' అనే లక్ష్యముతోనే శాంతి, మానవహక్కులు మరియు స్వాతంత్ర్యం పొందవచ్చునని యువతకి తెలియచెప్పాలని యూనైటెడ్ నేషన్స్ ఉద్దేశ్యము. దీని కోసం ప్రపంచ వ్యాప్తంగా 'యూత్ ఒలింపిక్స్' కూడా జరుపబోతున్నట్లు ఆయన తెలిపారు.

కాని దురదృష్టం ఏమిటంటే నేటి యువతరము వారి జీవితము యొక్క లక్ష్యమును సరిగ్గా అర్థం చేసుకోలేక తాత్కాలిక భౌతిక సుఖాలకు అధిక ప్రాముఖ్యత ఇస్తున్నారు. జీవితము యొక్క గొప్పతనము, వారు నడవవలసిన మార్గమును తెలుసుకోలేక పోవుటకు నేటి విద్యా విధానము మరియు వారి తల్లిదండ్రులే ముఖ్య కారణాలు. నేర్చుకునే విద్య నేడు భౌతికముగా ఏమి ఇస్తుంది, దాని ద్వారా ఎంత ధనసంపాదన చేయవచ్చు అనే లక్ష్యాలతో విద్యాభ్యాసం ప్రారంభం అవుతున్నది. బాల్యావస్థ నుంచి మొదలైన ఈ విధానం ఉన్నత విద్యాభ్యాసం వరకు వచ్చేసరికి వాటి మీద ధ్యాస, కోరిక కూడా పెరుగుతున్నాయే తప్ప ఏ మాత్రము తగ్గటం లేదు. దీనికి తల్లిదండ్రులు వారిని తోటి పిల్లలతో పోల్చి చూస్తూ, వారిలో కేవలము డబ్బు సంపాదన, ఉన్నత ఉద్యోగాలే ధ్యేయముగా ప్రేరేపించటం, అటువంటి చదువులు చదివించటానికి మ్రొగ్గు చూపటం అగ్నికి ఆజ్యం పోసే విధముగా తయారు అవుతోంది. నేటి యువతరము దారితప్పటానికి చిన్నప్పటి నుంచి వేసుకున్న ఈ బీజాలే ముఖ్య కారణం.

మానవుని జీవితములో విద్య ఒక ముఖ్య పాత్ర పోషిస్తుంది. ప్రాచీన కాలము నుంచి భారతదేశము అనేక విద్యలకు పుట్టినిల్లుగా ఉన్నది. ఆ కాలములో తరతరాలుగా కొనసాగుతూ వస్తూ, వారి జీవితాలు చీకూ చింతా లేకుండా గడిచిపోయేందుకు ఉపయోగపడే వృత్తి విద్య పట్ల ఎక్కువ ఆసక్తి ఉండేది. అంతే కాక ఈ విద్యలతో పాటు కుటుంబ మరియు సామాజిక గౌరవము కాపాడుతూ, వారి బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించటానికి కావలసిన జ్ఞానము కూడా పిల్లలకు లభించే ఏర్పాటు వారి తల్లిదండ్రులు, ఆ కుటుంబములోని ఇతర పెద్దలు స్వయముగా చేసేవారు. ఇవి వంశాచారాలుగా అనేక తరాల వరకు అందించబడుతూ ఉండేవి.

ఈ వృత్తివిద్యలు కాకుండా గురువుల ద్వారా నేర్చుకునే ఇతర విద్యలు ఉపాసన, సాధన, ఆరాధన పద్ధతులలో నేర్చుకునే వారు. ఈ క్రమములో గురువులు విద్యార్థులకు వారి జీవనోపాధికి కావలసిన విద్యతోపాటు సమాజము, దేశము పట్ల వారి బాధ్యతలను కూడా తెలియజేసేవారు. ఈ బాధ్యతలను వారు స్వయముగా ఆచరిస్తూ బోధించటం వల్ల విద్యార్థులు కూడా చిత్తశుద్ధితో గ్రహించటం జరిగేది. విద్య వ్యక్తిగత స్థితిగతులు, కులమతాలను దృష్టిలో ఉంచుకునికాక వారి మానసిక, శారీరక స్థితులను, కర్తవ్యనిష్టతను దృష్టిలో పెట్టుకుని అందించబడేది కాబట్టి అది ఎల్లప్పుడూ సమాజానికి, దేశానికి సదుపయోగపడేది. ఈ విధముగా విద్య నేర్చిన వారు ప్రజలలో చేతనాన్ని జాగృతపరుస్తూ వారి బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించటంలో సహాయపడుతూ సమాజ హితముకు, దేశప్రగతికి తమ వంతు కర్తవ్యము నిర్వహించే వారు. ఇటువంటి గురువులు, గురుకులాలు నేటి సమాజములో లేకపోవటము వలనే నేటి యువతకు విద్యార్థి

[redacted] అడుగుజాడలు జీవిత లక్ష్యానికి రాచబాటలు.

దశలో సరైన మార్గదర్శనము లభించటం లేదు. నేటి సమాజానికి ఇది చాలా అవసరము.

ప్రస్తుత కాలములో యువత అనేక రకాల సామాజిక కార్యక్రమాలలో పాలుపంచుకోవటం చాలా హర్షించదగ్గ విశేషం. అయితే అనేకచోట్ల దేశాన్ని కాపాడవలసిన యువకిశోరాలే అక్కడ జరిగే అల్లర్లకు కారణమౌతున్నారు. ఉద్రేకము, ఉత్సాహముతో నిండి ఉన్న వీరు, సరైన మార్గదర్శనము లేకపోవటం వల్ల స్వార్థపరులైన కొంతమంది విద్రోహుల చేతిలో చిక్కుకుని తమ బంగారు భవిష్యత్తుని నాశనము చేసుకుంటున్నారు. అంతేకాక అనేక రకాల శారీరక, మానసిక ఒత్తిళ్ళకు లొంగిపోయి సిగరెట్, గుట్కా, మత్తు పానీయాలు, మత్తుపదార్థాల వంటి వాటికి బానిసలుగా మారి జీవితాలను అర్థాంతరముగా అంతము చేసుకుంటున్నారు. దీనిపై సమాజములోని ప్రతి ఒక్కరూ దృష్టి పెట్టి అటువంటి వారికి సరైన దిశలో మార్గము చూపించవలసిన అవసరం ఎంతైనా ఉంది.

భారతీయ సంస్కృతిలో కుటుంబ మరియు విద్యా వ్యవస్థలలో పిల్లలను, యువకులను తీర్చిదిద్దటం అనే విషయము అంతర్లీనముగా జరుగుతూ ఉండేది. విచ్ఛిన్నమవుతున్న కుటుంబాలు, విద్యని వ్యాపారంగా భావిస్తున్న విద్యాలయాలు ఉన్న నేటి కాలములో ఆ స్థితి లేదు. నేటి విద్యావ్యవస్థలో మనిషి యొక్క భౌతిక అవసరాలు తీర్చుకొనుటకు మాత్రమే ముఖ్యం అని భావింపబడుతోంది. దీని వలన వ్యక్తిలో ఉన్న శక్తుల వికాసము జరుగక, వాటిని సక్రమముగా ఉపయోగించుకోవలసిన విధానము తెలియక దారితప్పిన దేవతలవలే ప్రవర్తిస్తున్నారు. క్షేత్రమును బాగు చేస్తేనే కదా మొక్కలు వృక్షాలై తీయటి ఫలములను అందించేది.

## యువతరం సక్రమ మార్గములో నడవడానికి సూత్రాలు

1. కుటుంబ వాతావరణము మనిషి వ్యక్తిత్వాన్ని ప్రభావితం చేస్తుంది. కుటుంబములో అతనికి ప్రేమ, అప్యాయతలు లభిస్తున్నట్లైతే వారు మళ్ళీ అవే పంచటానికి ప్రయత్నిస్తారు. బాల్యం నుండి వారికి లభించే శిక్షణ వారిలో సుసంస్కారాలకు పునాది వేస్తుంది.

2. యవ్వన స్థితిలో సరైన మార్గదర్శనము చాలా అవసరము. ఈ వయస్సులో వచ్చే భౌతిక జన్యుపరమైన మార్పులు వ్యక్తి ఆలోచనలను ప్రభావితం చేసి చిన్నప్పటి నుంచి నేర్చుకున్న సంస్కారాలలో మార్పులను తీసుకువస్తాయి. అతని ఆలోచనా విధానాన్ని మార్చి వేస్తాయి. ఈ మార్పులు అతని జీవన విధానములో నిర్ణయాత్మక మార్పులు తీసుకుని వస్తాయి. అందుకే ఈ దశలో తల్లిదండ్రులు ఆ వ్యక్తి యొక్క సన్నిహితులైన పెద్దల మార్గదర్శనముతో పాటు సద్గురువుల మార్గదర్శనము కూడా చాలా అవసరము.

3. నేర్చుకునే విద్య భౌతిక అవసరాలను తీర్చగలిగే విధముగా ఉండటమే కాక సమాజ శ్రేయస్సు కూడా దృష్టిలో ఉంచుకొని ఎంచుకోవాలి.

4. ఆలోచనా విధానము ఎల్లప్పుడూ సృజనాత్మకముగా (క్రియేటివ్) సకారాత్మకముగా (పాజిటివ్) ఉంచుకునేలా జాగ్రత్త వహించాలి. ఉన్నతమైన ఆలోచనలు మనిషికి సదా ప్రేరణ కలిగిస్తూ జీవితంలో ఉత్సాహాన్ని నింపుతాయి. ఈ విధముగా వారి మానసిక స్థితిని ఎల్లప్పుడూ స్వచ్ఛంగా ఉంచుకోవటం సాధ్యపడుతుంది.

5. కష్టపడే వారిని, ఇతరులకు సహాయం చేసేవారిని చులకనగా చూడకుండా ప్రోత్సాహిస్తూ, గౌరవిస్తూ ఉంటే వారు ఇతరులకు ఆదర్శవంతులుగా మారే అవకాశము ఉంటుంది. అంతే కాక ఇటువంటి వ్యక్తులు యువతకు మార్గదర్శకులై దారి చూపగలరు.

6. ప్రస్తుత కాలములో యువతీ యువకులు పాశ్చాత్య విధానముల పట్ల ఆకర్షితులై ఆడంబరముగా కనిపించే ఫ్యాషన్లు, దుస్తులు, వస్తువులపై ధనమును దుబారా చేయటం అలవర్చుకున్నారు. దీనికి వారి తల్లిదండ్రులు పిల్లలు కోరినంత ధనమును అందజేస్తు అన్ని విధాలుగా సహకరించటం జరుగుతోంది. ఈ విధమైన దుబారా ఖర్చులు తగ్గించుకొని, ఆ ధనమును సత్కార్యాలకు ఉపయోగించటం లేదా ఉత్పాదకరమైన కార్యములకు ఉపయోగించటం ద్వారా స్వయం ఉపాధి కల్పించుకుని, సమాజ ప్రగతికి తోడ్పడవచ్చు.

పైన చెప్పిన విషయాలన్నీ ఆచరిస్తున్నప్పటికి వ్యక్తి ఈర్ష్య, ద్వేషం, కోపం వంటి అవలక్షణాలు కలిగి ఉంటే అతను సమాజానికి శ్రేయాభిలాషి కాలేడు. తనలో సేవాభావము పెంచుకుని, ఇతరులకు ప్రేమ, అప్యాయత, స్నేహం వంటివి పంచటం ద్వారా సమాజములో గుర్తింపును పొంది ఉన్నతమైన జీవితాన్ని గడపగలడు. కనుక యువత ఈ ప్రపంచ భవిష్యత్తు వారి చేతుల్లోనే ఉన్నదని గ్రహించి, సమాజములో అరాచకాలు, దుష్ప్రయోజనాలు అరికట్టటం ద్వారా ఈ ప్రపంచములో శాంతియుత వాతావరణము ఉండే విధముగా నిరంతరం కృషి చేయాలి. యువతకు ఈ విషయములో ఎల్లప్పుడూ జయమే కలగాలని ఆశిద్దాం.

★★★

పరాజయం ఎరుగని ఆయుధం ప్రేమ.

# శతాబ్ది గాయత్రీ మంత్రలేఖన సాధనా మహా అభియానం

మనమందరమూ ఒక అద్భుత కాలంలో అడుగు పెట్టాము. అదే మన గురుసత్తా యొక్క జన్మశతాబ్ది సంవత్సరం. చాలా కొద్ది మందికి మాత్రమే ఈ సౌభాగ్యం లభిస్తుంది. కాని గురుదేవుల ఆధ్యాత్మిక జన్మదినమైన వసంత పంచమి తర్వాత వచ్చే ఈ పర్వదినాలలో పాల్గొనే సౌభాగ్యాన్ని అందరూ పొందవచ్చు. సామాన్య పాఠకులు, పరిజనులు, కొత్త పాత కార్యకర్తలందరూ కూడా ఈ విలక్షణమైన సౌభాగ్యం యొక్క లబ్ది పొందవచ్చు. అదే శతాబ్ది గాయత్రి మంత్రలేఖన సాధనా మహా అభియానము మహాశివరాత్రి 2 మార్చి 2011న మొదలుకుని శ్రీరామనవమి 12 ఏప్రిల్ 2011 వరకు నలభై రోజులు సాగుతుంది. నిజానికి మంత్రలేఖనం ఎప్పుడైనా చేయవచ్చు. మరుగునపడిన గాయత్రీ మంత్రం ఏ గురుసత్తా, యుగవిశ్వామిత్రుని కారణంగా మనిషి మనిషికీ సులభంగా అందుబాటులోకి వచ్చిందో, వారు జన్మించి నూరు సంవత్సరాల పూర్తిఅయ్యే శుభ సమయంలో ఆధ్యాత్మిక పురుషార్థం కోసం మంత్రలేఖనం చేయడం వల్ల అనంతమైన ఆధ్యాత్మిక ఫలశృతి కలుగుతుందనడంలో సందేహం లేదు.

మహాశివరాత్రి (2 మార్చి 2011), శ్రీరామనవమి (12 ఏప్రిల్ 2011) మధ్య మండలం రోజులు (40 రోజులు) భారతదేశంలో మరియు ప్రపంచంలోని మన పరిజనులందరూ ప్రతి రోజూ 60 సార్లు మంత్రాన్ని వ్రాసి 2400 సార్లు పూర్తి చేయాలని, వారి నియమిత కార్యక్రమాలన్నీ చేస్తూ ఉండాలని, విద్యా విస్తారంలో పాల్గొనాలని, అంతేకాక రోజుకు కనీసం ఒక గంట సేపు గురుదేవుల సాహిత్యాన్ని విశేషంగా స్వాధ్యాయం చేయాలని నిర్ణయించబడింది. మహాశివరాత్రి పర్వదినం నాడే సామూహికంగా సంకల్పం తీసుకోవడం జరుగుతుంది. ఆ రోజు నుండే సాధన మొదలవుతుంది. ఈ మంత్రలేఖనమనేది దేవనాగరి లిపి (హిందీ), గుజరాతి, తెలుగు, ఒరియా, బెంగాలి, అసామి, తమిళం, ఆంగ్లం మొదలైన భాషలలో చేయబడుతుంది. ప్రత్యేకమైన శతాబ్ది మంత్రలేఖనం పుస్తకాల్లోనే ఈ కార్యక్రమం జరుగుతుంది. దీనికి సంబంధించిన కొన్ని ముఖ్యమైన విషయాలు, విధి విధానాలు ఈ విధంగా ఉన్నాయి.

1. ప్రతి సాధకుడు, ప్రతి రోజు 60 సార్లు మంత్రలేఖనం చేయాలి. (ఇలా చేయడానికి షుమారు గంట సమయం పడుతుంది. ప్రొద్దున సాయంత్రం కూడా చేయవచ్చు) ఈ విధంగా 40 రోజులు నిరాటంకంగా చేయాలి. ఏ విధంగా నిర్ధారిత రోజులలో మంత్రానుష్ఠానం చేస్తారో, అదే విధంగా ఈ లేఖనం కూడా చేయాలి.

2. భారత దేశంలోని ప్రతి జిల్లా నుండి కనీసం 5555 మంది సాధకుల మంత్రలేఖనాన్ని, వారి నియమిత సమయదానం మరియు సాధనాదానం రూపంలో శ్రీరామనవమి తర్వాత స్వీకరించబడుతుంది.

3. ఇందులో పాల్గొన్న సాధకులందరికీ ఒక విధమైన ప్రమాణపత్రము బహూకరించబడుతుంది.

4. ఇలా పాల్గొన్న సాధకులందరి కోసము జన్మశతాబ్ది కార్యక్రమాలలో (12 ఏప్రిల్ 2011, 1 నవంబరు నుండి 11 నవంబరు, 2011) ప్రత్యేక ఆహుతులు సమర్పించబడతాయి.

5. ఇలా సేకరించిన మంత్రలేఖనాన్ని జన్మశతాబ్ది కార్యక్రమంలో (నవంబరు 2011) గంగా మాత హృదయంలో స్థాపించి ప్రతి రోజు పూజ, హారతి ఇవ్వబడుతుంది. వచ్చిన కోటిన్నర కన్నా ఎక్కువ మంది సాధకులు ఇక్కడ ప్రదక్షిణ చేసుకోవడానికి వీలుంటుంది. ఆ తరువాత ఈ మంత్రలేఖనం శాంతికుంజ్‌లో స్థాపించబడుతుంది. ఇది ఒక ఐతిహాసిక స్థాపనగా రూపొందుతుంది.

6. ఈ ప్రత్యేకమైన మంత్రలేఖనం పుస్తకంలోని రెండు గ్లేజుడు కాగితాలలో 'యుగనిర్మాణ సత్సంకల్పాలు' మరియు 'నా అంగ అవయవాలతో' అనే లేఖలు ముద్రించబడి ఉంటాయి. వీటిని సాధకులు విడిగా ఫ్రేమ్ చేసుకోవడానికి వీలుగా ఉంటాయి.

7. భారతదేశంలోనే కాక ప్రపంచంలో వ్యాపించి ఉన్న అనేక దేశాలలోని మన పరిజనులందరు, 400 జిల్లాలోని 5555 మంది సాధకులు ఈ లేఖనంలో పాల్గొంటే ఇంచు మించు 22 లక్షల 22 వేల మంది పాల్గొన్నట్టు, లేఖనం చేస్తున్నట్టు అవుతుంది. ప్రతి పుస్తకం ఐదు రూపాయలు ధరతో కనీసం 24 లక్షల మంత్రలేఖనం పుస్తకాలు ముద్రిస్తాము. ఎందుకంటే కొంతమంది ఎక్కువ సార్లు మంత్రలేఖనం చేయాలనుకుంటారు.

8. ప్రతీ సాధకుడు శ్రీరామనవమికల్లా ఈ పుస్తకాలను జమ చేయడంతో పాటు ఒక సంకల్పపత్రాన్ని నింపవలసి ఉంటుంది. దాని ప్రకారం కనీసం ఒక సంవత్సరం వరకు రోజుకు ఒక గంట చొప్పున శతాబ్ది పురుషుని ఆలోచనలు విస్తరింపచేయడానికి కోసం సమయదానమును మరియు ఈ మహా ప్రయోజనానికై 108 రూపాయలు అంశదానముగానూ సమర్పించబడాలి.

**[redacted]స్యం ఒకే ఒకటి, బాగా ఆకలయ్యేవరకూ ఏమీ తినకపోవడం.**

9. ఇలా సమకూరిన ధనరాశిలోని 80% రొక్కం కార్పస్ ఫండుగా ఏర్పరచి, దానిపై వడ్డీ ప్రత్యేక శతాబ్ది సాహిత్య బ్రహ్మభోజ్ రూపంలో అందరికీ అందుబాటులో ఉంటుంది. మిగిలిన 20% ఈ బృహత్కార్యం యొక్క సగం ఖర్చులకు (పత్రాలు, ప్రచార ప్రసార సాధనాలు, మంత్రలేఖన ముద్రణ మొదలైన వాటికి) ఉపయోగించడం జరుగుతుంది. పరిజనులు, శాఖలు, శక్తిపీఠాలు తమ సౌజన్యంతో కూడా ఈ పుస్తకాలను ముద్రించవచ్చు. మిగిలిన ధనరాశితో ప్రత్యేకంగా ఎంపిక చేసిన పుస్తకాల ముద్రణ జరుగుతుంది.

11. మంత్రలేఖనం యొక్క మహిమ లెక్కలేనన్ని రెట్లుగా చెప్పబడుతుంది. ఇందులో మెదడు యొక్క పూర్తి ఏకాగ్రత మంత్ర భావార్థం యొక్క చింతనలో ఇమిడి ఉంటుంది. 24 గంటలలో ఎప్పుడైనా, ఎక్కడైనా, ఎటువంటి పరిస్థితిలో నిమగ్నమైనా, అనారోగ్యంతో ఉన్నాసరే, ఎవరైనా మంత్రలేఖనం చేయవచ్చు. మంత్రలేఖనం చేస్తున్నప్పుడు, చేతులు, కళ్ళు, మెదడు మరియు ఇతర చిత్తవృత్తులన్నీ కూడా ఏకాగ్రతమవుతాయి. మంత్రలేఖనం చేసినంతసేపూ కూడా మనసు అందులో లీనమైపోతుంది. ఇలా లేఖనం చేయడం ద్వారా మంత్రం యొక్క మూలశక్తి, ఆత్మ ప్రకాశిస్తాయని చెప్పబడుతుంది. జపం కంటే మంత్రలేఖనం యొక్క ప్రభావం పది రెట్లు ఎక్కువ ఉంటుందని నమ్ముతారు. అంటే ఈ మంత్ర లేఖన అభియానము మనకు శతాబ్ది సంవత్సరంలో 24వేల అనుష్ఠానం యొక్క పుణ్యఫలాన్ని అందివ్వబోతుంది. ఇలా 24 లక్షల మంది సాధకులు చేస్తే జన్మశతాబ్ది సంవత్సరంఓ 24వేల అనుష్ఠానాలు 24 లక్షలు (అంటే సుమారు 576 కోట్ల మంత్ర జపం) పూర్తవుతాయి. ఇంతటి తపస్సు యుగపరివర్తన అభియానానికి, సూక్ష్మజగత్తులో పరిశోధనకి ఒక కొత్త దిశను ఇస్తుంది. ఈ జపసంఖ్య 24 లక్షల చొప్పున చేసిన 24 అనుష్ఠానాలకన్నా ఎక్కువవుతుంది. పరిమిత సంఖ్యలోని పరిజనులతో ఇంత పెద్ద సంఖ్యలో చేయబడ్డ ఈ లేఖనం యొక్క శక్తి అపరిమితమే అవుతుంది. ఇది మిషన్ యొక్క సక్రియతను అనంతంగా విస్తరింపజేస్తుంది.

12. ఈ సమయంలో మీ దినచర్య యధావిధిగానే ఉంచుకోవాలి. మిషన్ యొక్క పనులు చేయాలి, మీ ఆఫీసు లేక వ్యాపార వ్యవసాయాలు చేయాలి, ఎప్పుడూ చేసే భోజనమూ చేయాలి. కాకపోతే ఈ సమయంలో, **'నేను ఎవ్వరినీ నిందించను, ఎవ్వరి గురించి చెడుగా ఆలోచించను'** అనే మానసిక తపము **నిరంతరమూ చేయాలి**. నలభై రోజులూ చూస్తూ చూస్తూ గడిచిపోతాయి, కాని ఈ మానసిక తపము అలవాటుగా మారిపోతుంది. కావాలంటే చిన్నపాటి శారీరక తపస్సు – ఒక పూట ఫలహారము, పాలు, తేలిక భోజనం (అమృతాహారము, పచ్చికూరలు) వంటిది, మన పని స్వంతగా స్వేచ్ఛగా వీలైనంత చేసుకోవడము వంటివి చేయవచ్చు. తపస్సుతో పాటు విద్యాభ్యాసము, జ్ఞాన సముపార్జనల అద్భుతమైన సంయోగమిది. వీటన్నిటితో పాటు గురుసత్తా యొక్క సాహిత్య పఠనము నిత్యము ఒక గంటసేపు చేస్తూండాలి.

యుగఋషి యొక్క జన్మశతాబ్ది కాలంలోని ఒక ప్రత్యేక అనుష్ఠానమని గుర్తుంచుకోవాలి. ఇందులో తపస్సు, సమయదానము, నిర్ధారిత అంశదానము కూడా జతచేయబడి ఉంది. ప్రతి జిల్లాలో సమకూరిన ధనం బ్యాంకులో జమచేయబడి, నేరుగా వేదమాత గాయత్రి ట్రస్టు యొక్క ఎకౌంటుకు పంపబడుతుంది. దానికి సంబంధించిన లెక్కలన్నీ ఇక్కడే పొందుపరచబడుతాయి. ఈ పత్రిక అందగానే 5555 మంది సాధకుల సమీకరణ మా జోనల్, ఉపజోనల్ కేంద్రాల ద్వారా మొదలైపోతుంది. అందరి పేర్లు, చిరునామాలు, ఫోను నంబర్లు, ఈ–మెయిల్ ఐడీలు పత్రాల్లో నింపబడి 2011 జనవరి చివరికల్లా శాంతికుంజ్ శతాబ్ది ప్రణాళిక కార్యాలయానికి చేరుకుంటాయి. శాంతికుంజ్‌కే నేరుగా ఈ ధనాన్ని పంపవచ్చు మరియు మంత్రలేఖనం పుస్తకాలు తెప్పించుకోవచ్చు. కీర్తి, సౌభాగ్యాలతో పాటు పుణ్యార్జన చేయగల ఈ శుభసమయము మళ్ళీ మళ్ళీ రాదు.

*– అఖండజ్యోతి, నవంబరు 2010*

*అనువాదం : శ్రీమతి వల్లీ శ్రీనివాస్*

## భర్తను సంస్కరించిన భార్య

*అనేక సమయాల్లో పత్ని రూపంలో స్త్రీ పతిని మేల్కొలిపి తన కర్తవ్యాన్ని నెరవేరుస్తుంది. భారతీయ స్త్రీ సహన శీలతకు ప్రతిరూపం. ఆర్యసమాజ్ ప్రఖ్యాత నాయకులు స్వామి శ్రద్ధానంద యువకులుగా ఉన్నప్పుడు వారి పేరు మన్షీరామ్. వారికి మద్యపానం, వ్యభిచారం మొదలైన దురలవాట్లు ఉండేవి.*

*వారి పత్ని శివదేవి తనవంతు కర్తవ్యం, బాధ్యతలు నిర్వర్తించేది. భర్త బలహీనతల పట్ల కోపించకుండా ధైర్యంతో, ప్రేమతో నచ్చచెబుతూ నెమ్మది నెమ్మదిగా ఆయనను మార్చింది. ఆయన జీవితం కాయకల్పమైంది. వారు ఉన్నత శ్రేణి లోకసేవకులుగా, సంత్‌గా అయ్యారు. దీని శ్రేయస్సంతా వారి ధర్మపత్నిదే. శివదేవి శ్రేష్ఠ సంస్కారాలు తీసుకుని జన్మించిన వారి సంతానం కూడా ఉన్నత స్థితి పొందారు.*

– ప్రజ్ఞాపురాణం నుండి

**[redacted]ాదన సద్వినియోగం చేస్తేనే ధనానికి సార్థకత.**

# గురుదక్షిణ చెల్లించుటకు ఇదే తగిన సమయం

ఆదరణీయ గాయత్రీ పరివార్ తెలుగు సోదర సోదరమణులకు గాయత్రీ చేతనా కేంద్రం ఆహ్వానం.

పరమపూజ్య గురుదేవులు యుగఋషి పండిత శ్రీరామశర్మ ఆచార్య జన్మశతాబ్ది సందర్భంగా, వారి జన్మ లక్ష్యమైన "యుగనిర్మాణం" కొరకు మనవంతు కర్తవ్యాన్ని మనం నిర్వర్తించి, వారికి గురుదక్షిణగా ఒక చిరస్మరణీయ కానుక అందించుట చాలా సందర్భోచితం మరియు సముచితం, మన జీవితాలకు సార్థకత.

మిత్రులారా! ఒక జాతి మనుగడ అభివృద్ధి దానికిగల సంస్కృతిపై ఆధారపడి ఉంటుంది. ఆ సంస్కృతి పేరుకు మాత్రమే మిగిలి ఆచరణలో శూన్యమైనవేళ ఆ జాతి ప్రకాశాన్ని కోల్పోయి లక్ష్యహీనమైనదిగా, బాహ్యాడంబరాలకు బానిసయై భౌతికమైన భోగలాలసయై, స్వార్థమే పరమార్థము కాగా, పరిణామ క్రమములో తిరోగమన మార్గాన్ని బట్టి తిరిగి పశుప్రవృత్తిని పెంపొందించుకొని, విశ్వమనుగడను ప్రమాదములో పడవేస్తుంది. ఇదే నేడు మన జాతిని, మన సంస్కృతిని పట్టిపీడిస్తున్నది. దీనిని, నిరోధించి, గాడితప్పిన భారతీయ సంస్కృతిని తిరిగి సరియైన మార్గములో పెట్టి విశ్వానికి మార్గదర్శనం చేసెడి దానిగా తీర్చిదిద్దుటకై పరమపూజ్య గురుదేవులు పరమవందనీయ మాతాజీలు వారి జీవన విధానం ద్వారా జీవన సాధన ద్వారా మనకు మార్గదర్శనాన్ని అందించారు.

పూజ్య గురుదేవులు సంవత్సరానికి 24 లక్షల చొప్పున గాయత్రీ జపం 24 సంవత్సరాలు చేసి, గాయత్రీ మాత తానేయై గాయత్రీ మంత్రామృతాన్ని పానం చేసి, తన శరీరంలోని అణువణువు, రోమ రోమంలో గాయత్రిని నింపుకొని, ఒక కాంతిపుంజంలా మారి తనువును విడచి తాను ఆ అఖండజ్యోతిలో లీనమై ఆ జ్యోతి వెలుగులో మనమంతా పయనిస్తూ మన సంస్కృతి తద్వారా జాతిని పునర్‌నిర్మించి యుగనిర్మాణం కావించండి అని మనలను ఆదేశించారు.

1. మిత్రులారా! పదవీవ్యామోహాలు, కులమతభేదాలు, భాషాభేదాలు చెలరేగాయి నేడు. అవినీతి, బంధుప్రీతి, చీకటిబజారు అలముకున్న ఈ జాతి, ఈ దేశం ఎటు దిగజారుతుంది? శక్తినిచ్చే శుభ్రపరచెడి జలమునకు బదులు మద్యంతో నింపి శరీరాన్ని, మనస్సును నిర్వీర్యం చేసుకొనుచున్నారు. యువత దీనికి బానిసయై చేవచచ్చి పోవుచున్నది.

2. చీడపట్టిన పంటనుండి వచ్చిన బీజాన్ని శుద్ధ చేసిననేగాని ఆరోగ్యమైనపంట చేతికి రాని విధంగా మలినపడి, గాడి తప్పిన జాతిని, సంస్కృతిని తిరిగి గాడిలో పెట్టాలంటే, బాల్యదశనుండియే సంస్కారాలు చేపట్టుట తప్పనిసరి.

3. మిత్రులారా! ఆనాడు జాతినిర్మాణం, సంస్కృతుల నిర్మాణం గురుకులాలలో జరిగేది. బాల్యదశలోనే రాజు బిడ్డ దగ్గరనుండి సామాన్యుని బిడ్డ వరకు గురుకులాలోనే విద్యనభ్యసిస్తూ, వ్యక్తిత్వ నిర్మాణము జరిగేది. "గురువు, గురుపత్ని" ఇరువురు వ్యక్తిత్వ నిర్మాణంపై శ్రద్ధ వహించెడివారు, బ్రహ్మచర్య ఆశ్రమంలో ఉన్నవారు విద్యాభ్యాసం పూర్తికాగానే గురువుగారి అనుమతితో వివాహం చేసికొని గృహస్థాశ్రమంలో ప్రవేశించి కుటుంబ నిర్మాణం గావించెడివారు. తదుపరి ఋషులు, మునుల సాయంతో సమాజ నిర్మాణం, రాష్ట్ర నిర్మాణం గావించెడివారు. ఈ విధంగా ఒక ఆదర్శజాతి నిర్మింపబడెడిది. ఈ గురుకులాలను ఆనాటి రాజులు, స్థితిపరులు పోషించెడివారు.

4. మిత్రులారా! ఇదే రీతిలో నేడు మన సంస్కృతి, జాతి, పునరుజ్జీవింపబడవలసియున్నది. పదవీ విరమణ చేసిన ఉపాధ్యాయులు, ఆచార్యులు, చదువుకున్నవారు ఈ గురుకుల పాఠశాలలను వారి వారి నివాసప్రాంతాలలోగాని, వారికి అందుబాటులోనున్న అవసరమైన ప్రాంతాలలో ప్రారంభించి మన సంస్కృతి మరియు జాతిని పునరుజ్జీవింపవలసిన అవసరమెంతైనా ఉంది. దీనికై వారు సమయదానం ఇవ్వాలి. వారికి కావలసిన చేయూతను, సహాయ సహకారాలనందించుటకై చేతనా కేంద్రము తనవంతు కర్తవ్యాన్ని తాను నిర్వహిస్తుంది. వీరికి వెన్నుదన్నుగా నిలుస్తుంది.

5. మిత్రులారా! స్వాతంత్ర్య సంగ్రామవేళ గాంధీజీ, మన సంస్కృతిని ఆధారముగా చేసికొని, భారతీయులను ఒక త్రాటిపై చేర్చి, పూలమాలగావించి భారతమాతమెడలో హారముగా అలంకరించారు. గాంధీజీ లండన్ నగరములో బారిస్టరు విద్య నభ్యసించి, అందరిలా కోటు, సూటు, బూటు వేసి ధనార్జన

[redacted]తి చూపడం మానవత్వం, ఆదుకోవడం దైవత్వం.

చేపట్టక. అంతరంగ పిలుపు మేరకు, స్వాతంత్ర్య సముపార్జనయే తన ధ్యేయముగా చేసికొన్నాడు. దీనికై ఆచరణలో అతి సామాన్య పౌరునిలా చేనేత వస్త్రాన్నిధరించి, చొక్కాధరింపక, పైవస్త్రాన్ని కప్పుకుని, మధుమాంసాలను ధరిచేరనివ్వక, అత్యంత తక్కువ ఖర్చుతో జీవిస్తూ తోటివారికి మార్గదర్శనం చేశాడు. సత్యధర్మాలను పాటిస్తూ అహింసనే ఆయుధంగా చేసికొని, సర్వవేళల సర్వావస్థలయందు రామనామాన్ని జపిస్తూ శాంతి మార్గమును అనుసరిస్తూ నిఖిల విశ్వానికి రాజర్షియై మార్గదర్శనం గావించాడు. దేశానికి స్వాతంత్ర్యం లభించింది, దీనితో ఆర్థిక స్వాతంత్ర్యం లభించింది, దీనితో భౌతికంగా ఎదుగుటకు మార్గము సులువైనది కాని మానసికంగా, అంతరంగికంగా తిరోగమనం పట్టాం. మానవ జీవన లక్ష్యం తిరిగి వ్రాసుకున్నాం. పుట్టుట, బ్రతికినన్నాళ్ళు తినుట, సంపాదించుట, తదుపరి మరణించుట. ఇది మన సంస్కృతి, సంప్రదాయాలకు పూర్తిగా విరుద్ధం. మన ఋషులు, మునులు మనకందజేసిన లక్ష్యం–మనిషి–మహామనిషిగా ఎదగాలి. భారతావని, భూమిపై స్వర్గంగా మారాలి. విశ్వానికి మార్గదర్శనం చేసి భూమిని స్వర్గంగా మార్చాలి.

గాంధీజీ పిలుపు మేరకు ఆనాడు తెలుగు జాతి ఉవ్వెత్తున సముద్రతరంగంలా ఎగసింది. భోగరాజు పట్టాభిరామయ్య, పింగళి, గురజాడ అప్పారావు, అల్లూరి సీతారామరాజు, స్వామి రామానందతీర్థ, పండిట్ నరేంద్రజీ, బూర్గుల రామకృష్ణరావు, మందముల నర్సింగరావు, నీలం సంజీవరెడ్డి, దామోదరం సంజీవయ్య, వావిలాల గోపాలకృష్ణయ్య, బెజవాడ గోపాలరెడ్డి, పుచ్చలపల్లి సుందరయ్య మున్నగు ఎందరో వారి వారి జీవితాలను అర్పించి, దేశసేవలో, జాతినిర్మాణంలో పాలుపంచుకొన్నారు. కొందరు వారి జీవితాలను సమర్పణ గావించారు.

6. మిత్రులారా! ఇట్టి త్యాగధనులకు వారసులమైన మనం ఈ ఆపత్సమయంలో జాతిని, దేశాన్ని ఆదుకోవాలి. పరస్పర సహకారంతో, త్యాగంతో నిదురనుండి మేల్కొని "తెలుగు జాతి మనది, నిండుగ వెలుగు జాతి మనది" అని ఆచరించి చూపాలి. దేశానికి ప్రేరణ నందించాలి. మన విశ్వగాయత్రీ పరివార్ మార్గదర్శకులైన గౌరవనీయులైన డాక్టర్ ప్రణవ్‌పండ్యాగారు 25.10.2010 సోమవారంనాడు శాంతికుంజ్ హరిద్వార్‌లో "ఆధ్యాత్మిక వికాస శిబిరము" ముగింపు రోజున ఈ విధంగా ప్రవచించారు.

"దక్షిణ భారతదేశములో ఆంధ్రప్రదేశ్‌కు ఒక విశిష్ట స్థానమున్నది. సంస్కృతిపరంగా దేశంలోని విశిష్టతను సంతరించుకొన్నది. ఆస్ట్రేలియా ఖండము, దక్షిణ భారతావని నుండి ఎన్నోవేల సంవత్సరాల క్రితం విడవడినది. ఇప్పటికీ సంస్కృతి పరంగా కొన్ని పోలికల అవశేషాలు ఉన్నాయి. రెండింటి మధ్య వీటన్నింటికి మించి ఎందరో ప్రముఖ ఆధ్యాత్మిక గురువులు ప్రభావించిన నేల. ఇట్టి మూలాలను వారసత్వంగా కలిగిఉన్న మీరు "యుగనిర్మాణం"లో ప్రముఖ పాత్ర పోషించవలసియున్నదని ఉద్భోధిస్తూ మనకర్తవ్యాన్ని మనకు గుర్తుచేశారు.

7. మిత్రులారా! ఈ అవకాశాన్ని జారవిడువక అవకాశమున్న వారు అవకాశాన్ని అందిపుచ్చుకొని, సంస్కృతి నిర్మాణంలో జాతి నిర్మాణంలో తద్వారా "యుగనిర్మాణంలో" పాలుపంచుకొని మీ జీవితాలను ధన్యం చేసుకోండి. మనుష్యులుగా నున్న మీరు మహా మనీషులుగా ఎదిగి భూమిపై స్వర్గావతరణ గావించి పూజ్య గురువులకు వారి జన్మశతాబ్ది వేళ గురుదక్షిణ చెల్లించి గురుఋణాన్ని తీర్చుకోండి. శాంతికుంజ్ మరియు చేతనాకేంద్రం మీకు చేయూతనందించుటకు సిద్ధంగా ఉన్నాయి. ప్రతి స్పందించుట మీవంతు.

*– గాయత్రీ చేతనా కేంద్రము, హైదరాబాద్*

## ఇవ్వడంలోనే అధిక ఆనందం

*పర్యటన, ఉపన్యాసాలను ముగించుకొని ఒకసారి స్వామి వివేకానంద తమ ఆశ్రమానికి తిరిగి వచ్చారు. ఆ రోజుల్లో వారు అమెరికాలోని ఒక స్త్రీ ఇంటిలో బస చేశారు. వారు రోజూ స్వహస్తాలతోనే వంట చేసికొనేవారు. వారి అలవాటు ప్రకారం వంట చేసికోవడానికి సిద్ధమౌతూ ఉండగా కొందరి పిల్లలు వారివద్దకు వచ్చి నిలబడ్డారు. మామూలుగా వారివద్దకు పిల్లలు వస్తూ ఉండేవారు.*

*పిల్లలు చాలా ఆకలిగా ఉన్నారు. స్వామిజీ తమ రొట్టెలనన్నిటిని పిల్లలకు పంచి ఇచ్చారు. ఆమె అక్కడే ఉండి ఇదంతా గమనించింది. చాలా ఆశ్చర్యంతో రొట్టెలన్నీ పిల్లలకే ఇచ్చారు మీరేం తింటారు? అని అడిగింది.*

*స్వామివారి పెదవులపై చిరునవ్వు కదలాడింది. నిశ్చలంగా ఇలా అన్నారు. అమ్మా! రొట్టె కడుపు మంటను చల్లార్చుతుంది. నిజమే, అయితే అది ఈ కడుపు అయితేనేమి? ఆ కడుపులు అయితేనేమి? పొందేదానిలో కన్నా ఇచ్చేదానిలోనే ఎక్కువ ఆనందం ఉంది.*

**కార్యశూరత పరిస్థితిని మారుస్తుంది.**

ఆరోగ్యమే మహాభాగ్యం - 2

# హోమియో వైద్య సేవ

**హోమియోపతి దీర్ఘకాల వ్యాధులకే కాకుండా తరుణ వ్యాధులకు కూడా బాగా పనిచేస్తుందని విన్నాను. దెబ్బలు, గాయాలు వంటి ప్రథమ చికిత్సలలో హోమియోపతి పనిచేస్తుందా? - కార్తీక్, హైదరాబాదు**

హోమియోపతి మందులు గాయాలు, ప్రమాదాలలో మామూలు అల్లోపతి మందుల కంటే చాలా వేగంగా పనిచేస్తాయి. ప్రతి ఇంట్లో (ముఖ్యంగా గ్రామాలలో) దెబ్బలకు, బెణుకులకు, గాయాలకు ఉపయోగించే హోమియో మందులు ఉండటం అవసరం.

**ఆర్నికా :** గాయాలకు ఉపయోగించే మందులన్నింటిలోకి ప్రశస్తమైనది ఆర్నికా. కముకు దెబ్బలకు, బెణుకులకు, దెబ్బల వలన అయిన గాయాలకు, అధిక శ్రమ వలన దేహానికి కలిగే అలసటకు పనిచేస్తుంది. ఆపరేషన్‌కి ముందు, తరువాత ఈ మందును వాడవచ్చు. పన్ను పీకించుకునే వాళ్ళు కూడా పన్ను పీకించుకునే ముందు, తరువాత ఈ మందు వాడితే రక్తస్రావం తక్కువగా ఉంటుంది. రోడ్డు ప్రమాదాలకు గురైన వారి శారీరక, మానసిక షాక్‌కి ఇది ప్రత్యేకమైన మందు.

**హైపరికం :** నరాలు అధికంగా ఉండే అరికాళ్ళు, అరిచేతులు, వేళ్ళు తలుపులో పడి నలిగినా, మేకులు లాంటివి గుచ్చుకొనినా ఈ మందు వాడినచో త్వరిత ఉపశమనం కలుగును. వేళ్ళు చితికి నరాలు నలిగితే హైపరికం ప్రత్యేక ఔషధం. ధనుర్వాత (Tetanus) నిరోధానికి నివారణకు కూడా హైపరికం సరైన ఔషధం.

**లెడంపాల్ :** పదునైన వస్తువులు గుచ్చుకొని గాయాలైన వారికి ఇవ్వవలసిన ముఖ్యమైన మందు ఇది. హోమియో వైద్యంలో "లెడంపాల్" ఎ.టి.ఎస్ వంటిది. కనుగుడ్డుకు దెబ్బతగిలి కంటి చుట్టూ నల్లగా ఉంటే "లెడంపాల్" వాడవలసి ఉంటుంది. తేలుకాటుకు ఇది ప్రత్యేకమైన మందు (ముఖ్యంగా గ్రామాలలో ప్రతి ఇంటిలో ఉండదగిన ప్రత్యేక ఔషధం.

**రస్టాక్స్ :** బెణుకులకు ఇది ప్రత్యేక ఔషధం. గాయాలు, బెణుకులకు ముందుగా ఆర్నికా వాడి తగ్గని పక్షంలో వాపు వచ్చిన ఎడల రస్టాక్స్ వాడవలెను.

**క్యాంథారిస్ :** కాలిన గాయాలకు పైపూతగా క్యాంథారిస్ లోషన్ వాడి క్యాంథారిస్ లోపలి మందుగా కూడా వాడినచో త్వరితంగా ఉపశమనం కలుగుతుంది.

**కాలెండ్యులా Q (లోషన్) :** గాయాలు, ముఖ్యంగా దోక్కుపోయిన గాయాల విషయాలలో త్వరగా మానుపట్టడానికి "కాలెండ్యులా" కు మించిన ఔషధం లేదు. ఇది యాంటీసెప్టిక్ కాదు. కాని కాలెండ్యులా లోషన్ రాసిన గాయంలో క్రిములు చేరవు. చీముపట్టిన గాయాలను ఈ లోషనులో కడిగి కట్టుకడితే చీమంతా పోయి రెండు రోజులకే గాయం శుభ్రంగా తయారవుతుంది.

**సింఫైటం :** గాయాలు తగిలి ఎముకలు విరిగినచో (fractures) ఆర్నికాతోపాటు సింఫైటం మందును కూడా వాడినచో ఎముకలు త్వరగా అతుక్కొంటాయి. మోతాదు 4-6 పిల్స్.

**చలికాలం సమస్యలు :**

**నా వయసు 28 సం॥లు చిన్నప్పటి నుండి జలుబుతో బాధపడుతున్నాను. సంవత్సరం అంతా ప్రతిరోజు తుమ్ములు వస్తుంటాయి. చలిగాలి పడదు. దుమ్ము, ధూళి పడదు. Citrizine (అలోపతి మందు) వాడితే అప్పటికి తగ్గుతుంది మళ్ళీ తిరగబెడుతుంది. హోమియోలో దీనికి శాశ్వత ఉపశమనం ఉంటుందా? - డి రామారావు - విజయవాడ**

మీకున్న సమస్య ఎలర్జిక్ రైనైటిస్ (Allergic Rhinitis) ఈ సమస్య వంశపారంపరంగా లేదా వాతావరణ కాలుష్యం వల్ల కాని రావచ్చు. సాధారణంగా ఈ జబ్బు లక్షణాలు చలిగాలిలో తిరిగితే, దుమ్ము దులిపితే, తాలింపు వేసిన పొగలకి, తెల్లవారుఝామున తుమ్ములు రావడం, ముక్కు కారడం, కళ్ళు, ముక్కుల్లో దురద, కళ్ళు మంటలు వచ్చును. మరల కాసేపటి తరువాత వాటంతట అవే తగ్గి మరల తిరగబెడతాయి.

హోమియోపతి వైద్యం ఎలర్జీలకు బాగా పనిచేస్తుంది. హోమియో వైద్యులు మీ పూర్తి వివరాలను తెలుసకొని కాన్‌స్టిట్యూషనల్ మెడిసిన్‌ను ఇస్తారు. రోగియొక్క పూర్తి లక్షణాలను పరిగణలోకి తీసుకొని చేయబడు చికిత్స కావున రోగికి పూర్తి స్వస్థత చేకూరుతుంది. దీనికి సాధారణంగా వాడే మందులు ఎకోనైట్, డల్కమారా, ఆర్సెనిక్ ఆల్బ్, సోరినం, పల్సటిల్లా

**మా బాబు వయస్సు 5 సం॥లు. పుట్టినప్పటి నుండి ఉబ్బసంతో బాధపడుతున్నాడు. ఎన్ని మందులు వాడినా తాత్కాలిక ఉపశమనమే కాని పూర్తిగా బాబు కోలుకోవడం లేదు. దీనికి హోమియోలో ఏదైనా పరిష్కారం ఉందా?**

*- శాంతిశ్రీ, కడప*

[redacted]ాల స్థంభాలు, సాధన, స్వాధ్యాయం, సంయమం, సేవ.

ఆస్తమా అనేది ఒక దీర్ఘకాలిక వ్యాధి ఇది ఎలర్జీ మూలంగా వస్తుంది. ఈ వ్యాధి లక్షణాలు ఒక్కొక్కరికి ఒక్కొక్క విధంగా ఉంటాయి. 1) దగ్గు 2) తెమడ 3) శ్వాస కష్టతరంగా ఉండటం 4) పిల్లి కూతలు 5) ఛాతి బిగపట్టినట్లు ఉండటం 6) ఊపిరి ఆడకపోవటం

హోమియో చికిత్సా విధానం రోగి వ్యాధి నిరోధక శక్తిని బలోపేతం చేస్తుంది. అందువలన సరియైన హోమియో మందు వాడినచో ఉబ్బసంను తగ్గించవచ్చు. ఉబ్బసం ఉన్న సమయంలో ఆ వ్యక్తిని గమనించి లక్షణాలను పరిశీలించి, అనగా వ్యాధి లక్షణాలు ఎలా ఉన్నవో వేటికి పెరుగుతుందో నేటి వలన తగ్గుతుందో (చల్లగాలి, నిద్ర, వ్యాయామం, ఆదుర్దా, భయం, పండుకొనుట, కూర్చొనుట వగైరా) గమనించి వైద్యుడు సరియైన మందును నిర్ణయిస్తాడు. ఇంకా రోగి యొక్క మానసిక స్థితి, మిగతా ఆరోగ్య పరిస్థితి అన్ని పరిగణలోకి తీసుకొని సరైన మందును సరైన మోతాదులో వాడినచో ఉబ్బసంను తగ్గించవచ్చు. హోమియో మందులు వాడటంతో ఇన్‌హెలర్‌లు, స్టిరాయిడ్స్ వంటి హై డోసు మందులను దూరం చెయ్యగలుగుతారు. కావున మీరు నిర్భయంగా హోమియో చికిత్సను తీసుకొనండి. సాధారణంగా ఉబ్బసానికి వాడే మందులు ఆర్సినికం, ఆంటింటార్టు, బాసిలినం, ట్యుబర్క్యులినం, ఇపెకాక్, కాలికార్బ్, స్పాంజియా.

**మూత్రపిండాలలో రాళ్ళు :**

**నా వయస్సు 26 సం॥లు. నేను గత 2 సంవత్సరాలుగా మూత్రపిండాలలో రాళ్ళతో బాధపడుతున్నాను. ఒక్కొక్కసారి కుడివైపు నడుము నుండి విపరీతమైన నొప్పి వస్తుంది. దీనికి ఆపరేషన్ మాత్రమే మార్గమా? ఒకవేళ ఆపరేషన్ చేసినా రాళ్ళు మరలా వస్తాయా? హోమియోలో దీనికి శాశ్వత పరిష్కారం ఉన్నదని విన్నాను. వివరాలు తెలుపగలరు.**

***- బాల త్రిపురసుందరి, అనంతపురం***

మూత్రపిండాలలో రాళ్ళు (Kidney Stones or Renal Calculi) అనేవి వివిధ ప్రాంతాలలో వివిధ రకాలుగా ఉంటాయి. ఈ రాళ్ళు మూత్రములోని పదార్థాలతోనే తయారవుతాయి. ఇవి 4 రకాలుగా ఉంటాయి. (1) కాల్షియం రాళ్ళు : ఇటువంటి రాళ్ళే చాలామందిలో ఉంటాయి. (2) స్ట్రువైట్ రాళ్ళు : ఇవి మూత్రవ్యవస్థలో ఇన్‌ఫెక్షన్ వల్ల వస్తాయి. ఇవి మెగ్నీషియం మరియు అమ్మోనియా వ్యర్థ పదార్థాలతో తయారు అవుతాయి. (3) యూరిక్ ఆసిడ్ రాళ్ళు : ఇవి మూత్రంలో ఆమ్లా ఎక్కువ అయినచో ఏర్పడతాయి. ఈ రాళ్ళు ఉన్నవారు మాంసాహారమును తగ్గించవలెను, తినకపోతే మరీ మంచిది. (4) సిస్టిన్ రాళ్ళు : ఇవి చాలా అరుదుగా వస్తాయి. ఇది వంశపారంపర్యంగా వచ్చు సమస్య. సాధారణంగా ఈ సమస్య ఉన్నవారికి అప్పుడప్పుడు సన్నని నొప్పి నడుము వెనుకభాగం నుండి ముందువైపుకు వస్తుంటుంది, కదిలినా ఎక్కువవుతుంది. ఇదే కాక వేరే బాధలు కూడా ఉండవచ్చు. అవి 1) విపరీతమైన నడుము నొప్పి 2) మూత్రం ద్వారా రక్తం వెడలుట 3) చలి జ్వరం 4) వాంతులు 5) మూత్రం వెడలునపుడు మంట మొదలైనవి.

మూత్ర నాళములలో ఇన్‌ఫెక్షన్ వల్ల లేదా ఏదైనా అడ్డుకోవడం చేత రాళ్ళు ఏర్పడతాయి. రక్తంలో కాల్షియం ఎక్కువైనను లేక యూరిక్ యాసిడ్ ఎక్కువైనను ఈ రాళ్ళు ఏర్పడతాయి. ఎక్కువగా కాల్షియం, మాంసాహారం ఉన్న ఆహారం తీసుకుంటూ నీరు తక్కువగా తాగేవారిలో కూడా రాళ్ళు వచ్చే అవకాశం ఉంది. ఈ మధ్యకాలంలో పిల్లలకి టి.వి.లో వచ్చే ప్రకటనలు చూసి కాల్షియం మాత్రలు అవసరానికి మించిన మోతాదులో వాడటం వలన పిల్లలకు కూడా రాళ్ళు వస్తున్నాయి. కావున అతి సర్వత్ర వర్జయేత్. అవసరానికి మించి ఏదీ వాడరాదు. నీరు రోజుకు 12 గ్లాసులకు తక్కువ కాకుండా తీసుకోవాలి.

మూత్ర పిండాలలో రాళ్ళను హోమియో చికిత్స ద్వారా మరియు చాలావరకు ఆపరేషన్ లేకుండా కూడా నయం చేయవచ్చును. ఈ చికిత్సా విధానం రెండు రకాలుగా ఉంటుంది. 1) నొప్పి ఉన్నప్పుడు రోగి లక్షణాలను బట్టి acute మందులు వాడవలెను. 2) తిరిగి ఈ రాళ్ళు ఏర్పడకుండా కాన్‌స్టిట్యూషనల్ మందును ఉపయోగించెదరు. దీనివల్ల తిరిగి ఆ రాళ్ళు ఏర్పడే అవకాశం ఉండదు. హోమియో మందులు చాలా సరళమైనవి. ఎటువంటి దుష్ఫలితాలు లేనివి కావున చిన్నపిల్లల నుండి ముసలివారు కూడా ఎటువంటి సందేహం లేకుండా వాడవచ్చు. గర్భిణి స్త్రీలు కూడా హోమియో మందులను వాడవచ్చు. సాధారణంగా వాడేమందులు బెర్‌బెరిన్, లైకోపొడియం, క్యాంథారిస్, సర్‌సపరిల్లా, నక్స్‌వామికా, కోలోసింథ్. రోగ లక్షణాలను బట్టి మందు నిర్ణయించబడుతుంది.

**సలహాల కొరకు సంప్రదించవలసిన చిరునామా**

**డా॥ టి. నీలవేణి,** బి.హెచ్.ఎమ్.ఎస్.
ఆర్.ఎన్..జి. అడ్వాన్స్‌డ్ హోమియో క్లినిక్
ఇ.నెం. 3-211, యశోద గార్డెన్స్ దగ్గర,
శాంతినగర్, కూకట్‌పల్లి, హైదరాబాద్ - 500 072.
ఫోన్: 9966883044
ఇ-మెయిల్: drneelaveni@gmail.com

[redacted] వయోవృద్ధుల కన్నా జ్ఞాన వృద్ధుడు మిన్న.

# వేమన వేదం-నవజీవన నాదం - 2

**నిక్కమైన మంచి నీల మొక్కటి చాలు**
**తళుకు బెళుకు రాళ్ళు తట్టెడేల?**
**చాటుపద్యమిలను చాలదా యొక్కటి**
**విశ్వదాభిరామ వినురవేమ!**

రాశి కాదు ముఖ్యం వాసి మాత్రమే ముఖ్యమైనది. వందల కొద్దీ మాటలు ఉన్నా, అందులో మనస్సుకు హత్తుకునేదే నిజమైన వాక్కు. కత్తికంటే పదునుగా, బాణం కంటే సూటిగా మనస్సును తాకి, ఆలోచింపచేసే శక్తి ఒక్కమాటకే ఉంది. మాటలకంటే అందమైన పద్యం మరింత ప్రభావం చూపుతుంది. యతి ప్రాసలతో కూడిన పద్యం మనలను నియంత్రిస్తూ మన ప్రగతికి దారి చూపుతుంది.

“పద్యం మన సంస్కృతి నేపథ్యం” అనే లోకోక్తి ఇలాగే వ్యాప్తి చెందింది. తెలుగు పద్యాలలో చాటుపద్యాలకు విశిష్ట స్థానముంది.

కవులు తమకు కల్గిన అనుభవాలను ఇతరులతో పంచుకునే ప్రయత్నమే “చాటు పద్యరచన”. శ్రీనాధుని చాటువులు ఎంతో ప్రసిద్ధికెక్కాయి. వేమన అదే పంథాలో తన అనుభవాలను, ఇతరులకు హెచ్చరికగా చేస్తూ “విశ్వదా!” అభిరామా! వినురవేమా! అనే మకుటంతో శతకాన్ని అందించారు. తన నెచ్చెలి విశ్వదనూ, మిత్రుడు అభిరాముణ్ణి, సంబోధించడమే కాకుండా తానకుతానుగా ఆత్మబోధ చేసుకున్నట్లుగా తెలియజేసారు.

తళుకు బెళుకు రాళ్ళు ఎన్ని ఉన్నా, యదార్థ ప్రకాశం ఉన్న “నీలం” ఒక్కటిచాలు. వేలకొద్దీ పద్యాలు ఉన్నా, అందులో చిరకాలం నిల్చేవి ప్రజల నాలుకలందు వల్లె వేయబడే పద్యాలే నిజమైన పద్యాలు అంటూ పద్యం యొక్క పరమార్థాన్ని సులభంగా, సూటిగా తెలియజేసారు వేమన.

**అనువుగాని చోట అధికులమనరాదు**
**కొంచెముండుటెల్ల కొదువకాదు**
**కొండ అద్దమందు కొంచెమై యుండదా?**
**విశ్వదాభిరామ వినుర వేమ!**

సమయం, సందర్భం అనువుగా (అనుకూలంగా) లేనప్పుడు ఎంతటి ప్రతిభావంతుడైనా ఒదిగి ఉండటమే మంచిది. అలా కాకుంటే పరాభవం తప్పదు. అల్పులు అదృష్టం వల్ల అధికారం చేజిక్కించుకున్నప్పటికీ, విజ్ఞులు మౌనంగా ఉండడమే శ్రేయస్కరం. నీటి ప్రవాహం ఉధృతంగా ఉన్నప్పుడు గడ్డిపోచ ఒంగి ఉండి తన అస్తిత్వాన్ని నిలుపుకుంటుంది. అదే లౌక్యం. అలా కాకుంటే ఆ ప్రవాహంలో కొట్టుకుపోతుంది.

“కొంచెముండుటెల్ల కొదువకాదు” అనడంలో ఒదిగి ఉండడంవల్ల తక్కువ తనం అనిపించుకోదు. పాండవులు ఎంతటి గొప్పవారైనా విధివశాత్తు తమ సామంతరాజైన విరాట రాజు కొలువులో అజ్ఞాతవాసం చేయకతప్పలేదు. ఎంతటి పెద్ద పర్వతమైనా, అద్దంలో చిన్నగా అగుపించదా? అంటే కొండ యొక్క పెద్ద ఆకృతి, చిన్నదిగా కన్పించడం అద్దం యొక్క తాత్కాలిక ఘనతే తప్ప, కొండ అస్తిత్వానికి భంగం కాదు. అలాగే విధి వక్రించినపుడు దురదృష్టం తోడైనపుడు ఎంతటి గొప్పవాడైనా ఒదిగి ఉండాలన్న జీవన వేదాన్ని అందించిన విశ్వ కవి వేమన.

**అనగననగ రాగ మతిశయిల్లుచునుండు**
**తినగ తినగ వేము తియ్యగుండు**
**సాధనమున పనులు సమకూరు ధరలోన**
**విశ్వదాభిరామ వినురవేమ!**

“కృషితో నాస్తి దుర్భిక్షం” అనే ఆర్యోక్తిని అతిరమ్యంగా, “కృషి ఉంటే మనుషులు ఋషులౌతారు. మహాపురుషులౌతారు” అన్న కవివాక్కును ఈ ప్రసిద్ధ పద్యం వివరిస్తోంది.

రాగాన్ని పదే పదే ఆలపించడం వల్ల లోకంలో ప్రసిద్ధమై సంగీత పరాగాన్ని వెదజల్లుతుంది. అలాగే వేపాకు చేదుగా ఉన్నా, ప్రతిరోజూ కొంచెం కొంచెం తినడం వల్ల జిహ్వకు ఆ రుచి అలవాటై, తియ్యగా (తినడానికి యోగ్యమైనదిగా) మారుతుంది. అలాగే నిత్యసాధన చేయడం వల్ల అసాధ్యమైనవనుకునవన్నీ సాధించబడతాయి. మనిషి చంద్రుడిపై అడుగుపెట్టడం వంటి అద్భుతాలన్నీ కేవలం నిత్యసాధన వల్లే సాధ్యమౌతాయి. అందువల్ల సాధన వల్ల అన్నీ సానుకూలమౌతాయి. యోగసాధన, కార్యసాధన మొదలగు అనుష్టాన సాధనలతో ‘మోక్షసాధన’ కలుగుతుందని. వేమన మార్గదర్శనం చేసారు.

**[redacted]ని చూడు, మంచిని విను, మంచిగా మాట్లాడు.**

మనం చేసే పనులలో చిత్తశుద్ధి ఉండాలి. సంకల్ప శుద్ధి ఉన్నపుడే ఆశయసిద్ధి కలుగుతుందంటారు వేమన ఈ క్రింది పద్యంలో...

**చిత్తశుద్ధి కలిగిచేసిన పుణ్యంబు**
**కొంచెమైననదియు కొదువకాదు**
**విత్తనంబు మర్రి వృక్షంబునకు నెంత**
**విశ్వదాభిరామ వినురవేమ!**

ఆత్మశుద్ధితో చేసిన మంచిపనులు, చిన్నవైనప్పటికీ, తక్కువ సంఖ్యలో ఉన్నప్పటికీ అది ఏ మాత్రం తక్కువ కాదు. మన పరిధిలో, శక్తి కొలదీ ఎంత చిన్నపనైనా, చేయగల్గితే నేడు చిన్నగా ఆరంభమైన ఆ మంచి పనులు భవిష్యత్తులో విస్తరించి మహావృక్షాలుగా ఎందరికో నీడనిచ్చి సేదతీరుస్తాయి.

చిన్నదే అయినప్పటికీ మర్రి విత్తనాన్ని సారవంతమైన భూమిలో నాటితే, క్రమక్రమంగా పెరిగి, పక్షుల గూళ్ళకు, బాటసారులకు నీడగా, మర్రికాయలను పక్షులకు ఆహారంగా ఇస్తూ, విస్తరిస్తుంది. తర్వాత కూడా ఊడలను క్రిందకు దింపి ఎన్నో వందల సంవత్సరాలు నిలుస్తుంది. కాబట్టి నేడు చిన్నప్రయత్నంతో మొదలయ్యే మంచి పనులు, రేపు ఎందరికో మేలు చేసే మహాకార్యాలుగా మారతాయి.

**ఆత్మశుద్ధి లేని ఆచారమదియేల**
**భాండశుద్ధి లేని పాకమేల**
**చిత్తశుద్ధిలేని శివపూజలేలరా**
**విశ్వదాభిరామ వినురవేమ!**

ఆచరించే ప్రతిపనిలోనూ ఆత్మశుద్ధి ఉండాలి. లేకుంటే అది సదాచారం కాకుండా దురాచారంగా పరివర్తనం చెందుతుంది. కాబట్టి ఆత్మశుద్ధి లేని ఆచారమేమిటి? అని నిక్కచ్చిగా ప్రశ్నించిన ధీశాలి వేమన. కుండశుభ్రంగా లేకపోతే అందులో వండిన ఆహారము విషాహారమే అవుతుంది. చిత్తశుద్ధి లేకుండా శివపూజలు చేయరాదు. చేస్తే అవి శవపూజలతో సమానము. కాబట్టి చేసే ప్రతి పనియందు శ్రద్ధ అవసరమని వక్కాణించారు వేమన.

మనుష్యులందరూ ఒకే రీతిలో, ఒకే తీరులో ఉంటారు. కాని వారి తత్త్వం తెలియాలంటే తగిన సమయం, సందర్భం, వారు ఇతరులకు ఎలా సహాయపడతారో తెలిపే పరిస్థితి కల్పించ బడినపుడు బయటపడుతుంది. అంతవరకూ అందరు మహానుభావుల్లాగే అగుపిస్తారు. ఈ సత్యాన్ని తెలుపుతూ వేమన ఇలా అంటారు.

**ఉప్పుకప్పురంబు నొక్కపోలికనుండు**
**చూడచూడరుచుల జడవేరు**
**పురుషులందు పుణ్య పురుషులు వేరయా**
**విశ్వదాభిరామ వినురవేమ!**

ఉప్పు, కర్పూరం రంగు విషయంలో ఒకే విధంగా ఉంటాయి. కానీ వాటి స్వభావము, రుచి వేర్వేరుగా ఉంటాయి. అలాగే మనుష్యులంతా గొప్పవారిగానే అగుపిస్తారు. కాని వారి సహాయం పొందాలని వారి దగ్గరకు వెళ్ళినపుడు వారు తీరుతెన్నులు, స్వభావము, గుణగణాలు తెలుస్తాయి. పురుషులంతా ఒకేలాగ ఉన్నప్పటికీ, వారిలో పుణ్య పురుషులు వేరుగా, ప్రత్యేకంగా ఉంటారు. కావున మనుష్యులను వారు చేసే పనులు, వారి మాటలు, స్వభావం ద్వారా మాత్రమే గుర్తించాలి. కేవలం ఆకారం చూసి మనం గుర్తించరాదన్న సత్యాన్ని వేమన పై విధంగా వివరించారు.

**చంపదగినయట్టి శత్రువు తనచేత**
**జిక్కెనేని కీడు చేయరాదు**
**పొసగ మేలు చేసి పొమ్మనుటేచాలు**
**విశ్వదాభిరామ వినురవేమ!**

మనకు గతంలో అపకారం చేసిన శత్రువు, మనకు చిక్కినపుడు, అతనిని హింసించడం తగదు. వాడికి ఎలాంటి కీడు చేయకుండా విడిచిపెట్టాలి, వీలైతే అతనిని ఎటువంటి పరుషమైన మాటలతో హింసించకుండా, కొంత సహాయం (తిండిపెట్టడం, ధన సహాయం మొదలగునవి) చెయ్యాలి. అపుడు ఇంతటి మహోన్నత వ్యక్తికి నేను అపకారం చేశానే అన్న పశ్చాత్తాపం ఆ శత్రువులో కల్గి అతనిని మిత్రుణ్ణి చేస్తుంది. అదే మన భారతీయ తత్త్వం. గాంధీజీ సిద్ధాంతాలలో ఇది స్పష్టంగా అగుపించే తత్త్వం. ఉపపాండవులను వధించిన అశ్వత్థామను కూడా పైన వివరించిన తీరులోనే వధించకుండా, విడిచిపెట్టాడు ధర్మరాజు. అదే మన ధర్మం. మానవీయ మర్మం అంటారు వేమన.

– సాధన నరసింహాచార్య

**[redacted] బంగారానికి, ఆపద వీరునికి వన్నె తెస్తుంది.**

# పూజ్య గురుదేవుల జన్మశతాబ్దికై చేయవల్సిన కార్యములు

**గాయత్రీ ప్రజ్ఞా పరిజనులకు విన్నపము**

మిత్రులారా ! పూజ్య గురుదేవులు యుగఋషి పండిత శ్రీరామశర్మ ఆచార్యవర్యుల జన్మశతాబ్ది మహోత్సవ వేడుకలు ప్రారంభమగుటకు మనముందు అతితక్కువ సమయమున్నది. యుగపరివర్తన మరియు సత్యయుగ పునరాగమన ఘడియలు కూడా త్వరలో మొగ్గతొడిగి పుష్పించనున్నాయి. ఈ అద్భుత సమయాన్ని మన ఈ భౌతిక నేత్రాలతో వీక్షించుటకై నేటివరకు వేచియున్న మనమంతా ఈ మహత్తర వేళ బద్ధకించి అలసి విశ్రమించరాదు. బండి రాకకై అప్పటివరకు పడిగాపులు పడి ఎదురుచూచిన ప్రయాణికుడు, బండివచ్చేవేళ అలసి నిద్రించి గమ్యాన్ని చేరలేనిరీతిగా, ఈ అద్భుత సమయంలో మనము అలసి విశ్రమించినచో మన వెనుకవచ్చినవారు మనకన్నా ముందుగా గమ్యాన్ని చేరి సత్యయుగ ఫలాలను ముందే పొందెదరు. పూజ్య గురుదేవుల మాటలలో "మీరు మీ అలసటను మరియు సౌఖ్యాన్ని గురించి ఆలోచించవద్దు. అహంకారం పెంచుకోవద్దు. ఇది మీకు అగ్ని పరీక్ష. మీకు గల సమర్పణా భావానికి, మీ గౌరవాలకు సార్థకతను చేకూర్చెడి పని ఇది. మీ సహచరుల పట్ల మీకు గల ఓర్పు, శ్రద్ధలకిది కొలమానం. మీలోని తత్పరత ఎంత ఉన్నతంగా ఉండాలంటే హనుమంతునిలోని కణకణం రామకార్యాన్ని జపించిన రీతిలో, దానిని పదిమంది మెచ్చేలా ఉండాలి. మీలోని ప్రతి అంగము గురుసత్తా కార్యాన్ని చేపట్టాలి. ఈ అగ్ని పరీక్షా సమయంలో మీ శరీరం, మనస్సు మరియు ఆలోచనలు ఉన్నతంగా స్పందించాలి. శ్రమ, మనోబలం మరియు త్యాగంతో మీరు ఉన్నతిని పొందగలరు. మీ ఉన్నతిని, ఏకాగ్రతను ఎంతమాత్రం సడలనివ్వవద్దు"

ఈ క్రింది లక్ష్యాలను మీ ముందుంచడమైనది.

1. మనమంతా తరతమ భేదాలను మరచి ఒక సుశిక్షిత, సంఘటిత శక్తిగా ఎదగాలి.
2. యుగఋషి పండిత శ్రీరామశర్మ రానున్న జన్మశతాబ్ది వేడుకలకు కనీసము ఒక లక్షమంది పరిజనుల సిద్ధముచేసి 2011లో శాంతికుంజ్, హరిద్వార్‌కు తీసికొని వెళ్ళాలి. దీనికై జనబాహుళ్యాన్ని జాగృతమొనర్చవలసియున్నది.
3. గురుదేవుల సాహిత్యాన్ని స్వాధ్యాయము, సత్సంగముల ద్వారా మాత్రమే వ్యాప్తిచేయగలం. జన బాహుళ్యాన్ని జాగృతమొనర్చుటకు గురుదేవుల సాహిత్య, సాధనాలు తప్పనిసరి.
4. పై లక్ష్యసాధనకై పూజ్యగురుదేవులందజేసిన తులసి గాయత్రీ మంత్రమును, గాయత్రీ మంత్ర జపముతోపాటు ఈ క్రిందివిధముగా చేయాలి. ఇదిమనలోని కుసంస్కారాలను కడిగివేసి మనల సూదంటూ రాళ్ళుగా తయారుచేస్తుంది.

అ) నిత్యము ఒకమాల గాయత్రీ, తర్వాత మూడు మాలలు తులసి గాయత్రీ, ఆ పిమ్మట ఒక మాల గాయత్రీ మంత్రము, నిర్ణీత వేళ, నిర్ణీత సమయానికి చేయాలి.

ఆ) పైన తెల్పిన తులసి గాయత్రీ మంత్ర జప సమయంలో ఈ క్రింద తెల్పిన ఏడింటిని స్ఫురణలోనుంచుకొనాలి.

**సేవాసక్తి, దేశసేవాప్రవృత్తి, సత్యప్రాధాన్యత, పతివ్రతాధర్మం, పత్నీవ్రతధర్మం, ఆత్మశాంతి మరియు పర దుఃఖనివారణ.**

**తులసి గాయత్రీ మంత్రం**

**ఓం శ్రీ తులస్యై విద్మహే విష్ణు ప్రియాయై ధీమహి**
**తన్నో వృందా ప్రచోదయాత్**

జపానంతరం సూర్యునికి అర్ఘ్యమిచ్చి, మిగిలిన తీర్థాన్ని లోపలికి తీసికోండి. పై పద్ధతి ద్వారా సంస్కరింపబడిన మనము పూజ్య గురుదేవుల సాహిత్య సౌరభాలను జన బాహుళ్యానికి స్వాధ్యాయ సత్సంగముల ద్వారా అందించాలి. అప్పుడు వారిలో జాగృతిని పెంపొందింపజేస్తూ ఒక సుశిక్షిత సంఘటిత సామూహిక శక్తికి జీవంపోయగలం. ఈ రీతిలో ఒక లక్షమంది పరిజనుల నమోదుచేసికొని నవంబరు 2011 కార్యక్రమానికి శాంతికుంజ్, హరిద్వార్‌కు తరలివెళ్ళి, గురుదేవులకు శ్రద్ధాంజలి ఘటించాలి మనమంతా.

*– మూలం: పూ॥ డా॥ మారెళ్ళ శ్రీరామకృష్ణ మాస్టారిగారి ప్రసంగం*

**వివరములకు ఈ క్రింది నంబర్లను సంప్రదించండి :**

**ఫోన్ : 9949167035/9949111175/ 9491317670/9542357290**

ఇట్లు మీ సోదరుడు

**అశ్విని సుబ్బారావు**

అఖిల విశ్వగాయత్రీ పరివార్

దక్షిణ భారత సంయోజకులు

[redacted] నిర్మల హృదయం భగవంతుని నివాసం.

వార్తలు

# ఆధ్యాత్మిక జ్ఞాన వికాస శిబిరము

## 20.10.2010 నుండి 26.10.2010 వరకు శాంతికుంజ్, హరిద్వార్‌నందు జరిగిన ఆధ్యాత్మిక జ్ఞాన వికాస శిబిర విశేషాలు

గాయత్రీ తీర్థ్, శాంతికుంజ్, హరిద్వార్‌లో 22 నుండి 26 అక్టోబరు 2010 మధ్య ఆధ్యాత్మిక జ్ఞాన వికాస శిబిరము శాంతికుంజ్ వారి ఆధ్వర్యంలో చేతనా కేంద్రం హైదరాబాద్ వారి చొరవతో నిర్వహించబడినది.

ఉదయము 8.30 గంటలకు రామకృష్ణ హాలులో డాక్టరు ఓ.పి.శర్మ మరియు డాక్టరు బ్రిజ్‌మోహన్ గౌర్ మరియు అశ్విని సుబ్బారావు గార్లు దీప ప్రజ్వలన గావించుటతో శిబిరము ప్రారంభింపబడినది.

శ్రీ అశ్విని సుబ్బారావుగారు, శ్రీశర్మగారిని, బ్రిజ్ మోహన్‌గౌర్ గారిని, మరియు పరమానందద్వివేది గార్లను సభికులకు పరిచయం చేసిరి. శ్రీ ఉత్తమ్‌జీ బృందం ప్రేరణ గీతాలను ఆలపించారు.

**డా॥ ఓ.పి.శర్మ :** డాక్టరు శర్మ గారు వృత్తిపరంగా అల్లోపతి వైద్యులు, ప్రభుత్వ ఉద్యోగం చేస్తూ ప్రజలకు సేవలందిస్తూ, పూజ్య గురుదేవుల ఆధ్యాత్మిక ప్రసంగాలకు, సాహిత్యానికి ప్రభావితులై, గాయత్రీ పరివార్‌లో పూర్తి సమయదానిగా చేరి గత 25 సంవత్సరముల నుండి వారి సేవలనందించుచున్నారు.

**శ్రీశర్మగారి ప్రసంగసారం :** మిత్రులారా! ఈ సృష్టిలో మానవకల్పితాలైన అంతరాలను, అనర్థాలను తొలగించి, అధ్యాత్మికాభ్యున్నతి దిశగా మానవాళి అడుగులు వేయాలనెడి లక్ష్యసాధనకై మహామానవులు, సామాన్య మానవులుగా జన్మతీసికొని మన మధ్య నివసిస్తూ మనకు మార్గదర్శనం వహిస్తూ ఉంటారు. ఇట్టివారిలో పూజ్య గురుదేవులు పండిత శ్రీరామశర్మ అగ్రగణ్యులు.

నేటి మానవజాతిని పట్టిపీడించుచున్న పెద్ద సమస్య విశ్వాసరాహిత్యం. ఆధ్యాత్మిక జ్ఞానముపైన, నడవడిపైనా విశ్వాసం లేదు. తత్ఫలితంగా స్వార్థ చింతనతో, స్వార్థపరత్వంతో, మనము చేసెడి తప్పులు మనకే కాక, మన కుటుంబానికి, వెరశి సమాజానికి తద్వారా దేశానికి, విశ్వానికి నష్టాన్ని కల్గిస్తున్నాము. ఆత్మజ్ఞానము లేనందున మనలో అణగారియున్న అంతఃకరణ, అంతర్గతశక్తులు మేల్కొనుట లేదు, అవి నిరుపయోగమవుచున్నాయి. ఈ లోపాన్ని సవరించి మనిషిని దేవమానవునిగా తీర్చిదిద్దెడి దిశలో, గాయత్రీమంత్ర జపాన్ని పునరుద్ధరించి, సార్వజనీనం గావించిరి గురుదేవులు.

గాయత్రీ మంత్రం అజ్ఞానాన్ని తొలగించి, జ్ఞానాన్ని అందించెడిదీ మంత్ర రాజం. అందువలన దీనిని గురు మంత్రమని పిలిచెదరు. పూజ్య గురుదేవులు తన తపశ్శక్తితో వేదాలకు, ఉపనిషత్తులకు, భాష్యాలు వ్రాశారు. నేడు ఒకే దిశలో మానవుడు పురోగమించుచున్నాడు, అదే భౌతిక శక్తి. తత్ఫలితంగా తనలోని అంతర్గతశక్తి బహిర్గతం కాకున్నది. వెరశి మానవజాతి ప్రగతిలో సమతుల్యత లోపించి, మానసిక వికలాంగులవలె జీవిస్తున్నారు. దీనితో అహంకారం జనించి మాయకు లోనగుచున్నారు. మంచి గుణాల కలయికే భగవత్స్వరూపమనెడి దానిని మరచి పూజకు పరిమితమై మాయా సమ్మోహితులగుచున్నారు. మానవజాతి, విశ్వప్రాణి భవితవ్యాన్ని గురించిన యోచనను వదలి, తనపై నియంత్రణను కోల్పోయి, లక్ష్యహీనంగా జీవిస్తున్నారు. వాని ఫలితమే నేటి సమాజంలోని అభద్రతాభావం, అజ్ఞానం, అశాంతి, సుఖసంతోషాలలేమి, నిరాశ నిస్పృహ, ఆకలి వగైరా బాధలు. దీనితో సైకో-సొమేటిక్ జబ్బులకు లోనగుచున్నారు.

పై వానిని నుండి బయట పడుటకు మార్గము గాయత్రీ మంత్రజపము. ఈమంత్రం జపం మన శరీరంలోనున్న 24 గ్రంథులను ప్రేరేపింపజేసి వానిని శక్తివంతులను చేస్తుంది. వేదమనగా జ్ఞానం, దీనిని ఉత్పత్తి చేసెడిది వేదమాత, జ్ఞానాన్ని అందించెడి, వేదాలకు మూలం గాయత్రి. అందువలన గాయత్రిని వేదమాత అన్నారు. మన దేవతాశక్తులన్నీ ఆ గాయత్రీ మాత వివిధ శక్తులకు ప్రతిరూపాలు.

మెడికల్ కాలేజిలో జబ్బుపడిన గుండెను సరిచేసెడి దానిని నేర్పుతారు. కాని గుండెను ఎలా నిర్మించాలో ఇప్పటివరకు ఎవరూ నేర్పలేదు, ఎవ్వరికీ తెలియదు. అట్లే గుండె పనిచేసెడి విధానాన్ని

[redacted] తన్మయత్వం, ఏకాగ్రత ఇవే సాఫల్యానికి సోపానాలు.

తెలిపెడిది సైన్సు, దీనినిర్మాణం మనకు కన్పించని శక్తి చేసింది. డాక్టరు ఆపరేషన్ చేసి శరీరంలోని చెడు భాగాన్ని తొలగిస్తాడు. ఆ గాయాన్ని మనకంటికి కన్పించని ఓ అదృశ్య శక్తి నయం చేస్తుంది.

మిత్రులారా! నేను ఒక రోజు మన గురుదేవులను ప్రశ్నించాను. "అయ్యా! మందు ఇవ్వకనే అనేక మంది రోగాలను ఎలా తగ్గిస్తున్నారు?" అని. "భగవంతుని శక్తిని ఎలా పొందాలో నాకు తెలుసు. దానితో ఆ శక్తి నా ప్రార్థనలమన్నించి నా ఆశీర్వాదానికి శక్తిని ప్రసాదించి వారికి స్వస్థతను చేకూర్చు చున్నది, ఎవరైతే దయార్ద్ర హృదయులో వారంతా ఆశక్తికి ఇష్టులే" అని వివరించారు. కన్పించని గాయత్రీ మాత తన శక్తిని, మనందరికి సవితాశక్తి రూపంలో అనగా సూర్యశక్తిగా ప్రకటించుచున్నది. అ సవితాశక్తికి 5 ప్రధానలక్షణాలున్నాయి. 1. సృష్టికర్త (జీవదాత) 2 పోషకుడు 3. ప్రేరణాశక్తి 4. శక్తిప్రదాత 5. మార్పులకు మూలం. ఇన్ని గుణాలున్న ఆశక్తిని గాయత్రీ మాతగా వ్యవహరిస్తున్నాం. ఈమె హంస వాహిని అనగా వివేకానికి ప్రతిరూపం, పద్మాసనాన్ని కలిగినది. పద్మం తనకు కప్పిన బురదను తొలగించుకొని వెలుగులోనికి వచ్చెడిది. ఈ రీతిలో మనం కూడా దురాలోచనల నుండి సదాలోచన కలిగించాలి. అట్లే ఆమె కిరీటంలోని 9 మణులు 9 గ్రహాలకు ప్రతీకలు. ఇవి సూర్యుని చుట్టూ తిరుగుతుంటాయి. వీని నుండి మనకు రక్షణ ఆ సవితాశక్తియైన సూర్యుడు ఇస్తాడు. 12 నెలలకు, 9 గ్రహాలు కలసిన శక్తి 12×9=108 అవుతుంది. ఇదే జపమాలలోని పూసల సంఖ్యకు మూలం. జ్ఞానంతో కూడిన సమర్పణ, గాయత్రీ శక్తిని పొందుటకు మార్గాన్ని చూపిస్తుంది. అందులకే గురుదేవులు తనకు మారుగా "కాగడాను" తన ప్రతీకగా అందించి తన శరీరాన్ని విడచి అఖండజ్యోతిలో లీనమైనారు.

సూర్యుడు నిరంతరం హైడ్రోజన్ వాయువుతో జ్వలిస్తూ ఉంటాడు. ఆయన ధ్యానంతో మన మనస్సు, దానిలోని ఆలోచనలు జ్వలింపబడి, మలినాలు తొలగి, స్వచ్ఛమైన ప్రకాశశక్తితో మనము వెలుగొందుతాం. మానసిక జపం ఎక్కువ శక్తినిస్తుంది. జపము ద్వారా శక్తికి దగ్గరౌతాము. ధ్యానం ద్వారా ఏకాగ్రతా శక్తి పెరుగుతుంది. ఏకాగ్రత పెరిగినకొలది సమాధి స్థితికి చేరుకొంటాం. సదాలోచనలతో సత్కర్మలతో నీలోని అంతర్గత శక్తిని మేల్కొలపవచ్చు. దీనిని పెంపొందించుటకై జపము అవసరం. ఈ విధముగా వీరి ప్రసంగం ముగిసింది.

మధ్యాహ్నం 2.30 గంIIలకు ప్రొఫెసర్ ప్రమోద్ భట్నాగర్ **"ఆలోచనల శక్తి** అనెడిదానిపై ప్రసంగించారు. వీరు గాయత్రీ పరివార్ విదేశీ విభాగంలో పనిచేస్తున్నారు. 1971 నుండి గాయత్రీ పరివార్‌లో ప్రముఖ సేవకునిగా కొనసాగుచున్నారు.

మనిషికి విశేషమైన ఆలోచనాశక్తిని భగవంతుడు వరంగా ఇచ్చాడు. మనకున్న అన్ని శక్తులలో ఆలోచనాశక్తి అత్యంత శక్తివంతమైనది, ప్రధానమైనది. మానవజాతి ప్రగతి అంతా కేవలం ఆలోచనాశక్తి వలననే జరిగినది. దీనికి ఉదాహరణ చంద్రునిపై పాదం మోపుట, కంప్యూటర్ ఆవిష్కరణ, సెల్‌ఫోన్ల ఆవిష్కరణ, దూరదర్శని, ఒక్కటేమిటి సకలం. అన్నింటికన్నా కాంతి వేగం గొప్పది. కాని ఆలోచనల వేగం ఇంతకన్నా మిన్నయైనది. ఆ భగవంతుడిచ్చిన ఇంతటి మహత్తరశక్తిని మనం దుర్వినియోగపరచక, సద్వినియోగపరచుకోవాలి. దీనిని సద్వినియోగపరచుకొని అనేకమంది పురాణ పురుషులైనారు. వారిలో శ్రీరాముడు, శ్రీకృష్ణుడు, బుద్ధుడు, క్రీస్తు, మహ్మద్ ప్రవక్త మున్నగు వారున్నారు. అట్లే గాంధీ మహాత్ముడు, కార్ల్‌మార్క్స్, రుసో, వినోబాబావే, శ్రీరామశర్మ ఆచార్య మ్మొదలైనవారు నేటి కాలపు ప్రసిద్ధులు మరియు చరిత్ర పురుషులైనారు. మన ఆలోచనలు మనలను రాక్షసులనుగాను, మహనీయులుగాను మార్చగలవు. **నరుడు నారాయణుడు కావచ్చు లేక నర పశువుగానూమారవచ్చు.** అంగులీమాలుని జీవితం దీనికి మంచి ఉదాహరణ. బుద్ధుని అంగుళి (వ్రేలిని) కత్తిరించి తీసికొనిపోవుటకై వచ్చిన నరరూపరాక్షసుని, బుద్ధుడు ఈ రీతిగా అడిగాడు. "అంగులీమాలా! వ్రేలిని కత్తిరించే ముందు నీవు నాకు ఒక పని చేసిపెట్టు. ఆ చెట్టునకున్న చిన్న కొమ్మను కత్తిరించి తీసికొని రా" అన్నాడు. అంగులీమాలుడు అట్లే చేసి ఆ కొమ్మను అందించాడు బుద్ధునికి. "అంగులీమాలా! తిరిగి ఈ కొమ్మను అదే చోట అతికించి దానికి పూర్వపు స్థితిని కల్పించు" అన్నాడు బుద్ధుడు. "అదెలా సాధ్యం అన్నాడు" అంగులీమాలుడు "అట్లయినచో నా వ్రేలిని తిరిగి అతికించుట చేతకాని వానికి దానిని కత్తిరించే అధికారము లేదు కదా!" అన్నాడు బుద్ధుడు. దీనితో అంగులీమాలుని మనస్సు కకావికలమైపోయి, ఆలోచనలోపడ్డాడు. ఇది అతనిలో ఆత్మావలోకనకు దారి తీసినది. తత్ఫలితంగా బుద్ధుని పరివ్రాజక శ్రేష్ఠులలో ఒకనిగా మారి శ్రేష్ఠమైన పనులు నిర్వహించి చరిత్ర ప్రసిద్ధుడైనాడు.

"యద్భావం తద్భవతి" అన్న రీతిలో రోగిలా భావించేవాడు

[redacted] ఆరోగ్యానికి, ఆనందానికి శత్రువు - ఋణం.

రోగిగా, భోగిగా భావించేవాడు భోగిగా మారెదరు. ఈ రీతిలో నేటి కాలపు చరిత్రలో కార్ల్‌మార్క్సు అత్యంత పేదవాడు కాని శ్రేష్ఠమైన తన ఆలోచనలతో పెట్టుబడీదారి వ్యవస్థను, సోషలిస్టిక్ వ్యవస్థగా మార్చాడు. అట్లే లెనిన్ తన ఆలోచనలతో రాచరికపు వ్యవస్థ ఉన్న రష్యాలో ప్రజాస్వామ్య వ్యవస్థను స్థాపించాడు. ప్రపంచంలో కమ్యూనిజానికి మార్గాన్ని సుగమం చేశాడు. మిత్రులారా! కేంద్రీకరించిన సూర్యకిరణాలు అగ్నిని పుట్టించినట్లు కేంద్రీకరించిన ఆలోచనలు కూడా అద్భుతమైన ప్రభావాన్ని కల్గించుతాయి. ఏకాగ్రతశక్తి ముందు అసమర్థత వీగిపోతుంది. తలవంచుతుంది కూడా. ఆత్మశక్తి ఆలోచనా శక్తిగా తదుపరి సకారాత్మక శక్తిగా మారి అనుభవంలోనికి వస్తుంది. ఆలోచనా శక్తి చరిత్రలో సజీవంగా నిలచిపోయింది అని చెప్పుటకు అనేక ఉదాహరణలు ఉన్నాయి. జేమ్స్‌వాట్ ఆవిరియంత్ర ఆవిష్కరణ, న్యూటన్ శాస్త్రవేత్త భూమ్యాకర్షణ సిద్ధాంతం, మార్కొని రేడియో ఆవిష్కరణ, గ్రాహంబెల్ టెలిఫోన్ ఆవిష్కరణ మున్నగునవి.

మిత్రులారా! ఋషుల చెంత ధనం లేదు కాని ఆధనాన్ని సృష్టించగల ఆలోచనా శక్తులున్నాయి. వారి వద్ద ఆలోచనలకు భౌతిక ఆకారం లేదు, కాని మనిషిని మార్చగల సత్తా వారికున్నది. ఆలోచనలు ప్రపంచాన్ని ఏలుతాయి. ఆధ్యాత్మిక శక్తి అత్యంత గొప్పది. వైజ్ఞానిక శక్తి తెలివితక్కువ వానిని తెలివిమంతునిగా మార్చలేదు. కాని ఆధ్యాత్మిక శక్తితో ఇది సుసాధ్యమే. ప్రాణ చికిత్సకు ఇదేమూలం. దీనికి ఏకాగ్రత, దృఢసంకల్పం మరియు క్రమబద్ధత కావాలి. మృత్యువు సమీపించిన వేళ మానవుని ఆలోచనా సరళి అతని లేక ఆమె మరుజన్మను నిర్ధారిస్తుంది.

మిత్రులారా! మన గురుదేవులు ఈ ఆలోచనా శక్తిని ఆయుధంగా చేసికొని మనుష్యుల ఆలోచనా విధానాన్ని పూర్తిగా ప్రక్షాళన గావించి ధర్మ మార్గంలో నడిపించుచూ యుగపరివర్తన గావించి భూమిపై స్వర్గావతరణకై పాటుపడినారు. ఆయన చూపిన మార్గంలో మనమంతా పయనిస్తూ యుగనిర్మాణ దిశగా అడుగులు వేయుట మనందరి కర్తవ్యం అని ఉద్బోధించిరి.

23వ తేది ఉదయం డా॥ బ్రిజ్‌మోహన్ గౌర్ ప్రసంగిస్తూ మీరంతా చాలా అదృష్టవంతులు కనుకనే ఈ పుణ్యభూమి శాంతికుంజ్‌లో అడుగుపెట్టగల్గారు. పూజ్య గురుదేవుల సందేశాన్ని మీ వద్దకు చేర్చుతాను. ఈ ప్రపంచంలో రెండు ప్రధాన శక్తులున్నాయి. 1. వైజ్ఞానిక–భౌతిక శక్తి, 2. ఆధ్యాత్మిక శక్తి మొదటిది అశాశ్వతమైన భౌతిక సుఖాలను మాత్రమే అందిస్తుంది. కాని రెండవది శాశ్వత సుఖాలైన ఆధ్యాత్మిక ఆనందాన్ని అందించి, జీవన విధానాన్ని బోధిస్తుంది. ప్రతిభాశాలి తనతోపాటు సమాజానికి కూడా ఉన్నతిని ప్రసాదిస్తాడు. దీనికి ఉదాహరణ శ్రీ వివేకానంద స్వామి కాళి ఉపాసన ద్వారా కాళీమాతను ప్రత్యక్షం గావించుకుని తనకు కొలువు ఇప్పించమని ప్రార్థించగా "వత్సా! నీవు నీకు జన్మనిచ్చిన వారికే చెందినవాడవు కావు, నీవు విశ్వమాత బిడ్డవు. కావున విశ్వానికి నీ సేవలనందించు" అనెడి సూచన వివేకానందుని చెవి సోకింది. అప్పుడు వివేకానందుడు తన జీవితలక్ష్యాన్ని గుర్తించి, తన గురుదేవులైన శ్రీరామకృష్ణ పరమహంస ఆదేశానుసారం తన జీవితాన్ని మలచుకున్నాడు.

ఇదే రీతిలో మీరు సర్వవేళలా సదాలోచనలతో సదాచార సంపన్నులుగా ఎదగాలి. ఆరాధనా సేవలతో వ్యక్తిగా, భక్తునిగా, సేవకునిగా తదుపరి ఆరాధ్యునిగా మారతాడు. శిక్షణతో బుద్ధిని సవరించుకొని ధర్మాచరణతో దానిని పెంపొందించుకోవాలి. మనుష్యుల మస్తిష్కాలు మార్చాలి. దీనికై మీరు ఇంటింటా గాయత్రీ మంత్రాన్ని ప్రచారాన్ని చేయండి. సమయదానం, అంశదానాలనందించండి అని ఉద్బోధించారు.

రాత్రి 7.15 నుండి దక్షిణ భారత ప్రధాన సంచాలకులైన శ్రీ అశ్విని సుబ్బారావు గారు ప్రజ్ఞాపురాణ కథలను విన్పించారు.

శ్రీ సుబ్బారావుగారు తమ ప్రవచనం ద్వారా ప్రజ్ఞాపురాణ కథల ప్రాశస్త్యాన్ని వివరిస్తూ రానున్న రోజులలో ఇవి వాడవాడలా ప్రజాదరణను పొంది, ప్రజల జీవితాన్ని సుసంపన్నం చేస్తాయి. వారి కథలో భార్యాభర్తల మధ్య ప్రేమ, పరస్పర గౌరవం సుసంపన్నమై, సమర్పణా భావంతో త్యాగబుద్ధితో వారు జీవించాలని తెలిపారు. అట్లే భారవి కవి వృత్తాంతం ద్వారా, పుత్రుడు తల్లిదండ్రుల పట్ల వినయవిధేయతలతో, గౌరవప్రపత్తులతో మెలగాలని ఉద్బోధించారు. అట్లే వృద్ధాప్యములో కుటుంబ బాధ్యతలను సంతానమునకప్పగించి, వానప్రస్థము స్వీకరించి సమాజ ఋణం తీర్చుకోవాలి అని ఉద్బోధించిరి.

24వ తేది ఉదయం మంత్రదీక్షలనిచ్చారు. తదుపరి శ్రీ నమో నారాయణ పాండేగారి ప్రవచనం ఈ క్రింది విధంగా జరిగింది.

గాయత్రీ మాత శక్తి మనకు లభించనవలయునని గాయత్రీ మంత్ర జపము నియమనిష్ఠలతో దృఢసంకల్పముతో క్రమపద్ధతిలో

**[redacted] ఆదర్శవాదికి దురదృష్టం అనేది ఉండదు.**

చేయాలి. మందు లక్షణాలు తెలియకపోయినా, మందుల వాడకంతో రోగికి స్వాంతన లభించిన రీతిలో గాయత్రీ మంత్రార్థము తెలియకున్ననూ జపించెడివారికి దాని జపఫలం తప్పక కొంతలో కొంత లభించి తీరుతుంది అన్నారు.

ఉపాసన, సాధన మరియు ఆరాధన ద్వారా, అనగా ఉపాసనతో భగవంతుని ధారణ చేసికొని, సాధన ద్వారా తగిన సంస్కారముల అనుభవంలోనికి తెచ్చుకొని, ఆరాధన ద్వారా సమున్నతిని పొందాలి. అన్యాయాన్ని సహిస్తూ మిన్నకుండెడి వారు కూడా ఆ చెడు ఫలితాలను తప్పక అనుభవించెదరు. సూర్యోదయ, సూర్యాస్తమ వేళలలో సూర్యశక్తి అనగా ప్రాణసంచారశక్తి అధికంగా ఉంటుంది. దీనివలన ఈ సమయాలలో గాయత్రి జపమాచరించుట ఉత్తమం అని ప్రవచించిరి.

25వ తేది ఉదయం శ్రద్ధాతర్పణ కార్యక్రమంలో పాల్గొనినారు. ఈకార్యక్రమాన్ని శ్రీ పరమానంద ద్వివేది, శివాజీ గార్లు నిర్వహించారు. తదుపరి శ్రద్ధేయ డా॥ ప్రణవ పండ్యా మరియు శ్రద్ధేయ శైలబాలల ఆశీర్వాదాన్ని పొందుటకై వారిని దర్శించుట జరిగినది.

**డా॥ ప్రణవ్ పండ్యాగారి ప్రవచనం:** దక్షిణ భారతదేశంలోని అన్ని ప్రాంతాలలో ఆంధ్రప్రదేశ్ ఉత్తమమైనది. సంస్కృతీపరంగా విశిష్టమైనది. మీరు కూర్చున్న ప్రదేశం అలనాటి విశ్వామిత్ర మహర్షి తపస్థలి. ఇచ్చట పరమపూజ్య గురుదేవులు తపమాచరించారు. వారి వెంట చాలా సంవత్సరాలు గడిపాను. వారి ప్రతిమాటను డైరీలో వ్రాసికొన్నాను. 200 పుస్తకాల దాకా నిండాయి. వినాయకుడు వ్యాసభారతాన్ని వ్రాసిన రీతిలో నేను గురుదేవుల భావాలను ప్రసంగాలను వ్రాశాను. 5 సంవత్సరములు ముందుగనే తాను ఏ రోజు ఏ సమయానికి తనువు చాలించనున్నది నాకు తెలిపారు. ప్రపంచమంతా ఒక విపణిగా మారిన ఈ రోజులలో శాంతికుంజ్‌లోని సేవలన్నీ ఉచితముగానే అందించబడుచున్నాయి. తనకున్న ప్రతిభా సంపదలను ఆ దేవుని పొలంలో నాటగా, అవి వందలు వేల సంఖ్యలో తనకు లభించాయి అనెడి వారు గురుదేవులు. మనలో అంతఃకలహాలకు బదులు భావసంవేదనలు పెంపొందాలి. ప్రేమ, ఆదరాభిమానాలను పంచండి. ఆధ్యాత్మికత అనెడిది ఉత్తమ భావాలను సంస్కృతిని, అలవాట్లను, పెంపొందించెడి క్రియ. వ్యక్తిత్వ నిర్మాణముతో గాయత్రి జపం ముడివడియుండగా సమాజ నిర్మాణంతో యజ్ఞ ప్రక్రియ ముడివడియున్నది. ప్రపంచమంతటా 11 కోట్లమంది గాయత్రీ పరివార్ సభ్యులు ఉన్నారు. దీనిలో 4 నుండి 5 కోట్ల మంది నిత్యం అంశదానమందింస్తూ ఉంటారు. అఖండజ్యోతికి 25 లక్షల మంది పాఠకులున్నారు. ఆలోచనలలో మార్పుతీసికొని వచ్చి మనుష్యుల జీవితాలను మంచి మార్గం వైపు మరల్చుట దీని లక్ష్యం. పూజ్య గురుదేవులు మనలనందరిని తన బిడ్డలుగా, చూచుటయే గాక, తన అంగాంగాలుగా చూసారు. ప్రపంచంలో మరే గురువు ఈ రీతిగా తన అనుచరులను చూసి యుండలేదు. విదేశీ సంస్కృతులు, భారతీయ సంస్కృతిపై దాడి చేస్తున్నాయి. దీనిని నిలువరించి, మన సంస్కృతిని కాపాడుకొనవలసిన కనీస బాధ్యత మనందరిపైనున్నది. ఇదే గురుదేవులు మనలనుండి చేయిచాపి అడుగుచున్నారు. దీనిని మీరంతా నెరవేర్చాలి. ఆ తదుపరి శ్రద్ధేయ ఆదరణీయ శైలబాల పండ్యా గారు అందరినీ ఆశీర్వదించుతూ ప్రసంగించారు. ప్రసాదవితరణతో కార్యక్రమం ముగిసింది.

ఆ పిమ్మట ఉదయం 10 గంటలకు అశ్విని సుబ్బారావు గారు ప్రవచిస్తూ యమనియమాల ప్రాశస్త్యాన్ని వివరించారు.

తదుపరి పరమానంద ద్వివేదిగారు ఉపాసన, సాధన, ఆరాధనల ప్రాశస్త్యాన్ని వివరిస్తూ 5 కర్మేంద్రియాలు, 5 జ్ఞానేంద్రియాలను, మనస్సును బుద్ధిని, చిత్తాన్ని మరియు అహంభావాన్ని ఏ విధంగా మచ్చిక చేసికొనవలసినది తెల్పారు.

*– గాయత్రీ చేతనా కేంద్రము, హైదరాబాద్*


## క్యాలెండర్ - 2011

*పరమ పూజ్యగురుదేవుల జన్మశతాబ్ది సందర్భమున ఒక ప్రత్యేకమైన క్యాలెండర్ 14 పేజీలతో పంచరంగులలో ఆర్టు పేపరుపై ప్రచురింపబడుతున్నది. విడి క్యాలెండర్ ధర 15 రూపాయలు. 50కి పైగా ఆర్డర్ ఇచ్చిన వారికి రిబేటు ఇవ్వబడుతుంది. క్యాలెండర్‌లో ప్రతి పేజీలో ప్రకటన స్థలంలో వ్యాపార సంస్థలు తమ పేరు వేయించుకోవచ్చు. దీని కొరకు ప్రతీ క్యాలెండర్‌కు 3 రూపాయలు అదనంగా చెల్లించాలి. 300 క్యాలెండర్లకు తక్కువ కాకుండా ఆర్డర్ ఇవ్వవలెను.*


**వివరములకు సంప్రదించండి - 9949111175**


**[redacted]రణ ద్వారా ఇచ్చే ఉపదేశమే సార్థకమౌతుంది.**

అక్షరాల ఆట

# పదగాయత్రి-2

నిర్వహణ : సాధన నరసింహాచార్య



### పదగాయత్రి-1 సమాధానాలు

| | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| 1 యు | 2 గ | శ | క్తి | 4 గా | 5 య | 6 త్రి | X |
| 7 వ | ర | X | ము | య | న | 8 ప | X |
| రా | ళి | ము | 9 వి | X | ము | ధ | 10 ప |
| 11 జు | ము | X | X | X | వా | X | రి |
| X | X | X | 12 న్యం | సై | X | 13 బా | పూ |
| 14 వం | నో | మ | జ | X | 15 సు | స | ర్ల/ర్ణ |
| ణ | X | X | చ | X | ఖం | X | త్వ |
| ప్ర | ణ | వ | పాం | ద్య | X | 17 మో | ము |

పేరు : ..................................................

చిరునామా : ..................................................

..................................................

.................... పిన్ కోడ్ : ....................

ఫోన్ నెం : ..................................................

### ఆధారాలు

**అడ్డం**

1. పెద్దలు కన్పించినపుడు చేయవలసినది (5)
3. మధ్య లోపించిన బంగారం (2)
4. "శ్రీ" కి వికృతి (2)
5. అస్తవ్యస్తమైన నారదప్రియం (4)
8. కాశీ నగరానికి ఆద్యంతాలు (2)
9. ఆయనం లాంటిదే (4)
10. అంతరంలో జనరేషన్ (2)
11. వేగానికి చిహ్నం, స్వారీ కూడా చేయవచ్చు (3)
14. జయవిజయులు ఉండేది, శాంతికుంజ్ స్థానం కూడా (5)
15. ప్రధాన అంగం (3)
18. విశేషమైన చేతులు కలవారు (4)
19. మునక కాదు, పట్టుకుంటే కుదుతుంది (2)

**నిలువు**

1. దీపావళి ముందురోజు (7)
2. అటు ఇటైన ఎడబాటు (4)
3. చివర లోపించిన గాయత్రీ కుటుంబం తెలుగులో (4)
6. అటుఇటైన యరల
7. అతిగా పొగిడితే ఈ చెట్టు ఎక్కించినట్లే (3)
8. ఏడురోజుల సంగమం (2)
12. ఒత్తు లోపించిన ఇంద్రధనస్సు (4)
13. విముఖులు కాని, ప్రసిద్ధులు (4)
16. ప్రపంచ నేత్రం (2)
17. తోక త్రొక్కిన త్రాచు కోపంతో తిరగబడి ఇలా పడగవిప్పింది (2)

**నిబంధనలు :**

*1. కూపన్లు చేరవలసిన చివరి తేది 18-12-2010*
*2. పత్రికలో పైన ఇచ్చిన కూపన్‌నే పంపవలెను.*
*3. దిద్దుబాట్లు / కొట్టివేతలు / తుడుపులు ఉండరాదు.*
*4. తెల్లకాగితాలు / జిరాక్స్ కాపీలు అనుమతించబడవు.*
*6. అన్ని కరెక్టు అయిన ఎంట్రీలు ఎక్కువ సంఖ్యలో ఉన్నచో లాటరీ ద్వారా ఎంపికచేసి* ***ప్రథమ బహుమతి రూ. 100/-లు, ద్వితీయ బహుమతి రూ. 50/-లు*** *ఇవ్వబడును.*
*7. తపాలశాఖవారి ఆలస్యానికి పత్రిక బాధ్యత వహించదు.*
*8. బహుమతుల విషయంలో తుది నిర్ణయం సంపాదకులదే. ఎలాంటి వివాదాలకు తావులేదు.*
*9. పేరు, చిరునామాలు స్పష్టంగా, పిన్‌కోడ్‌తో సహా వ్రాయాలి.*

**చిన్న సవరణ :** క్రిందటి సంచిక పదగాయత్రి-1లో 12వ (అడ్డం) ఆధారానికి, 13వ ఆధారానికి మధ్యలో "×" ప్రచురితం కాలేదు. అయినా అక్షరాల సంఖ్యను బట్టి సమాధానాలకు ఇబ్బంది లేదు. 15వ ఆధారానికి (అడ్డం) "ర్ల" వచ్చేటట్లుగా ఇవ్వడం జరిగింది. జరిగిన పొరపాటుకు క్షంతవ్యులము.

**పదగాయత్రి-1 విజేతలు**

ప్రథమ బహుమతి విజేత (రూ. 100/-) : **శ్రీ పి.వి.రమణరావు,** విశాఖపట్నం

ద్వితీయ బహుమతి విజేత (రూ. 50/-) : **శ్రీ వి. నాగమణి,** ఈపురుపాలెం (చీరాల మండలం)

త్వరలో విజేతలకి నగదు బహుమతిని యం.ఒ. ద్వారా పంపబడును

– సంపాదకులు

**ఎంట్రీలు పంపవలసిన చిరునామా**

[redacted] **గాయత్రి,** అశ్విని హౌస్ ప్రక్కన, గాయత్రీ చేతనా కేంద్రం, మూసాపేట, హైదరాబాద్-18.